


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


పంట వ్యర్థాల దహనాన్ని 'రాజకీయం చేయొద్దు' 05

తెలంగాణకు మణిహారం 'ఎర్త్ యూనివర్సిటీ' 03

నిర్దేశిత సమయంలో మేడారం అభివృద్ధి పనులు పూర్తి : సిఎం


సంపుటి 28, సంచిక: 162 | మంగళవారం | 02-12-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00







"పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా, ఇక్కడి నేలకు నీళ్లు అందలేదు. మాయగాళ్ల మాటలు విని ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు. ఎంత డబ్బు ఖర్చయినా సరే మక్తల్ - నారాయణపేట ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌ను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నాం. - సిఎం

# అభివృద్ధిని అడ్డుకునే వాళ్ళొద్దు

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే వారిని గెలిపిస్తే గ్రామం అభివృద్ధి చెందదు
- వందేళ్లుగా బిసిల లెక్కలే లేవు
- కెసిఆర్ అప్పులు తీరుస్తూనే పథకాలు అమలు చేస్తున్నాం
- ఉమ్మడి ఎపి, తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్‌పై నిర్లక్ష్యం
- పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించాం
- నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో సిఎం రేంత్‌రెడ్డి

ప్రజాక్షం/వనపర్తి/ నారాయణపేట

'అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించొద్దు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే వాళ్లను గెలిపిస్తే గ్రామం అభివృద్ధి చెందదు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపిస్తేనే గ్రామం బాగుపడుతుంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. బిసిలు ఎంతమంది ఉన్నారో వందేళ్లుగా లెక్కలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సామాజిక కుల సర్వే చేసి అన్ని కులాల లెక్కలు తీసుకున్నామని తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి పోయారని విమర్శించారు. ఓవైపు కెసిఆర్ చేసిన అప్పులు తీరుస్తూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో మాట్లాడారు. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పదేళ్ల పాటు నిర్లక్ష్యం చేశారని, ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రాంతానికి ఏదైనా చేయాలని గతంలో ఏ నాయకుడు కూడా అనుకోలేదని విమర్శించారు. అందుకే ఈసారి ఇక్కడి ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తికావొస్తుందని రేవంత్ గుర్తు చేశారు. రెండు తరువాయి 2లో



# 'సర్'పై నిరసనలతో తొలి రోజు వాయిదా

- పార్లమెంట్‌లో చర్చకు ప్రతిపక్ష పార్టీలు పట్టు
- వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు
- కొనసాగిన వాయిదాల పర్వం
- సభ నేటికి వాయిదా
- మణిపూర్‌లో జిఎస్‌టి బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. లోక్‌సభ తొలిరోజే అట్టుడికిపోయింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై చర్చకు ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టాయి. దీంతో మధ్యాహ్నం 2.20 గంటల ప్రాంతంలో సభను మంగళవారానికి వాయిదా వేశారు. విపక్షల సభ్యుల కోలాహలం మధ్య మణిపూర్‌లో జిఎస్‌టి చట్టానికి సవరణలను అమలు చేయడానికి బిల్లును కొద్దిసేపు చర్చ తర్వాత ఆమోదించారు. సభ మరుసటి రోజుకు వాయిదా పడడానికి ముందు కూడా పలుమార్లు వాయిదాల పర్వం కొనసాగింది. ఉదయం, మధ్యాహ్నం ప్రశ్నోత్తరాల సమయంలో సభ రెండుసార్లు వాయిదా పడింది. 15 పనిదినాల్లో సమావేశాలు జరిగే శీతాకాల సమావేశాల మొదటి రోజే తరచూ అంతరాయం ఏర్పడింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీరో అవర్‌లోని 12 నిమిషాల సమయంలో సీతారామన్ 2025–2026 సంవత్సరానికి తరువాయి 2లో

పార్లమెంట్‌లో డ్రామాకు చోటు లేదు : మోదీ

05

మోదీ 'అతిపెద్ద డ్రామాబాజ్': కాంగ్రెస్




# రెండు నెలల్లో ఎఐ యూనివర్సిటీ

- ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల సాంకేతిక సహకారంతో ప్రారంభిస్తాం
- సాఫ్ట్ వేర్ రంగంలో పనిచేస్తున్న ఇంజనీర్లు, చదువులు పూర్తి చేస్తున్న విద్యార్థులకు నూతన నైపుణ్యాల్లో శిక్షణ
- ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి
- మాదాపూర్‌లో కోవాసెంట్ ఎఐ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల సాంకేతిక సహకారంతో మరో రెండు నెలల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) యూనివర్సిటీని ప్రారంభిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సాఫ్ట్ వేర్ రంగంలో పనిచేస్తున్న ఇంజనీర్లు, చదువులు పూర్తి చేస్తున్న విద్యార్థులకు దీని ద్వారా నూతన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు. మాదాపూర్‌లో కోవాసెంట్ ఎఐ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం 500 మంది ఇంజనీర్లు పనిచేస్తున్న కోవాసెంట్ మరో రెండేళ్లలో 3000 మంది ప్రతిభావంతులను ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని శ్రీధర్ బాబు చెప్పారు. ఎఐ సాంకేతిక దూకుడుతో కోడింగ్‌లో ఉన్నవారు ఇతర ప్లాట్ ఫారాల్లో పనిచేస్తున్న వారు నైపుణ్యాలను పెంచుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. వారందరికీ ఎఐ యూనివర్సిటీ ద్వారా రీస్కిల్, అప్ స్కిల్స్ అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కోవాసెంట్ చైర్మన్ సి.వి.సుబ్రమణ్యంను తరువాయి 2లో

'గిగ్‌కార్మికులకు భద్రతా చట్టం'

# ప్రభుత్వానికి విధానపరమైన సిఫార్సు పత్రం



- నివేదికను అందజేసిన సిఆర్ ఫౌండేషన్ ప్రతినిధి బృందం
- ధన్యవాదాలు తెలిపిన మంత్రి వివేక్ వెంకటస్వామి
- మరిన్ని సూచనలు చేయాలని మంత్రి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

'గిగ్‌కార్మికుల భద్రత'చట్టాన్ని రూపొందించేందుకు విధానపరమైన సిఫార్సులతో కూడిన పత్రాన్ని, నివేదికను సి.ఆర్. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ తరువాయి 2లో



# 25 వేల ఓటర్లతో క్లస్టర్

- వైశాల్యానికి అనుగుణంగా క్లస్టర్‌ల అనుసంధానంతో మహా జిహెచ్‌ఎంసి వార్డుల ఏర్పాటు
- పూర్తయిన వార్డుల పునర్విభజన
- మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల విలీనం కోసం 'మహా' క్రతువు

ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)లో 20 మున్సిపాలిటీలు, 7మున్సిపల్ కార్పొరేషన్‌ల విలీన ప్రక్రియపై చేపట్టిన కసరత్తు సుదీర్ఘంగా సాగుతోంది. ఈ క్రతువులో జిహెచ్‌ఎంసి, శివారు మున్సిపల్ సంస్థలకు చెందిన టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగాల యంత్రాంగం తలమునకలైంది. అయితే వార్డుల పునర్విభజనపై ప్రధానంగా యంత్రాంగం దృష్టిసారించింది. ప్రస్తుతం జిహెచ్‌ఎంసి పరిధిలో 150 వార్డులు ఉన్నాయి. విలీనమయ్యే మున్సిపల్ సంస్థలలో ఎన్ని వార్డులు ఏర్పాటు చేయాలి, ఎంతమంది ఓటర్లతో ఏర్పాటు చేయాలనే అంశాలపైనే ప్రధానంగా దృష్టిసారించారు. ఇందుకు ఒక అంచన కోసం ప్రాథమికంగా జిహెచ్‌ఎంసితో పాటు విలీనమయ్యే ప్రాంతాలలో 25 వేల ఓటర్లతో క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 25 వేల ఓటర్లతో కలిపి క్లస్టర్‌లను సిద్ధం చేశారు. దీనికోసం ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగం సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసిహెచ్‌ఆర్‌డి)లోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సిజిజి)లో జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగాలు, జిహెచ్‌ఎంసిలో విలీనమయ్యే మున్సిపల్ సంస్థలకు చెందిన టౌన్ ప్లానింగ్, ఎన్నికల విభాగాల అధికారులు పలు పంచుకుంటున్నారు.

**క్లస్టర్‌ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి..**

టౌన్‌ప్లానింగ్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది సమన్వయంతో 25 వేల ఓటర్లతో కూడిన క్లస్టర్ ఏరియాల రూపకల్పన చేపట్టారు. ఈ క్రమంలో ఏ ప్రాంతంలో ఓటర్ల సంఖ్య ఎంత ఉంది, ఆ ప్రాంతంలో 2011 లెక్కల ప్రకారం జనాభా, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రస్తుతం తరువాయి 2లో




# సైబర్ ఖాతాల ఫ్రీజ్‌కు ఎఐ ఎందుకు వాడట్లే?

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

డిజిటల్ అరెస్ట్ మోసాలపై ముందుగా దర్యాప్తుకు సిబిఐకి ఆదేశం

అనుమతి ఇవ్వాలని అన్ని రాష్ట్రాలకు సూచన

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాలపై ముందుగా దర్యాప్తు చేపట్టాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)ను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించిన కేసుల దర్యాప్తును సిబిఐకి అప్పగించేలా అనుమతి ఇవ్వాలంటూ బంగాల్, తమిళనాడు, కర్ణాటక, తరువాయి 12లో

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు

# క్షమాభిక్ష వద్దు

- ఇజ్రాయెల్‌లో ప్రజాగ్రహం
- అధ్యక్షుడి నివాసం వెలుపల ప్రదర్శన

**టెల్అవీవ్:** అవినీతి, మోసం కేసుల్లో నిందితుడుగా ఉన్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ (76) క్షమాపణ కోరుతూ దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు లేఖ సమర్పించడంపై ఆ దేశంలో తీవ్ర ఆగ్రహం చెలరేగింది. ఆయన క్షమాపణ లేఖ సమర్పించిన కొద్ది గంటల వ్యవధిలోనే భారీసంఖ్యలో ప్రజలు ఆదివారం రాత్రి పొద్దుపోయాక టెల్‌అవీవ్‌లోని దేశాధ్యక్షుడి నివాసం వెలుపల గుమిగూడి నిరసన ప్రదర్శన జరిపారు. అవినీతి ప్రధానమంత్రికి ఏ విధంగా క్షమాభిక్ష ఇస్తారని నిలదీశారు. ఆయనకు క్షమాభిక్ష ఇవ్వకూడదని నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు, ప్రజలు ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఎలాంటి జవాబుదారీ లేకుండా మోసాల నుండి ఎలా విముక్తి అడుగుతారని నిలదీశారు. నెతన్యాహూ తరువాయి 12లో






# నాలుగు ఆగ్నేయ ఆసియా దేశాల్లో 1000 మంది మృతులు

- తుఫానులు, భారీ వరదల ధాటికి మృత్యువాత
- లక్షలాది మంది నిరాశ్రయులు


**కొలంబో:** ఆగ్నేయ ఆసియాలో శ్రీలంక,ఇండోనేసియా,థాయ్‌లాండ్, మలేసియా నాలుగు దేశాలను వారం రోజులకుపైగా తుఫానులు, భారీ వరదలు సహా ఇతర ప్రకృతి విలయాలు కుదిపేయడంతో 1000 మందికిపైగా ప్రజలు మరణించారు. లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ఐతే ఈ దేశాలలో పరిస్థితులు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నప్పటికీ సహాయ కార్యక్రమాలు తరువాయి 12లో

# మున్సిపాలిటీల విలీన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం..



ప్రజాపక్షం/హైదరాబాద్

జిహెచ్‌ఎంసిలో 'మున్సిపాలిటీల విలీన ఆర్డినెన్స్'కు గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ ఫైల్ ప్రభుత్వానికి చేరడంతో దీనిపై తెలంగాణ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయనుంది. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి)ను తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## సూడాన్‌లో ఇళ్ళువదలి పారిపోయిన ప్రజలు

**కార్టూమ్:** సూడాన్‌లో అంతర్యుద్ధం ముదిరిపోవడంతో దక్షిణ కోర్డోఫోస్‌లోని కెర్తాల్ పట్టణం నుండి ఒక్కరోజు వ్యవధిలోనే 1600 మంది ప్రజలు భయంతో ఇళ్ళు వదలి పారిపోయారు. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఒఎం) సోమవారం ఈ విషయం ప్రకటించింది. సాధారణ సైన్యంపై అంతర్యుద్ధం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ ఇటీవల తనంతట తానుగా కాల్పుల విరమణను పాటించినప్పటికీ, ప్రజలపై దాని ఆగడాలు మితిమీరుతున్నాయి. సూడాన్ పీపుల్స్ లిబరేషన్ మూమెంట్ నార్త్ మద్దతులో ఆర్‌ఎస్‌ఎఫ్ దాడులు చేస్తూ ఉండటంతో ప్రజలు అభద్రతతో ఇళ్ళు వదలి పారిపోతున్నారని ఐఒఎం తెలిపింది.

2023 నుండి సూడాన్‌లో రెండు సైనిక వర్గాల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతున్నది.



## బ్రిటన్ ఎంపి సహా హసీనా సిస్టర్స్‌కు
# జైలుశిక్ష విధించిన బంగ్లాదేశ్ కోర్టు

**ఢాకా :** బ్రిటన్ దేశ మహిళా ఎంపి తులిప్ సిద్ధిఖ్ (ముజిబుర్ రెహ్మాన్ మనుమరాలు)కు రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ బంగ్లాదేశ్ కోర్టు తీర్పు చెప్పింది. పూర్వాంచల్ ప్రాంతంలో నివాసిత ప్రాంతాల ప్రాజెక్టుకు సంబంధించిన ప్లాట్ల కేటాయింపులో అవినీతి అక్రమాలు జరిగాయంటూ పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా (78)పై పలు కేసుల్లో విచారణ జరుగుతోంది. ఈ విచారణ కొనసాగింపు చర్యల్లో భాగంగా హసీనాతోపాటు ఆమె చెల్లెలు షేక్ రెహనాలతోపాటు బ్రిటన్ ఎంపి తులిప్‌కు కూడా వేరువేరుగా జైలుశిక్షలు విధిస్తూ ఢాకాలోని కోర్ట్ నెం–4 ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ రబియుల్ అలమ్ సోమవారం తీర్పులు చెప్పారు. మొత్తం 17 మందిపై అవినీతి వ్యతిరేక విభాగం కేసులు నమోదు చేసింది. వీరిలో మరో 14 మందికి ఐదేసి సంవత్సరాలు వంతున శిక్షలు విధించింది. అదేవిధంగా హసీనా, రెహనా, సిద్ధిఖ్‌లకు ఒక లక్ష టాకాల వంతున జరిమానా కూడా విధించారు. మొత్తం 17 మందికీ ఈ లక్షవంతున జరిమానాలు పడ్డాయి. జరిమానా చెల్లించలేక పోతే మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.



గత ఏడాది జులై విద్యార్థి ఉద్యమంలో నిరాయుధులైన యువకులను మారణాయుధాలతో హింసాత్మకంగా అణచివేయడానికి ప్రధాన కారకురాలు హసీనా అని తేల్చి చెప్పిన ఐసిటి (అంతర్జాతీయ క్రైమ్ ట్రిబ్యునల్) ఆమెకు ఉరిశిక్ష విధించింది. ఆ తర్వాత మరో న్యాయస్థానం ప్లాట్ల కేటాయింపు అవినీతిలో ఆరు కేసుల విచారణ చేపట్టింది. వీటిల్లో మూడు కేసులకు సంబంధించి ఇచ్చిన తీర్పుల్లో హసీనాకు 21 ఏళ్ళు జైలుశిక్ష పడింది. ఇప్పుడు తాజాగా సోమవారం వెలువడిన తీర్పులో హసీనాకు ఐదు సంవత్సరాలు జైలుశిక్ష పడింది. ఆమె సోదరి రెహనాకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించగా వారితో ఈ అవినీతిలో భాగస్వామిగా ఉన్న బ్రిటన్ ఎంపి తులిప్‌కు రెండు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు. ఐతే ఈ శిక్షల తీర్పులు, ఈ కేసుల విచారణ నిందితుల సమక్షంలో జరగలేదు. వారంతా కోర్టులోగానీ, బంగ్లాదేశ్‌లో లేరు. వారు లేకుండానే ఈ కేసుల విచారణ, శిక్ష తీర్పులు వెలువడ్డాయి.

దీంతో షేక్ హసీనాపై ఇప్పటివరకూ నాలుగు అవినీతి కేసుల్లో మొత్తం 26 సంవత్సరాలు జైలు శిక్షలు (మూడు కేసుల్లో 21 సంవత్సరాలు, ఒక కేసులో ఐదు సంవత్సరాలు) పడినట్లయింది. ఇంకా రెండు అవినీతి కేసులలో విచారణ, తీర్పులు పెండింగ్‌లో ఉన్నాయి. బంగ్లాదేశ్ ఎసిసి (అవినీతి వ్యతిరేక కమిషన్) ఈ కేసులు వారిపై నమోదు చేసింది.

**ఎవరీ తులిప్ సిద్ధిఖ్?:** బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ మనుమరాలు తులిప్ సిద్ధిఖ్ (42) బ్రిటన్ మాజీ మంత్రి. లేబర్ పార్టీ తరపున ఆమె హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అన్నింటికంటే ఎక్కువగా బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సోదరి, బంగ్లాదేశ్ అవామీ లీగ్ నాయకురాలు రెహనా కుమార్తె తులిప్ సిద్ధిఖ్. పూర్వాంచల్ అవినీతిలో తన పెద్దమ్మను తులిప్ ప్రభావితం చేశారన్నది ఆమెపై అవినీతిశాఖ అభియోగం. ఆమె 1982లో లండన్‌లోని షట్టన్‌లో ప్రొఫెసర్ షఫీక్ అహ్మద్ సిద్ధిఖ్, రెహనాలకుజన్మించారు.

# ట్రంప్ జవాబివ్వాలని చట్టసభ డిమాండ్

**వాషింగ్టన్ :** కరీబియన్ జలాల్లో డ్రగ్స్ బోట్లపై దాడుల విధానం, వాటి పర్యవసానాలపై సమాధానం చెప్పాలని అమెరికా చట్టసభ సభ్యులు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను నిలదీశారు. కరీబియన్ దీవుల్లో బోట్లపై క్షిపణి దాడులు చేసి స్వాధీనం చేసుకున్న తర్వాత ఆ బోట్లలో ఇంకా సజీవంగా ఉన్నవారిపై పదే పదే దాడులు చేసి చంపాలంటూ ఆదేశాలిచ్చారని వచ్చిన నివేదికపై సమాధానం చెప్పాలని వారు ట్రంప్ పాలనాయంత్రాంగంపై ఒత్తిడి చేశారు. ఒకవేళ అదే నిజమైతే ఈ ఆదేశాలు యుద్ధనేరంతో సమానంగా పరిణించాల్సి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిని అన్యాయంగా, అమానుష చర్యగా పేర్కొన్నారు. మొదట దాడి చేసిన తర్వాత ఇంకా సజీవంగా ఉన్నవారిని కూడా చంపాలంటూ ఎందుకు ఉత్తర్వులు ఇచ్చారని, ఇది చాలా తీవ్రమైన విషయమని అమెరికా చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇకమీదట మాదకద్రవ్యాల పడవలపై దాడులు చేసే పెంటగాన్ రక్షణ దళాలపై చాలా తీక్షణమైన పర్యవేక్షణ, నిఘా కొనసాగిస్తామని ఈ నివేదిక బయటకు వచ్చిన తర్వాత రిపబ్లికన్ చట్టసభ్యుల నాయకత్వానగల కమిటీలు ప్రతిజ్ఞ చేశాయి. సెప్టెంబరు రెండో తేదీన అమెరికా నౌకా, వాయుసేన దళాలు కరీబియన్ జలాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో కొన్ని పడవలపై దాడులు చేశాయి. మొదట దాడుల తర్వాత పడవల్లో ఇంకా కొంత మంది సజీవంగా ఉన్నారు. కానీ ''అందరినీ



చంపండి'' అంటూ అమెరికా రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్ ఆదేశాలు ఇవ్వడంతో మళ్ళీ మళ్ళీ ఆ పడవలపై దాడులు జరిగాయని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక నివేదిక అలజడి సృష్టించింది. దీనిపై మంత్రి పీటర్ హెగ్సెత్ వివరణ ఇస్తూ, వీటిని నకిలీ వార్తలుగా కొట్టిపారేశారు. ఆయన (హెగ్సెత్)ను నూటికి నూరుపాళ్లు విశ్వసిస్తున్నానని ట్రంప్ అన్నారు. ఐతే హెగ్సెత్ మొదట పడవలో ఉన్నవారందరినీ చంపాలని ఆదేశాలు ఇచ్చారనీ, ఆ తర్వాత ఈ దాడులను పర్యవేక్షించే అధికారికి మరోసారి అవే ఆదేశాలు జారీ చేశారని వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. ఆదివారం జరిగిన టాక్ షోలో పాల్గొన్న రిపబ్లికన్, డెమోక్రటిక్‌పార్టీలకు చెందిన సభ్యులు అమెరికన్ కాంగ్రెస్ సమర్పించిన నివేదికలకు తాము మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ''పత్రికా నివేదిక నిజమోకాదో మాకు తెలియదు, కానీ క్షిపణి దాడులు చేసిన తర్వాత సజీవులను అరెస్టు చేయకుండా రెండోసారి కూడా మళ్ళీ మరణించేవరకూ దాడులు చేయడం యుద్ధ నేరం స్థాయికి చేరుతుంది'' అని 'ఫేస్ ద నేషన్' టాక్ షోలో డెమోక్రటిక్ పార్టీ సెనేటర్ టిమ్‌కైన్ అన్నారు. సమీపంలో ఉన్న దేశంపై మరో ఖరీదైన యుద్ధానికి అమెరికా సిద్ధపడుతోందని డెమోక్రాట్ సభ్యుడు చక్‌షుమర్ ఇప్పటికే ట్రంప్‌ను నిశితంగా విమర్శించారు.

**మదురోతో మాట్లాడా నిర్ధారించిన ట్రంప్ :** కరీబియన్ దీవుల్లో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ట్రంప్–నికొలస్ మదురో (వెనిజులా అధ్యక్షుడు) మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. ఐతే మదురోతో ట్రంప్ మాట్లాడారంటూ వచ్చిన వార్తలను ఆయన సోమవారం ధృవీకరించారు. ''నేను మదురోతో ఫోన్ సంభాషణ చేసిన మాట నిజమే'' అని ట్రంప్ స్పష్టం చేశారు. కానీ వారిమధ్య సంభాషణ ట్రంప్‌వైపు ఏకపక్షంగానే కొనసాగింది. ఆయన షరతులను అంగీకరించక పోవడంవల్లనే వెనిజులా గగనతలంపై ట్రంప్ నిషేధం విధించారని భావిస్తున్నారు. మదురో మొదటి నుండీ సామరస్య ధోరణితో మాట్లాడుతూ వచ్చారు. వెనిజులాలో డ్రగ్స్ ముఠాలను అదుపు చేశామని, అనేకమందిని అరెస్టు చేశామని ట్రంప్‌కు చెప్పారు. తమ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడానికి, అమెరికా దురాక్రమణ అడ్డుకోవడానికి వెనిజులాలో ప్రతి పౌరుడూ యుద్ధ శిక్షణ తీసుకుంటాడని ప్రకటించారు.

## హోండూరాస్ ఎన్నికల ఫలితాల్లో..
# ట్రంప్ మద్దతుదారుడు ముందంజ

**టెగుసిగాల్ప :** సెంట్రల్ అమెరికాలో పసిఫిక్ తీర దేశం హోండూరాస్‌లో అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల లెక్కింపు ఫలితాల్లో మితివాద నేషనల్ పార్టీ అభ్యర్థి నస్రీ అస్ఫురా (67) స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. తాను ఇష్టపడే అభ్యర్థి ఎన్నికల్లో విజయం సాధించకపోతే హోండూరాస్‌కు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని తగ్గించేస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పోలింగ్‌కు ముందుగానే ఆ దేశ ప్రజలను బ్లాక్‌మెయిల్ చేశారు. తాను నస్రీ అస్ఫురాకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కానీ ట్రంప్ మద్దతు పొందిన నస్రీ అస్ఫురా మిగిలిన ఇద్దరు ప్రధాన అభ్యర్థుల కంటే కౌంటింగ్‌లో స్వల్ప ఆధిక్యంలో మాత్రమే కొనసాగుతున్నారు. రెండు మితవాదపార్టీలకు చెందిన అభ్యర్థుల మధ్య కౌంటింగ్‌లో గట్టి పోటీ జరుగుతోందని జాతీయ ఎన్నికల సంఘం తన ప్రాథమిక ఫలితాల్లో పేర్కొంది. అస్ఫురాకు దేశ ఉపాధ్యక్షుడు, మాజీ టీవీ హోస్ట్ సాల్వడార్ నస్రుల్లా పెద్ద పోటీ ఇస్తున్నారు. తుది సమాచారం ప్రకారం అస్ఫురాకు 40.5 శాతం ఓట్లు లభించగా, నస్రుల్లాకు 39 శాతం ఓట్లు వచ్చాయి. అధికార వామపక్ష పార్టీకి చెందిన అధ్యక్ష అభ్యర్థి రిక్సీ మోంకడా 20 శాతం ఓట్లతో మూడోస్థానంలో బాగా వెనుకబడ్డారు. ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. కానీ ప్రధాన పోటీ ఈ ముగ్గురు మధ్యే జరుగుతోంది.



## 25 వేల ఓటర్లతో క్లస్టర్
(మొదటి పేజీ తరువాయి)

జిహెచ్ఎంసిలో ఉన్న కొన్ని డివిజన్‌లలో చేపట్టిన క్లస్టర్ విధానంలో ఒక్కో డివిజన్‌లో రెండు చొప్పున క్లస్టర్‌లు వస్తుండగా, మరికొన్ని డివిజన్‌లలో ఒకటి మాత్రమే వస్తుంది. అలాగే కొన్ని అస్లెంబ్లీ నియోజకవర్గాలలో 25 వేల ఓటర్లతో చేపట్టిన క్లస్లర్‌లు భారీగా పెరిగిపోగా, పాతబస్తీలోని కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం ఇప్పటికే డివిజన్‌లలోనే ఇమిడిపోతున్నాయి. జిహెచ్ఎంసిలో మొదలు కొని శివారు మున్సిపల్ సంస్థలలో కూడా సమానంగా 25 వేల ఓటర్లతో కూడిన క్లస్టర్‌లు రూపొందించారు. వీటికి సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియను సైతం టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం పూర్తి చేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను సైతం సిజిజి అందించినట్లు తెలిసింది. రైల్వే ట్రాక్, జాతీయ, రాష్ట్ర, జిహెచ్ఎంసి ప్రధాన రహదారులతో కూడిన సహజ సరిహద్దులతో పాటు నాలాలు, చెరువులు, భౌగోళిక అంశాలను వార్డుల పునర్విభజనలో భాగంగా ఏర్పాటు చేస్తున్న క్లస్టర్‌లలో ఉపయోగించారు. శాస్త్రీయ విధానంలో క్లస్టర్‌ల ఏర్పాటు ప్రక్రియను చేపట్టినట్లు ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. జిల్లాలు, లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులలోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు.

ఇందుకోసం చాలా పెద్ద ఎత్తున కసరత్తు చేయాల్సి వచ్చిందని ఉన్నతాధికారులు చెప్పారు. వైశాల్యానికి అనుగుణంగా క్లస్టర్‌ల అనుసంధానంతో నూతన వార్డుల ఏర్పాటు ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. అయితే ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం విడుదల చేసే గేజిట్ ద్వారా పూర్తి సమాచారం వెలుగులోకి రానుంది.

క్లస్టర్‌ల అనుసంధానంతో వార్డుల ఏర్పాటు..

ప్రస్తుతం 25 వేల ఓటర్లతో క్లస్టర్లుగా ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో వార్డుల పునర్విభజన ప్రక్రియ సులభతరంగా మారనుంది. 50 వేల నుంచి లక్ష జనాభాకు ఒక్క వార్డుగా ఏర్పాటు చేయాల్సి వస్తే ప్రస్తుతం ఏర్పాటు చేసిన క్లస్టర్‌లను అనుసంధానం చేస్తే సరిపోతోంది. అందుకే ముందస్తు వ్యూహంలో భాగంగానే ప్రభుత్వం 25 వేల మంది ఓటర్లతో కూడిన ప్రాంతాన్ని క్లస్టర్‌గా రూపొందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. క్లస్టర్‌ల ఏర్పాటు పూర్తయిన ఎంత మంది ఓటర్లతో వార్డు ఏర్పాటు చేయాలనుకుంటే అంత మేరకు ఏర్పాటు చేసేందుకు వీలవుతుంది. అయితే జిహెచ్ఎంసి పరిధిలో ఓటర్ల సంఖ్య ఎక్కువ, వార్డు వైశాల్యం తక్కువ ఉండే అవకాశం ఉంది. అలాగే శివారు ప్రాంతాల్లో మాత్రం ఓటర్ల సంఖ్య తక్కువ, వార్డుల వైశాల్యం ఎక్కువ ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్యను ఎలా అధిగమిస్తారనే విషయం తెలియాల్సి ఉంది.

## ఎఐ యూనివర్సిటీ
(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా ప్రశంసించారు. 18 మంది ఉద్యోగులతో దశాబ్దాల క్రితం సిగ్నిటీ పేరుతో సాఫ్ట్ వేర్ కంపెనీని ప్రారంభించిన ఆయన ఇవ్వాళ వేల మంది సిబ్బందితో ప్రపంచస్థాయి సంస్థగా కోవాసెంట్ ను తీర్చిదిద్దారని శ్రీధర్ బాబు చెప్పారు. టెక్నాలజీ అంటే సిలికాన్ వ్యాలీ, ప్రపంచ ప్రొడక్షన్ సెంటర్ గా చైనాలోని షెంజెన్, క్రమశిక్షణ, సుపరిపాలన కలిగిన దేశంగా సింగపూర్ ల గురించి చెబ్తారని, ఈ మూడు లక్షణాలు కలగలిసిన నగరంగా హైదరాబాద్ రూపొందుతోందని తెలిపారు. ఇక్కడ ఉన్న అనుకూల పర్యావరణం దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. 'అత్యధిక సంఖ్యలో గ్లోబల్ సామర్థ్య కేంద్రాలున్న నగరంగా అగ్రస్థానంలో నిల్చింది. ప్రపంచంలోని దిగ్గజ బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు జిసిసిల ఏర్పాటుకు హైదరాబాద్ ను ఎంచుకున్నాయి. ఇది అత్యంత గర్వించదగ్గ అంశం. లైఫ్ సెన్సెస్ రంగంలో గణనీయ ప్రగతిని సాధించాం. దేశంలో తయారయ్యే వ్యాక్సిన్లలో మూడో వంతు ఇక్కడే తయారవుతున్నాయి. హెల్త్ కేర్ ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి ఎకోసిస్టం మరెక్కడా కనిపించదు'. తమ ప్రభుత్వ దృఢ సంకల్పం వల్ల ఇవన్నీ సాధ్యమయ్యాయని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. సమావేశంలో కోవాసెంట్ ఛైర్మన్ సుబ్రమణ్యం, ఐటి, ఇండస్ట్రీస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ప్రభుత్వ ఐటి సలహాదారు సాయికృష్ణ, యుకె డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ వయన్ ఒవెన్‌లు పాల్గొన్నారు.

## సిఫార్సు పత్రం
(మొదటి పేజీ తరువాయి)

టి.సురేష్‌బాబుతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. ఈ మేరకు వారు హైదరాబాద్‌లో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం దేశంలో మొట్టమొదటి సారి 'గిగ్ ఎకనామీ'పైన సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌లో డాక్టర్ కింగ్సుక్ సర్కార్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ మాజీ లేబర్ కమిషనర్, షేక్ సలాహుద్దీన్, గిగ్ కార్మిక ఫెడరేషన్ నాయకులు , డా.పిఎస్ఎం రావు, ఆర్థిక సామాజిక సమస్యల విశేషకులు, ఎఐటియుసి నాయకుడు బి.వెంకటేశం,ఉబర్,ఓలా, స్విగ్గీ, జోమాటో వంటి సంస్థల గిగ్ కార్మికులు పాల్గొన్నారు. పరిశోధకులు , నిపుణులు,న్యాయ సమర్థకుల కోసం ఏర్పాటు చేసిన సదస్సులో గిగ్ కార్మికుల సవాళ్లు, అవకాశాలు, విధాన పరిష్కారాలపై చర్చించి రూపొందించిన నివేదికను పల్లా వెంకట రెడ్డి, నెల్లికంటి సత్యం, టి.సురేష్‌బాబు కూడిన బృందం మంత్రికి అందజేశారు. ఇందుకు మంత్రి వివేక్ వెంకట స్వామి వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న గిగ్ కార్మికుల భద్రత చట్టాన్ని అధ్యయనం చేసి, మరిన్ని సూచనలు చేయాలని ప్రతినిధి బృందానికి మంత్రి వివేక్ సూచించారు.

## తొలిరోజు వాయిదా
(మొదటి పేజీ తరువాయి)

గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్లను ప్రవేశపెట్టడంతో పాటు మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. పొగాకుష పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం విధించడానికి రెండు బిల్లులు, పాన్ మసాలా తయారీపై కొత్త సెస్సును ప్రవేశపెట్టారు. ఈ మూడు బిల్లుల్లో సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025, ఆరోగ్య భద్రత, జాతీయ భద్రతా సెస్సు బిల్లు, 2025 ఉన్నాయి. ఉభయసభలు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. ఇటీవల మృతి చెందిన సభ్యులకు లోక్‌సభ సంతాపం ప్రకటించింది. వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టుకు సభ్యులు అభినందలు తెలిపారు. ఆ తర్వాత ప్రశ్నోత్తరాలను గంటపాటు చేపట్టగా, విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. విపక్ష సభ్యుల ఆందోలన మధ్య మణిపూర్ జిఎస్‌టి బిల్లు ఆమోదం ఈశాన్య రాష్ట్రంలో జిఎస్‌టి 2.0 సంస్కరణలను అమలు చేయడానికి జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో మణిపూర్ జిఎస్‌టి బిల్లును సర్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల మధ్య లోక్‌సభ సోమవారం ఆమోదించింది. క్లుప్త చర్చ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన తర్వాత లోక్‌సభ మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు, 2025ను ఆమోదించింది.

అక్టోబర్ 7, 2025న జారీ చేసిన మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ఆర్‌ఎస్‌పి సభ్యుడు ఎన్‌కె ప్రేమచంద్ర ప్రతిపాదించిన చట్టబద్ధమైన తీర్మానాన్ని, 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేయడంతో మూజువాణి ఓటు ద్వారా తిరస్కరించారు. స్పీకర్ స్థానంలో ఉన్న టిడిపి సభ్యుడు కృష్ణ ప్రసాద్ టెన్నెటి తీర్మానంపై మాట్లాడటానికి ప్రేమచంద్రన్‌కు అవకాశమిచ్చారు. కానీ ఆర్‌ఎస్‌పి సభ్యుడు సభ సరిగ్గా లేదని ప్రిసైడింగ్ అధికారికి చెప్పారు. ఆ బిల్లును తర్వాత మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు. అంతకు ముందు జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి ఈ బిల్లు ప్రయత్నిస్తుందని సీతారామన్ అన్నారు.కేంద్ర వస్తువులు, సేవల పన్ను చట్టం, 2017 నిబంధనలను ఆర్థిక చట్టం, 2025లోని సెక్షన్లు 121 నుండి 134 వరకు సవరించామని, 56వ జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం ప్రకారం, మణిపూర్ వస్తువులు, సేవల పన్ను చట్టం, 2017లో ఇలాంటి సవరణలను వీలైనంత త్వరగా చేపట్టాలని సీతారామన్ అన్నారు. మణిపూర్ ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్నందున, సవరణలను అమలు చేయడానికి అక్టోబర్ 7న ఒక ఆర్డినెన్స్ జారీ చేయబడిందని సీతారామన్ చెప్పారు.

# తెలంగాణ పోలీసుల ముందడుగు

### మహిళా భద్రతకు 'టి-సేఫ్' విప్లవాత్మక విధానం
### డిజిపిల సదస్సులో ప్రజెంటేషన్ ఇచ్చిన శివధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు ఉద్దేశించిన 'టిసేఫ్' వ్యవస్థ దేశంలోనే ఒక విప్లవాత్మక ముందడుగు అని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఇటీవల జరిగిన వార్షిక డిజిపిల కాన్ఫరెన్స్‌లో 'టిసేఫ్ మహిళల కోసం సురక్షిత ప్రయాణం' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చి, ఈ సాంకేతిక పరిజ్ఞానం యొక్క విశిష్టతను వివరించారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2022 ప్రకారం, భారతదేశంలో అత్యధికంగా శ్రామిక మహిళల శాతం తెలంగాణలోనే ఉన్న నేపథ్యంలో, రాష్ట్రంలో మహిళల ప్రయాణాన్ని అత్యంత సురక్షితం చేయాలనే లక్ష్యంతో 2024లో 'టిసేఫ్' యాప్‌ను ప్రారంభించినట్లు డిజిపి వెల్లడించారు. ఇప్పటివరకు మహిళా భద్రత కోసం ఉన్న సౌకర్యాలు కేవలం అత్యవసర ప్రతిస్పందన కోసం మాత్రమే పనిచేస్తుండగా, 'టిసేఫ్' మాత్రం ప్రయాణం మొదలైనప్పటి నుంచే పర్యవేక్షణ ప్రారంభిస్తుంది. ఈ విధంగా, ఇది కేవలం 'ప్రతిస్పందించే విధానానికి బదులుగా, 'ముందస్తు నివారణ' విధానంలో పనిచేయడం దీని ప్రధాన ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు.'ట్రావెల్‌సేఫ్' లేదా 'టిసేఫ్' యొక్క ముఖ్య లక్షణాలలో ఒకటి దీనికి స్మార్ట్ ఫోన్ అవసరం లేకపోవడం. ఇందులో ఆటోమేటెడ్ రైడ్ ట్రాకింగ్ ఫీచర్ అందుబాటులో ఉంది. ఇది రూట్ డివియేషన్స్ చేరుకోవాల్సిన అంచనా సమయం ఆలస్యం, వెరిఫికేషన్ కాల్‌కు సమాధానం ఇవ్వకపోవడం, ప్రయాణం ఎక్కువ సమయం తీసుకోవడం, తప్పు పాస్‌కోడ్‌ను నొక్కడం వంటి 42 రకాల డివియేషన్స్ గుర్తించగలదు. ఈ ఫీచర్ మొదలైనప్పుడు సమీపంలోని వ్యాన్లు లేదా పోలీస్ పెట్రోల్ మోటార్‌సైకిళ్లు తక్షణమే బాధితురాలి ప్రదేశానికి చేరుకుంటాయని ఆయన తెలిపారు. ఈ సదుపాయానికి మహిళల నుంచి 5 కు గాను 4.7 రేటింగ్ లభించిందని ,ఈ విషయంలో ఇప్పటికే 350కి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని డిజిపి తెలియజేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని ఉబర్, ఓలా, రాపిడో , మేరు, అభిబస్, వంటి అన్ని క్యాబ్ అగ్రిగేటర్‌లతో టిసేఫ్‌ను సమగ్రపరచాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా, కృత్రిమ మేధ ఉపయోగించి మహిళా భద్రతకు బలహీన ప్రాంతాలను గుర్తించిన తర్వాత ఆటోమేటెడ్ సేఫ్టీ చెక్ కాల్స్‌ను ప్రారంభించాలని యోచిస్తున్నారు. ఏదైనా ప్రమాదాన్ని గుర్తించడానికి, మహిళకు ప్రమాదం ఉన్నట్లు సంకేతాలను అందించే వాయిస్ రికగ్నిషన్‌ను కూడా ఎఐ ద్వారా అమలు చేయాలని ప్రతిపాదించారు. ప్రమాదాలను గుర్తించడానికి ఎప్పటికప్పుడు డ్రోన్ మరియు సిసిటివి ఫుటేజీలను తనిఖీ మరియు విశ్లేషణ చేయబడుతుందని ఆయన వివరించారు. డిజిపి తన ప్రజెంటేషన్‌లో విజన్ 2047 నాటికి పోలీసు విభాగంలో మహిళల నిష్పత్తిని 50శాతం వరకు పెంచాలని, పోలీస్ శాఖలో పనిచేసే మహిళలకు అనుగుణంగా తయారు చేయాలని ప్రతిపాదించారు. సామాజిక అవగాహన కోసం, ఎస్ ఎస్ సి ఇ ఆర్ టి తో కలిసి తెలంగాణా పోలీసులు క్లాస్ 1 నుండి క్లాస్ 10 వరకు సిలబస్‌లో మార్పులు చేసి, లింగతటస్థ కథనాలను చేర్చినట్లు తెలిపారు. అలాగే, తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్, 'సేఫ్ విలేజ్ ప్రోగ్రామ్'ను ఏడు జిల్లాల్లో ప్రారంభించింది. పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణకు సంబంధించిన పోలీసుల మొదటి ఉమ్మడి చొరవగా 'సాహస్ ' కార్యక్రమం ద్వారా కార్పొరేట్ సంస్థలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీల ఏర్పాటుకు శిక్షణ ఇస్తున్నట్లు డిజిపి వివరించారు.

## మున్సిపల్ సంస్థలలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం అన్నారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డితో కలిసి ఏసురత్నం సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎసి) డాక్టర్ టి.కె. శ్రీదేవిని కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం ఏసురత్నం మాట్లాడుతూ జిల్లాలలో మున్సిపల్ కార్మికుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఖమ్మం జిల్లాలోని 15 మందిని ఔట్ సోర్సింగ్‌లోకి తీసుకోవాలని కోరారు. కల్లూరు మున్సిపల్‌లో ఐదు నెలల నుండి కార్మికులకు వేతనాలు రావడం లేదన్నారు. కార్మికులు అప్పులు చేసి విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైరా మున్సిపల్‌లో 50 మంది కార్మికులని స్పెషల్ డ్రైవ్ అని పేరు పెట్టి కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారన్నారు. వారికి రూ. 10 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. అన్ని మున్సిపాలిటీలలో ఇచ్చినట్లు రూ. 16,500 వేతనం వెంటనే అమలు చేయాలని కోరారు. కామారెడ్డి జిల్లా మున్సిపల్, తాగునీటి విభాగాలలో పనిచేస్తున్న కార్మికులని, పారిశుద్ధ్య పనులు చేయాలని చెప్పడం సరికాదన్నారు. వారిని యధావిధిగా తాగునీటి విభాగాలలో కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 15 క్యాజువల్ లీవులు, పండుగ సెలవులు అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. మున్సిపల్‌లో మరణించిన కార్మికులకు అంతిమ సంస్కారాల ఖర్చులు రూ. 30 వేలు ఇవ్వాలని కోరామని ఏసురత్నం చెప్పారు. కమిషనర్ సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.



## అడ్డుకునే వాళ్ళొద్దు
(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరాలు విజయోత్సవ సభను మక్తల్‌లో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని, పాలమూరు బిడ్డను ప్రజలు గెలిపించి అధికారం కట్టబెట్టారని వెల్లడించారు. ఈసారి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. పదేళ్లు నిర్లక్ష్యానికి గురైన నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టామని అన్నారు. నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకంపై కేసులు వేసి అడ్డుకున్నారని ఆరోపించారు. రైతులు నష్టపోవద్దని ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు ముందుకు వచ్చామని, పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా, ఇక్కడి నేలకు నీళ్లు అందలేదని, మాయగాళ్ల మాటలు విని ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని సూచించారు. ఎంత డబ్బు ఖర్చయినా సరే మక్తల్ నారాయణపేట ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ చేశారు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌ను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నామని సిఎం తెలిపారు. వలసలు పోవటం వల్ల పాలమూరు జిల్లా బిడ్డలు విద్యకు దూరమయ్యారని అన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజురు చేశామని, ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఐఐటీ మంజూరు చేసుకున్నామని, పాలమూరు యూనివర్సిటీకి అధిక కోట్లన్నీ మంజూరు చేశామని తెలిపారు. ఒకప్పుడు మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఛార్జీలకు ఇబ్బంది పడేవారని అన్నారు. ఛార్జీ డబ్బుల కోసం భర్త మీద, పిల్లల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదని, మహిళలు ఉచితంగా బస్సుల్లో తిరుగుతుంటే కొందరు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. మహిళలు బస్సుల్లో ఉచితంగా తిరగటమే కాదు బస్సులకు యజమానులు అయ్యారని అన్నారు. పొదుపు సంఘాల మహిళలు పెట్రోలు బంక్‌లకు యజమానులు అయ్యారని, ధనవంతులు తిన్నట్టే పేదలు కూడా సన్నబియ్యం తినాలని భావించామని చెప్పారు. హైటెక్ సిటీలో 150 క్యాంటీన్లను మహిళా సంఘాలకు కేటాయించామని, పేదలందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారమైందమని వివరించారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నారాయణపేట, వనపర్తి జిల్లాల పర్యటనలో భాగంగా ముందుగా మక్తల్‌లో రూ.200 కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మక్తల్ నారాయణపేట మధ్య 4 లైన్ల రోడ్డు నిర్మాణానికి, మక్తల్‌లో క్రీడాభవనం, ఇతర అభివృద్ధి పనులకు మంత్రులతో కలిసి శంకుస్థాపన చేశారు. వనపర్తి జిల్లాలో రూ.151.92 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు, జూరాల దిగువన రూ.121.92 కోట్లతో హైలెవెల్ వంతెన నిర్మాణానికి, ఆత్మకూరు మున్సిపాలిటీలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కాగా, నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో వెలిసిన పడమటి అంజనేయస్వామి దేవాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆయనకు మక్తల్ పట్టణ అంబేద్కర్ చౌరస్తాలో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, జిల్లెల చిన్నారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వనపర్తి ఎస్పి డి.సునీత, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రేపు దేవాదాయ ఉద్యోగుల జెఎసి మహాసభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేవాదాయ శాఖలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం బోగ్గులకుంటలోని సారస్వత భవనంలో ఉద్యోగుల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించనున్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన 121 జిఒ సవరణ చేయాలని, అలాగే 2017 నుంచి విధులు నిర్వహిస్తున్న అర్చక, ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్‌తో ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు జెఎసి నేత క్రిష్ణమాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు హాజరవుతారన్నారు. జెఎసి నేతలు గంగు ఉపేంద్ర శర్మ, డివిఆర్ శర్మ, మారుతి సత్యనారాయణ, రవీంద్ర ఆచార్యులు, కాందూరు కృష్ణమాచారి, చింతపట్ల అగ్నిహోత్ర చంద్రశేఖర్ శర్మ, తీగ వరపు ప్రసాద్, విద్యాసాగర్, నాగరాజు, ముకుందలతో పాటు పలువురు నేతలు ఈ మహాసభలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

# నిర్దేశిత సమయంలో మేడారం అభివృద్ధి పనులు పూర్తి



### ఆచార సంప్రదాయాలు, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
### మేడారం అభివృద్ధి పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత సమయంలో పనులు పూర్తికావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు, ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, ఏ మాత్రం పొరపాట్లు దొర్లినా కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. రాతి పనులతో పాటు రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గద్దెల చుట్టూ భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, భక్తులు వేచి చూసే ప్రదేశాలు తదితర ప్రతి ఒక్క అంశంపై అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. పనులు కొనసాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. రోడ్లు, భవనాలు, విద్యుత్‌శాఖ, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, స్థపతి శివనాగిరెడ్డి సమన్వయంతో సాగాలని సిఎం సూచించారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు పెద్దపీట వేయాలని సిఎం తెలిపారు. నిర్దేశిత సమయంలోనే అభివృద్ధి పనులు పూర్తి కావాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, రోడ్లు, భవనాల శాఖ ఎన్‌సి మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**తక్కువ వడ్డీతో అభివృద్ధి ప్రాజెక్టుల పనులకు రుణాలు మంజూరు చేయండి : ఎ.రేవంత్ రెడ్డి**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హడ్కో చైర్మన్ సంజయ్ కులశ్రేష్టను కోరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో కులశ్రేష్ట సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని సిఎం హడ్కో చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూర్, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బుల్లెట్ ట్రైన్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి, హడ్కో చైర్మన్ల మధ్య చర్చ జరిగింది. గతంలో అత్యధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలకు సంబంధించి రుణ పునర్వ్యవస్థీకరణ (లోన్ రీకన్‌స్ట్రక్షన్) అంశాన్ని సిఎం హడ్కో చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై హడ్కో చైర్మన్ సానుకూలంగా స్పందించారు. సానుకూల వృద్ధి రేటుతో ఉన్న తెలంగాణలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీరేటుతో దీర్ఘ కాల రుణాలు ఇవ్వాలని సిఎం కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే రుణాలు మంజూరు చేశామని హడ్కో చైర్మన్ సిఎం రేవంత్ రెడ్డికి తెలియజేశారు. మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రుణాలు వేగంగా మంజూరు చేయాలని సిఎం కోరగా చైర్మన్ కులశ్రేష్ట సానుకూలంగా స్పందించారు. ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న భారత్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని హడ్కో చైర్మన్‌ను సిఎం ఆహ్వానించారు. సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్, హడ్కో రీజినల్ చీఫ్ పి.సుభాష్ రెడ్డి, హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్లు ఆశీష్ గుండాల, సయ్యద్ రహీముద్దీన్ పాల్గొన్నారు.



# బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కు కృషి

### నూతి బాధ్యతల స్వీకరణ సభలో డిప్యూటీ సిఎం భట్టి
### మంత్రులు తుమ్మల, పొంగులేటి, పలువురు కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భటి విక్రమార్క కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కృషి చేస్తుందని ఆయన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియామకమైన నూతి సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నామని ఇది దేశానికే తలమానికం కానుందన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని కేవలం సంక్షేమ పథకాల కోసమే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్ వేదికగా పోరాడతామన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించిన రాష్ట్రపతి వద్ద ఆ బిల్లు ఆగిపోయిందన్నారు. ధర్నా చేసిన ఫలితం లేకుండా పోయిందని భట్టి తెలిపారు. బలహీన వర్గాలకు పార్టీ పరంగా అన్ని విధాలా మేలు చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ తల ఎత్తుకుని నిలబడేలా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించడం జరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు. డిసెంబర్ 10 నుంచి 13 వరకు విజన్ డాక్యుమెంట్‌ను పరిశీలించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన నూతి సత్యనారాయణ కుటుంబం స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబమని నూతి అనంతరాములు తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. స్థలానికి సంబంధించి ప్రభుత్వానికి డబ్బులు కూడా చెల్లించామని ఆయన తెలిపారు. సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఎంఎల్‌ఎలు రాంచందర్ నాయక్, రాగమయి, నాయకులు నాయుడు సత్యనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వైరా నుంచి భారీగా ర్యాలీగా బయలుదేరి కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### అణు ఇంధన సంస్థలో ప్రైవేటు భాగస్వామ్యం
# అనాలోచిత నిర్ణయం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతదేశ ప్రతిష్టకు ప్రతీకగా నిలిచిన అణు ఇంధన సంస్థలో ప్రైవేటు భాగస్వామ్యం కలిపిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అనాలోచిత నిర్ణయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తమ అనాలోచిత, అనర్థదాయక, కార్పొరేట్ అనుకూలమైన నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశ ప్రతిష్టకు శాస్త్ర, సాంకేతిక రంగానికి ప్రతిబింబంగా నాటి నెహ్రూ ప్రభుత్వం అను ఇంధన శాఖను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అనేక విదేశీ రాజకీయ ఒత్తిళ్లను ఎదిరించి 1948లో అణు ఇంధన కమిషన్‌ను ఏర్పాటు చేసి, దీనికి ఓమి జే బాబాను బాధ్యునిగా నియమించిందని పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలో ఆ కమిషన్‌నే డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డిఎఇ) పేరుతో ముంబాయి మహనగరంలో ఏర్పా టు చేశారన్నారు. హోమి జే బాబా, శాంతి స్వరూప్ బట్నాగర్, డి.ఎన్.వాడియా లాంటి అనేక మంది సైంటిస్టులతో కలిసి అహోరాత్రులు కష్టపడి డిఎఇ సంస్థను ప్రపంచ వ్యాపితంగా ప్రఖ్యాత సంస్థగా తీర్చిదిద్దారని వివరించారు. అణు ఇంధన సంస్థను భారత్ స్థాపించడం గిట్టని పెట్టుబడిదారి దేశాలు ఆ సంస్థ మూల పురుషుడైన ఓమి జే బాబాను విమాన ప్రమాదంలో చంపారనే పరిష్కారం కాని సంఘటన అని అన్నారు. అనేక రాష్ట్రాలల్లో అణు ఇంధనంతో నడిచే విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి భారతదేశానికి కావాల్సిన విద్యుత్‌ను అతి తక్కువ ఖర్చుతో దేశ ప్రజలకు అందించారని, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సి) హైదరాబాద్‌లో హెవీ వాటర్ ప్లాంట్‌ను కొత్తగూడెంలో, ఎలాక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌ను (ఇసిఐఎల్) హైదరాబాద్‌లో డిఎఇ విభాగాలు స్థాపించి, అనేక మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో ప్రధాన పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఇస్రో లాంటి సంస్థలకు కావాల్సిన ఇంధనాన్ని అభివృద్ధి చేసి వారి పరిశోధనల పురోభివృద్ధికి అండగా నిలబడిందని, భారతీయ శాస్త్రవేత్తల కృషి, త్యాగాలతో ఏర్పడి అభివృద్ధి పథంలో నడుస్తున్న అణు ఇంధన సంస్థలో స్వార్థపరులు, అవినీతిపరులు, దేశంకన్నా లాభాలే ప్రధానంగా భావించే ప్రైవేటు వారికి భాగస్వామ్యం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పటం ద్రోహపూరిత చర్యగా అభివర్ణించారు. దేశానికి అంకితమైన శాస్త్రవేత్తల కృషికి అవమానకరంగా కేంద్ర ప్రభుత్వ చర్య ఉన్నదని బోస్ మండిపడ్డారు.

# మహిళా సంఘాలకు మరో 448 ఆర్‌టిసి అద్దె బస్సుల కేటాయింపు

### మహిళల ఆర్థిక అభ్యున్నతికి దోహదం : మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే రోజుల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్‌టిసి అద్దె బస్సులు కేటాయించడానికి సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) వెల్లడించారు. మహిళా సంఘాల నిబద్ధత, క్రమశిక్షణ రాష్ట్ర ప్రజా రవాణా రంగానికి కొత్త దిశను చూపుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.





ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 152 ఆర్‌టిసి అద్దె బస్సులను మండల మహిళా సమాఖ్యలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని, మహిళలను ఆర్థికంగా బతోపేతం చేసే లక్ష్యంతో మరో 448 అద్దె బస్సులను మహిళా సంఘాలకే అప్పగించే ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. ఈ నేపథ్యంలో సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. మండల మహిళా సమాఖ్యలు 448 బస్సుల కొనుగోలు పూర్తి చేసి, వాటిని ఆర్‌టిసికి అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. అవసరమైన అనుమతులు మంజూరైన వెంటనే ఆ బస్సులను ఆర్‌టిసికి అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో త్వరలోనే ఆర్‌టిసిలో మహిళా సమాఖ్యల ద్వారా నడిచే బస్సుల సంఖ్య గణనీయంగా పెరగనుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తోందన్నారు. ఒక్కో బస్సు ద్వారా మహిళా సంఘాలకు నెలకు సుమారు రూ.70 వేల వరకు అద్దె ఆదాయం లభించడం, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు కీలకంగా మారిందన్నారు. ప్రస్తుతం నడుస్తున్న 152 బస్సుల విజయవంతమైన నిర్వహణను దృష్టిలో పెట్టుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా 448 బస్సుల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడటమే కాకుండా, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రత్య క్ష భాగస్వాములుగా మారడం ఎంతో సంతోషకరమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, ఎక్కువ సంఖ్యలో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. మహిళలు రాష్ట్రాభివృద్ధిలో మరింత భాగస్వామ్యం అవడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పేర్కొన్నారు.

# ఎసిబి పేరుతో వసూళ్లు.. ముఠా అరెస్టు



వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ఎసిబి అధికారుల ముసుగులో వసూళ్లకు పాల్పడుతున్న ముఠాలోని ఐదుగురు సభ్యులను అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. సోమవారం హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో ఆర్టీఓ కార్యాలయంలో అధికారులను బెదిరించి వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు. నిందితుల నుండి 13 సెల్‌ఫోన్లు, 9700ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్టోబర్ నెలలో వరంగల్ జిల్లా రవాణా శాఖలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తుమ్మల జయపాల్ రెడ్డికి రాచంపల్లి శ్రీనివాస్ ఏసీబీ డీఎస్పీ అని కాల్ చేసి మీమీద అవినీతి ఆరోపణలు ఉన్నాయని బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. ఇందుకోసం రూ.10 లక్షలను వివిధ మార్గాల్లో దోచుకున్నాడని తెలిపారు. దోచుకోగా వచ్చిన డబ్బుతో గోవా, బెంగుళూరు వంటి ప్రాంతాలకు వెళ్ళి జల్సాలు చేసి ఖర్చు పెట్టాడని వివరించారు. ప్రధాన నిందితుడు రాచంపల్లి శ్రీనివాస్ అలియాస్ మంగళ శ్రీనుపై 78 కేసులు ఉన్నాయని తెలిపారు. అతను జైలు నుండి విడుదలైన తర్వాత కూడా సులభంగా డబ్బులు సంపాదించాలని ఏసీబీ, పోలీస్ అధికారుల అవతారం ఎత్తి ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. ఎవరైనా అధికారులను ఇలా బెదిరింపులకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఘరానా మోసగాడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి డి.కవిత, వరంగల్ ఎసిపి ఎన్.శుబం ప్రకాష్, టాస్క్‌ఫోర్స్ ఎసిపి ఏ.మధుసూదన్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్లు ఎల్.పవన్ కుమార్, కె.శ్రీధర్, ఎల్.మంగిలాల్, మిల్స్ కాలనీ ఇన్స్‌పెక్టర్ బి.రమేష్, ఎస్ఐలు ఎస్.మహేష్, ఎం.సురేష్, టాస్క్‌ఫోర్స్, మిల్స్ కాలనీ పి.ఎస్. సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించి రివార్డులను అందజేసారు.

# ఫిబ్రవరిలో ఏఐటియుసి రాష్ట్ర మహాసభలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏఐటియుసి రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరిలో జరుగునున్న నేపథ్యంలో అంతకుముందు అన్ని జిల్లాల మహాసభలు, రాష్ట్ర సంఘాలు, ప్రజాసంఘాల మహాసభలు నిర్వహించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న ఏఐటియుసి కార్యాలయంలో సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించాలని, అలాగే వలస కార్మికుల జిల్లా మహాసభలను నిర్వహించాలని, అలాగే ఈనెల 14, 15వ తేదీలలో బెంగుళూరులో జరుగుతున్న వర్కింగ్ ఉమెన్ ఫోరం సమావేశానికి పి.ప్రేంపావని, కరుణ కుమారిని ప్రతినిధులుగా పంపించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరుగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని, ఏఐటియుసి శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించింది. ఫిబ్రవరి 8న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును నిర్వహించాలని, ఇందుకు ఎం.నర్సింహ, రామాంజనేయులు, నరాటి ప్రసాద్, నవీన్ (మహబూబాబాద్), మేకల శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఫిబ్రవరి 3వ ఆదివారం 'గిగ్ వర్కర్స్ యూనియన్' రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేయాలని, ఇందుకు బి.వెంకటేశం బాధ్యులుగా వ్యవహరించాలని కార్యవర్గ సమావేశం తీర్మానించిందన్నారు.

# రామగుండంలో విమానాశ్రయం పునరుద్ధరణ

### ఎంపి గడ్డం వంశీకృష్ణ వెల్లడి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం గత రెండు సంవత్సరాలుగా జరుపుతున్న కృషిని మరో ముందడుగుకు తీసుకెళ్లినట్లు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఈ విషయంపై అనేకసార్లు సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిశీలించిన సైట్‌లో కొండలు ఉండటం, అడ్డంకులు ఉండటం వల్ల వారు ఆ లొకేషన్‌ను రిజెక్ట్ చేశారని, మరొకసారి వారిపై ఒత్తిడి చేసి, ప్రిఫీజిబిలిటీ స్టడీని కొత్త లొకేషన్‌పై నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూ.50 లక్షలు ప్రీ ఫీజిబిలిటీ స్టడీ కోసం సెంటర్‌కు చెల్లించినట్లు ఎంపీ తెలిపారు. ఈ స్టడీని వేగవంతం చేయడానికి సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీలో మంత్రి రామ్మోహన్ నాయుడును మరోసారి కలిసి చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి ఈ విషయమై డిసెంబర్ 3 లేదా 4 తేదీలలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా టీమ్ రామగుండం ప్రాంతాన్ని సందర్శించి, కొత్త ల్యాండ్ సర్వే చేస్తుందని, ప్రీ ఫీజిబిలిటీ స్టడీ పూర్తయ్యాక భూసేకరణ, తుది నిర్ణయాలకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారని అన్నారు. ఎయిర్‌పోర్ట్ స్థాపన వల్ల రామగుండం, సింగరేణి ప్రాంతం, పెద్దపల్లి, మంచిర్యాల్, ఆదిలాబాద్ జిల్లాలు సహా మొత్తం పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని, ఇది ఒక భారీ ఆర్థిక అవకాశాన్ని తీసుకొస్తుందనీ, దీనికి రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలని, రామగుండంలో ఎయిర్‌పోర్ట్ వచ్చేవరకు నేను నిరంతరం కృషి చేస్తాను అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు.

# తెలంగాణకు మణిహారం ఎర్త్ యూనివర్సిటీ

### నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
### ప్రపంచంలోనే ఇది రెండో విశ్వవిద్యాలయం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. ఇప్పటికే పరిశ్రమల ఖిల్లాగా పేరుగాంచిన భద్రాద్రి జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. రవాణాకు సైతం అనువైన ప్రాంతం కావడంతో విలువైన ఖనిజ సంపదలు ఈ నెలలో నిక్షిప్తమై ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ క్యాబినేట్ ఆమోదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనిని భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల సృష్టి కర్త డా.మన్మోహన్ సింగ్ పేరిట నెలకొల్పుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నేడు ప్రారంభానికి నోచుకుంది.



**ప్రపంచంలోనే రెండోది..** ఇప్పటి వరకు పలు రకాల యూనివర్సిటీలు ఉండగా డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మాత్రం ప్రపంచ వ్యాప్తంగా రెండోది. భారతదేశంలోనే మొదటిది. అందునా భద్రాద్రి జిల్లాలో ఏర్పాటు కావడం తెలంగాణకే గర్వ కారణంగా మారింది. దీంతో జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. జియో కెమిస్ట్రి, ఫిజిక్స్, ప్లానెటరీ జియాలజీ, మినరల్ సైన్స్ పర్యావరణ, భూగర్భ శాస్త్రం వంటి అత్యాధునిక కోర్సులు ఈ యూనివర్సిటీ ద్వారా ప్రపంచానికి అందించనున్నారు.

**యూజి నుండి పిహెచ్‌డి వరకు..** గ్రాడ్యుయేషన్ మొదలుకుని పోస్టు గ్రాడ్యుయేషన్, యూజిసి ప్రమాణాలతో పిహెచ్‌డి కోర్సులు అందించనున్నారు. దేశ విదేశాల నుండి ఈ ఎర్త్ యూనివర్సిటీలో చదువుకునేందుకు తరలిరానున్నారు. దీంతో ప్రపంచమే భద్రాద్రి వైపు తొంగిచూడనుంది. ఖనిజ సంపదకు జిల్లా కేంద్రబిందువుగా ఉండటంతో యూనివర్సిటీ ఏర్పాటుతో సార్థకత చేకూరనుంది. ఇప్పటికే మినీ స్టీల్ ప్లాంట్, ఫెర్రో అలాయిస్ యూనిట్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఐటిసి పేపర్ బోర్డు, హెవీ వాటర్ ప్లాంట్, నేషనల్ హై వే, రైల్వే లైన్, గోదావరి నది సమీపంలో ఉన్నాయి. మరో ప్రక్క విమానాశ్రయం ప్రతిపాదనలో ఉంది.



**యువతకు మేలు..** జిల్లాలో డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. మరోపక్క యూనివర్సిటీ కేంద్రంగా పరిశోధనా అవకాశాలు విస్తరించనున్నాయి. ప్రపంచ దేశాల నుండి శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ఇక్కడికి రానుండటంతో విద్య పరంగా ప్రపంచంలోనే మేటిగా ఈ జిల్లా మారనుంది.

**కూనంనేని కృషి అమోఘం..** ఎర్త్ యూనవర్సిటీ ఏర్పాటులో కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు కృషి అమోఘం. యూనివర్సిటీకి అనువైన ప్రాంతం కావడంతో తుమ్మల నాగేశ్వర రావు యూనివర్సిటీ ఏర్పాటుకు చొరవ చూపారు. దీంతో తుమ్మల, కూనంనేని కలిసి దీనిపై కసరత్తు చేసి వివరాలు తెప్పించుకుని యూనివర్సిటీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కలెక్టర్ జితేష్ విపాటిల్‌ను పరిశీలన చేయాలని సూచించారు. దీంతో ఆయన ప్రపంచ వ్యాప్తంగా ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన వాతావరణం, పర్యావరణం, భౌగోళ స్థితి గతులను అధ్యయనం చేయడంతో యూనివర్సిటీ ఏర్పాటుకు ఇదే అనువైన ప్రదేశంగా తేల్చారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి విషయాన్ని చేరవయగా క్యాబినేట్ ఆమోదం అనంతరం డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీగా నామకరణం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ యూనివర్సిటీ నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ నెం.19, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి, యూసఫ్‌గూడ, హైదరాబాద్.

'ఇ'ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నెం. 28/EE/DIV-19/SLPZ/GHMC/2025-26, తేది: 01.12.2025

NIT No. 28/EE/DIV-19/SLPZ/GHMC/2025-26, **పనుల సంఖ్య:** (3) పనులు, **అంచనా వ్యయం:** రూ.70.195 లక్షలు, **ప్రారంభ తేదీ / డౌన్‌లోడ్ ఆఖరి తేదీ & సమయం:** 02.12.2025న మ.02.00గం.ల నుండి 05.12.2025న మ.02.00గం.ల వరకు మాత్రమే. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, జిహెచ్‌ఎంసి. శ్రీ బి.భద్రు. సెల్ నెం. 9989930549. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ -19, (ఎస్ఎల్‌పిజెడ్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 11589-PP/CL/ADVT/1/2025-26, Date: 01-12-2025

**శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము**
ఊరుకొండపేట, మం|| ఊరుకొండ, జిల్లా|| నాగర్‌కర్నూల్.

10/SAST/2025 బహిరంగవేలము ప్రకటన తేది: 01.12.2025

ఇందు మూలముగా సమస్త ప్రజానికానికి, మరియు గ్రామస్తులకు తెలియజేయటం ఏమనగా శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము, ఊరుకొండపేట గ్రా, ఊరుకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణా రాష్ట్రం యొక్క ఈ దిగువ తెలిపిన వివిధ టెండర్స్ బహిరంగవేలము మరియు సీల్డ్ టెండర్స్ ద్వారా తేది: 18.12.2025 గురువారము రోజు మధ్యాహ్నము 12:30 గం. లకు శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము, ఊరుకొండపేట గ్రామము నందు నిర్వహించుటకు నిర్ణయించుటమైనది. ఈ బహిరంగ వేలములో పాల్గొనుటకు ఆసక్తి కలవారు అందరూ వేలంపాటకు ముందుగా మధ్యాహ్నము 12:30 గం.ల లోపల నిర్ణయించిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయటమైనది. సీల్డ్ టెండర్స్ నిర్ణయించిన డిపాజిట్ తో పాటు ముందుగా మధ్యాహ్నము 12:30 గం.ల లోపల సమర్పించగలరు. ఇతర వివరములకు ఫోన్: 9010901099 సంప్రదించగలరు.

| క్ర.సం. | పద్దుల వివరములు | కాల పరిమితి | డిపాజిట్ |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | 01.01.2026 TO 31.12.2026 | రూ. 500000.00 |
| 2 | తలనీలాలు సేకరణ హక్కు | 01.01.2025 TO 31.12.2026 | రూ. 100000.00 |
| 3 | కొబ్బరిముక్కలు సేకరణ హక్కు | 01.01.2026 TO 31.12.2026 | రూ. 100000.00 |
| 4 | కిరాణా సామగ్రి సరఫరా | 01.01.2026 TO 31.12.2026 | రూ. 10000.00 |
| 5 | దేవస్థాన షాప్స్ (3 years) | From 01.01.2026 | రూ. 10000.00 |

నోట్ : బహిరంగ వేలము మరియు సీల్డ్ టెండర్స్‌లో పాల్గొనుటకు ఆసక్తి కలవారు అందరూ వేలంపాటకు ముందుగా టెండర్ షెడ్యూలు ఫారం రూ.500/- తీసుకోగలరు అని మనవి. ఇతర వివరములకు ఫోన్: 9010901099 సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహణాధికారి

DIPR R.O. No. : 11556-PP/CL/ADVT/1/2025-26, Date: 01-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS



ఈనెల 13న మెస్సీ టీమ్‌తో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం ఎంసిహెచ్-ఆర్‌డి గ్రౌండ్‌లో ప్రాక్టీసు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




## బిసి రిజర్వేషన్లు తగ్గించిన రాష్ట్రం రోల్‌మాడలా?

బిసిల ఆత్మగౌరవ - ధర్మపోరాట ర్యాలీలో ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసిలకు రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేస్తూనే రాష్ట్ర ప్రభుత్వం దేశానికి ఆదర్శమనడం సమంజసమేనా? అని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య కాంగ్రెస్ పాలకులను ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల కేటాయింపులలో అవకతవకలు జరిగాయని, వెంటనే ఎన్నికలు వాయిదా వేసి రిజర్వేషన్లను సరిదిద్దాలని బిసి కమిషన్ చెప్తున్నప్పటికీ ప్రభుత్వం దున్నపోతు మీద వర్షంపడ్డ చందంగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు బిసిల ఆత్మగౌరవ – ధర్మపోరాట ర్యాలీని భారీ ఎత్తున నిర్వహించారు. బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదీ రాందేవ్ నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొనగా, బిఆర్‌ఎస్ మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బిసి కమిషన్ మాజీ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బిజెపి బిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, బిసి సంక్షేమ సంఘం జాతీయ కోఆర్డినేటర్ ర్యాగ రిషి అరుణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ ప్రదర్శనలో బిసి సంఘం నేతలు నీలం వెంకటేశ్, గుజ్జ సత్యం, అనంతయ్య, బాణాల అజయ్, భీంరాజ్, రాజ్‌కుమార్, వేణుమాధవ్, ఆశిష్‌గౌడ్, నిఖిల్ పటేల్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 30వ రోడ్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఒడిస్సాలోని సంబాల్పూర్‌లో నేటి నుంచి ఈ నెల 6వ తేదీవరకు జరగనున్న 30వ రోడ్ సైక్లింగ్ నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలకు తెలంగాణ నుంచి 15 మంది బాలికలు జట్టు, 10 మందితో కూడిన బాలుర జట్లు మొత్తం 25 మంది క్రీడాకారులు పాల్గొటున్నారని తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మల్లా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పి. మల్లారెడ్డితో పాటు కొండ లక్ష్మి కాంత్ రెడ్డి, నర్సి రెడ్డి, గోకుల్ కోచ్ అడ్మినిస్ట్రేటర్ కృష్ణ పాల్గొని క్రీడాకారులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో క్రీడాకారులు సాధ్యమైనంత ఎక్కువ పతకాలను సాధించాలని ఆకాక్షించారు. అనంతరం లక్ష్మి కాంత్ రెడ్డి బంగారు పతక విజేత వర్ష రెడ్డికి రూ.2 లక్షల విలువైన రాజా బోహదూర్ అనే సైకిల్‌ను బహుమతిగా అందజేశారు. అదేవిధంగా ట్రాక్ నేషనల్స్‌కు గాను రూ.9.50లక్షల ట్రాక్ సైకిల్‌ను బహుమతిగా ఇస్తానని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌లో అజయ్ దేవ్‌గన్ ఫిల్మ్ సిటీ

వెంటారా కన్జర్వేటరీకి ఏర్పాటుకు రిలయన్స్ ఆసక్తి

పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్న గ్లోబల్ సమ్మిట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం వినోదం, పర్యాటక రంగాలలో పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు దేశవిదేశాల నుండి భారీ స్పందన లభిస్తోంది. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకోనున్నారు. రిలయన్స్ గ్రూప్ తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతోంది. రిలయన్స్‌కు చెందిన వెంటారా యానిమల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్, వైల్ లైఫ్ కన్జర్వేటరీ, నైట్ సఫారి ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టుతో రాష్ట్ర పర్యాటక రంగం రూపురేఖలు మారనున్నాయి. ఫుడ్లింక్ ఎఫ్ అండ్‌బి హోల్డింగ్స్ కంపెనీ రూ.3 వేల కోట్లతో ఫ్యూచర్ సిటీలో మూడు హోటళ్లను నిర్మించేందుకు ఒప్పందం చేసుకోనున్నారు.ఈ కీలక ఒప్పందాలపై ఈ గ్లోబల్ సదస్సులో సంతకాలు కానున్నాయని ప్రభుత్వ అధికార వర్గాలు తెలిపాయి.

## టిజిఒ పదవుల్లో సామాజిక న్యాయం పాటించాలి

తెలంగాణ బిసి జెఎసి చైర్మన్ ముకురాల చంద్రశేఖర్ గౌడ్

**ప్రజాపక్ష/హైదరాబాద్ :** ప్రస్తుతం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు విద్యా ఉద్యోగ రంగాలలో ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిజిఒ) లో కూడా సామాజిక న్యాయం పాటించాలని తెలంగాణ రాష్ట్ర బిసి ఉద్యోగుల జాయింట్ ఆక్షన్ కమిటీ చైర్మన్ ముకురాల చంద్రశేఖర్ గౌడ్ కోరారు. త్వరలో ఖాళీ కానున్న టిజిఓ ప్రధాన కార్యదర్శి పదవితో పాటు మిగతా ఖాళీలను కూడా బిసిలకు మాత్రమే కేటాయిచాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బిసి ఉద్యోగుల జెఎసి కోఆర్డినేటర్ డాక్టర్ దేశబోయిన రమ, కన్వీనర్ బొద్దు శ్రీనివాసులు, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదిగట్ల కృష్ణ, బిసి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జ్యోతి శీలం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇది ప్రజాపాలన కాదు, ఆంధ్ర ద్రోహుల పాలన

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రజా పాలనలో విద్యుత్ శాఖలో ఆంధ్ర అధికారుల పెత్తనం పెరిగిందని, ఇది ప్రజాపాలన కాదని, ఆంధ్ర ద్రోహుల పాలన అని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. తాను ఆర్థిక శాఖ మంత్రిగా 20 శాతం,30 శాతం కమీషన్లు తీసుకోలేదని, అందుకే తాను అన్‌ఫిటా.? అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ మైనింగ్ ఇంజనీర్లకు విద్యుత్ శాఖలో పెత్తనమా? అర్హత లేని ఆంధ్రా అధికారుల కోసం తెలంగాణ బిడ్డలను బలి చేస్తారా? అని ప్రశ్నించారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో రూ.600 కోట్లు వసూళ్లని, మెగావాట్‌కు రూ.30 లక్షల లంచం ఇవ్వలేదని ఫైళ్లు తొక్కి పెట్టారని ఆరోపించారు. ఓట్ల కోసం సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తుంటే రాష్ట్ర ఎన్నికల సంఘం నిద్రపోతోందా? అని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో పవర్ డిమాండ్ పెరుగుతుందనే విషయం మూడో తరగతి విద్యార్థి కూడా చెబుతారని, ఇందులో మంత్రులు చెప్పాల్సింది ఏముందన్నారు. జనాభా, టెక్నాలజీ, అవసరాలు పెరుగుతున్న కొద్దీ విద్యుత్ వినియోగం కూడా పెరుగుతుందన్నారు.

# తెలంగాణ మహిళలు కోటీశ్వరులు

పెట్రోల్ బంక్‌లు, సోలార్ ప్లాంట్లు, అద్దె బస్సులు

పారిశ్రామికవేత్తలతో పోటీ పడుతున్న మహిళలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని మహిళలు ప్రపంచ పారిశ్రామికవేత్తలతో పోటీ పడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో వివిధ పథకాలు, అభ్యుదయ విధానాలను అమలు చేసింది. రెండేండ్లలోనే మహిళల సాధికారిత దిశగా దేశంలో తెలంగాణ ఆదర్శంగా నిలబడింది. మహిళా స్వావలంబనతో పాటు మహిళల రక్షణ, ఆర్థిక భద్రతకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే 'మహాలక్ష్మి' పేరుతో మహిళలందరికీ తెలంగాణ ఆర్‌టిసి బస్సులలో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించారు. రెండేండ్లుగా ఈ ఉచిత ప్రయాణ సదుపాయం మహిళల ఆదరణను చూరగొంది. రోజూ లక్షలాది మంది తెలంగాణ ఆడబిడ్డలు చదువుల కోసం, పనుల మీద బస్సులో ఉచితంగా జీరో టికెట్‌పై ప్రయాణం చేస్తున్నారు. ఛార్జీలపై ఆదా చేసుకున్న సొమ్మును ఇతర ఖర్చులకు సర్దుబాటు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళలు రూ.7600 కోట్లు ఆదా చేసుకున్నారు. రోజుకు దాదాపు 30 లక్షల మంది మహిళలు ఆర్‌టిసి బస్సులలో జీరో టికెట్లపై ప్రయాణిస్తున్నారు. రెండో ప్రాధాన్యతగా ఇంటి ఆడబిడ్డలకు ఖర్చు తగ్గించే ఉద్దేశ్యంతో సబ్సిడీపై రూ.500లకే గ్యాస్ సిలెండర్‌ను ప్రభుత్వం అందిస్తోంది. దాదాపు 45 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. ఇందిరా మహిళాశక్తి స్కీమ్ ద్వారా స్వయంకృషితో ఎదిగే మహిళలకు రుణాలు అందించటం ద్వారా స్వయం సహాయక గ్రూపులు ఆర్థికంగా తమకాళ్ల మీద తామే నిలబడేలా సర్కారు సహకారం అందిస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ప్రస్తుతం తెలంగాణ మహిళలు సొంతగా ఆర్‌టిసికే బస్సులను అద్దెకు ఇవ్వడంతో పాటు, తామే పెట్రోల్ బంకులను కూడా నడిపే స్థాయికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహించింది. ఇందిరా జీవిత బీమా పథకం, ఇందిరా రుణ బీమా పథకం శిల్పారామం వద్ద డ్వాక్రా మహిళా బజార్ ఏర్పాటు ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు, మహిళా సంఘాలకు ఆర్‌టిసి బస్సులు, పెట్రోల్ బంకులు, మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, మహిళల భద్రత కోసం టి–సేఫ్ లాంటి సౌకర్యాలను ఈ రెండేళ్లలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు నమ్ముకున్న ప్రభుత్వం తెచ్చింది.

**విజయవంతంగా 'ఇందిరా మహిళాశక్తి మిషన్–2025 పాలసీ'**

తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం 'ఇందిరా మహిళాశక్తి మిషన్–2025 పాలసీ'ని అమలులోకి తీసుకువచ్చింది. గ్రామీణ, పట్టణ మహిళలు, యువతులను ఒకే గొడుగు కిందకు తెచ్చి వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాలనే లక్ష్యంతో వినూత్న నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటివరకు ఇందిరా మహిళా శక్తి సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధ్వర్యంలో, పట్టణాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో ఉన్నాయి. వేర్వేరు సంస్థల పరిధిలో ఉండటంతో ఉమ్మడి పథకాల అమలుకు ఇబ్బందులున్నాయని ప్రభుత్వం గుర్తించింది. గ్రామాల్లోని సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారు పట్టణాలకు వలస వచ్చినప్పుడు వారికి పథకాలు అందడంలేదు. మరోవైపు చాలా గ్రామాలు పక్కన ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనమయ్యాయి. ఇప్పటికే సెర్ప్ పరిధిలోని 33,914 సంఘాలు మెప్మా పరిధిలోకి వెళ్లాయి. అందుకే మెప్మా, సెర్ప్ వేర్వేరుగా కాకుండా సంఘాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేలా ప్రజా ప్రభుత్వం కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర పథకాలన్నీ అన్ని ప్రాంతాల మహిళలకు సమానంగా అందించింది. మెప్మా, సెర్ప్ విలీన ప్రక్రియ చేపట్టిన తర్వాత కొత్త సభ్యులతో మహిళా సంఘాల సభ్యుల సంఖ్య కోటికి చేరాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. కోటి మంది మహిళలు రూ.లక్ష కోట్ల రుణాన్ని పొందినప్పుడు నిజమైన మహిళా సాధికారత సిద్ధిస్తుందని సంకల్పించింది.

**మహిళల సాధికారత, స్వావలంబనకు ఆదర్శవంతమైన కార్యక్రమాలు**

మహిళల సాధికారత, స్వావలంబనకు ఈ రెండేండ్లలో ప్రజా ప్రభుత్వం దేశంలోనే ఆదర్శవంతమైన కార్యక్రమాలు అమలు చేసింది. తెలంగాణ మహిళల సమగ్ర వికాసమే ధ్యేయంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.26 వేల కోట్ల రుణాలను పంపిణీ చేసింది. కొత్తగా 2,25,110 సంఘాలు రూ.4825.54 కోట్ల వ్యాపారాలను ప్రారంభించాయి. రాష్ట్రంలో 22 జిల్లాల్లో జిల్లా సమాఖ్యలకు ఇందిరా మహిళాశక్తి భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. సెక్రెటేరియట్‌తో పాటు జిల్లా కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆఫీసులు, కోర్టులు, కాలేజీలు, ఆసుపత్రులు, ఆలయాలు, టూరిస్టు ప్రాంతాలు న్యాయస్థానాలు, కళాశాలలు, ఆసుపత్రులు, దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని ఐటీ హబ్ మాదాపూర్‌లో మహిళా శక్తి బజార్‌ను ఏర్పాటు చేసింది. రూ.9 కోట్లతో 106 దుకాణాల సముదాయాన్ని నిర్మించి, సంఘాలకు కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌ను కుట్టే పనులను ప్రభుత్వం ఈ సంఘాలకు అప్పగించింది. ఈ కుట్టుకూలీ ఛార్జీలతో రూ.30 కోట్ల ఆదాయం సంఘాలకు సమకూరింది. పాఠశాలల నిర్వహణ, నిర్మాణ పనులను ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించింది. ఈ కమిటీలకు రూ.554 కోట్ల విలువైన పనులు అప్పగించింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యశాఖ ద్వారా 32 జిల్లాల్లో మొబైల్ ఫిష్ అవుట్ లెట్లను ప్రారంభించింది. రూ.10 లక్షల విలువైన వాహనాలను 60 శాతం సబ్సిడీతో అందజేసింది. ప్రమాదానికి గురైన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ప్రమాద బీమాను అందించింది. కొన్ని కుటుంబాలకు రూ.2 లక్షల రుణబీమాను చెల్లించింది. పారిశ్రామికవేత్తలతో పోటీపడేలా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలతో పెట్రోలు బంక్‌లను ఏర్పాటు చేయించింది. నారాయణపేట, సంగారెడ్డిలో జిల్లా సమాఖ్యలు పెట్రోలు బంక్‌లు నిర్వహించి లాభాల బాటలో నడుస్తున్నాయి. దేశంలోనే తొలి సారిగా మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 32 జిల్లాలలో 64 మెగా మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. మహిళా సమాఖ్యల వద్ద ఉన్న రూ.54 కోట్లతో 600 బస్సులను కొనుగోలు చేసి ఆర్‌టిసికి అద్దెకివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవలే 17 జిల్లాల్లో సమాఖ్యల అధ్వర్యంలో 151 బస్సులను కొనుగోలు చేశారు. ఆర్‌టిసికి అద్దెకు ఇవ్వటంతో మహిళా సంఘాలు బస్సులకు ఓనర్లయ్యారు. ఆర్థిక సాధికారత కోసం మరో 449 బస్సులు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇందిరా గాంధీ జయంతి నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చీరల పంపిణీ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కోటి చీరలు మొదటి దశలో 65 లక్షల గ్రామీణ మహిళలకు పంపిణి చేయాలని, రెండో దశలో మార్చి నెలలో పట్టణ మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## మహిళల హక్కుల కోసం పోరాడిన వీర వనిత ఈశ్వరీబాయి

107వ జయంతి వేడుకల్లో వక్తలు

ఈశ్వరీబాయి అవార్డును అందుకున్న మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళిత సమాజంలో జన్మించి, అంబేద్కర్ ఆశయాలతో సమాజంలో మహిళలపై జరుగుతున్న అనిశ్చితిని ఎదురించి, మహిళల అభ్యున్నతితో పాటు వారి హక్కులకై గళమెత్తి పోరాడిన వీర వనిత జె.ఈశ్వరిబాయి అని పలువురు వక్తలు అన్నారు. మాజీ మంత్రి గీతారెడ్డి అధ్యక్షతన ఆమె తల్లి, ప్రముఖ సంఘ సేవకురాలు, మాజీ ఎంఎల్‌ఎ ఈశ్వరీబాయి 107వ జయంతి ఉత్సవాలు సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంలో మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ రంగాల్లో విశిష్ట సేవలందించిన మంత్రి సీతక్కకు ఈశ్వరిబాయి మెమోరియల్ అవార్డును అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జై భీమ్, జోహార్ ఈశ్వరి బాయి అంటూ ఈశ్వరి బాయి స్ఫూర్తికి వందనం తెలిపారు. ఈశ్వరి బాయి అవార్డు తనకు ఇవ్వడం ద్వారా మరింత బాధ్యతను అప్పగించినట్టే అని చెప్పారు. ఈ అవార్డు తన పనితీరును మరింత మెరుగుపర్చడానికి ప్రేరణనిస్తుందన్నారు. ఈశ్వరి బాయి చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, వాటిని కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని నీరుగార్చే పరిస్థితులు కనబడుతున్నాయని, అంబేద్కర్‌ని అవమానించే ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఆదివాసీల మీద కేంద్ర ప్రభుత్వం అణచివేత కొనసాగిస్తుందని, ఆదివాసీల పై అణిచివేత పెరగడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొన్నారు. మాజీ మంత్రి గీతారెడ్డి, ఈశ్వరి బాయి జీవితాన్ని స్మరించుకుంటూ ఆమె చేసిన సేవలు నేటికీ సమాజానికి ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. ఆమె చూపిన మార్గంలోనే ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఈశ్వరి బాయి ధైర్యానికి ప్రతిరూపమని చెప్పారు. తాను చెప్పాలనుకున్న విషయాలను సూటిగా, నిర్భయంగా చెప్పిన నాయకురాలిగా ఆమె నిలిచిపోయారని పేర్కొన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ గతంలో ఈశ్వరి బాయి ఫైర్ బ్రాండ్ నాయకురాలైతే నేడు అదే ధైర్యాన్ని సీతక్క ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఈశ్వరి బాయి సేవలు, సిద్ధాంతాలు, విద్యలో చేసిన విప్లవాత్మక మార్పులు నేటికీ చరిత్రలో నిలిచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎంఎల్‌ఎ శ్రీగణేష్, టిజిఐసిసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, సంగీత నాట్య అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, కార్పొరేటర్ విజయరెడ్డి తదితరులు హాజరయ్యారు.

## జనవరి 11న 'ఇస్కఫ్' రాష్ట్ర 2వ మహాసభలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత సాంస్కృతిక, స్నేహ సంఘం(ఇస్కఫ్) తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలు జనవరి 11న హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్నట్టు ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. అరుణ్ కుమార్ ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో మహాసభల నిర్వహణకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసినట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్‌గా మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, గౌరవ అధ్యక్షులుగా మాజీ ఎంఎల్‌సి బి. కమలాకర్ రావు, అధ్యక్షులుగా హైకోర్టు న్యాయవాధి కడారు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్. గోపాల్ కోశాదికారిగా న్యాయవాది అవ్వా విజయలక్ష్మి తో పాటు 25 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు అరుణ్ కుమార్ వివరించారు. హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర మహాసభలలో వివిధ జిల్లాల నుండి 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని, ఇందులో జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై తీర్మానాలు చేస్తామని వివరించారు. మహాసభలను అభ్యుదయ వాదులు, మేధావులు, కవులు, కళాకారులు జయప్రదం చేయాలని కోరారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1941 జూన్ 22వ తేదీన కలకత్తాలో భారత సోవియట్ యూనియన్ మిత్రమండలి రవీంద్రనాథ్ ఠాగూర్ ప్యాట్రన్‌గా స్వామి వివేకనందా సోదరుడు భూపెంద్రనాథ్ దత్త కార్యదర్శిగా పనిచేశారని, తదనంతరం 1952 మార్చి 12న భారత సోవియట్ సంస్కృతిక సంఘంగా మారిందని వివరించారు. 1993లో భారత సంస్కృతిక స్నేహ సంఘం ఇస్కఫ్ గా పునర్నిర్మణం జరిగిందన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణయ్యర్, పి.యన్. భగవతి, ఓ. చిన్నపురెడ్డి, బి.పి. జీవన్ రెడ్డి తదితరుల సారధ్యంలో గత 85 సంవత్సరాలుగా స్నేహ సంస్కృతిక, సంఘీభావ కార్యక్రమాలు జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించినట్లు అరుణ్ కుమార్ తెలిపారు.

## కార్మికలుకు జిఒ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

ఎఐటియుసి-తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్,ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఆస్పత్రులల్లో శానిటేషన్ పేషంట్, కేర్ సెక్యూరిటీ విధులు నిర్వహించేందుకు ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్) పద్ధతిలో నియమించిన కార్మికలుకు జిఒ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, వారి కాల పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి ఈనెల 4వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒక గంట నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్,ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, కార్యదర్శి ఎం. నరసింహ తెలిపారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందిచకపోతే ఈనెల 5న కోఠిలోని డిఎంఇ కార్యాలయం, వైద్య విధాన పరిషత్ కార్యాలయాల ముందు భారీ ధర్నాను నిర్వహిస్తామని వారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ విధానంలో 2022 సంవత్సరంలో కార్మికులను నియమించారని, వారికి జిఒ నంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లిస్తామని చెప్పినప్పటికీ, ఇప్పటి వరకు ఆ జిఒను అమలు చేయడం లేదన్నారు. టెండర్ కాల పరిమితి ముగిసినందున నూతన టెండర్లను ఆహ్వానించి, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, గత టెండర్లలో రూ 15,600 జీతం నిర్ణయించగా, కార్మికులకు కేవలం రూ 11వేలు మాత్రమే చెల్లిస్తున్నారని వివరించారు. ఆ టెండర్ నిబంధనలో ఉన్నటు వంటి లోపాలను ఆసరా చేసుకుని కార్మికులను శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని వారు విమర్శించారు. నూతన టెండర్లను ఆహ్వానించి, కార్మికుల జీతాలను పెంచాలని గత నెల 21న ,26వ తేదీలలో అధికారులకు వినతిపత్రాలను, నోటీసులు ఇచ్చిన విషయాన్ని ఎం.డి.యూసుఫ్, ఎం.నరసింహ గుర్తుచేశారు. దీనిపైన అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతోనే తాము నిరసనగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటికైనా నూతన టెండర్లను ఆహ్వానించి కార్మికులకు కనీస వేతనం రూ.26వేల ఇచ్చే విధంగా నిబంధనలు రూపొందించాలని, లేదంటే ఎఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులతో నిజ నిర్ధారణ కమిటీ

ఈనెల 5వ తేదీన ఘటన ప్రదేశానికి నిజ నిర్ధారణ కమిటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు సంబంధించి నిజ నిర్ధారణకుగాను ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘాల నేతృత్వంలో ఓయూ, కాకతీయ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్సిటీల విద్యార్థులతో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. ఈ నిజ నిర్ధారణ కమిటీ ఈ నెల 5న ఘటన ప్రదేశానికి వెళ్లనుందని వారు వెల్లడించారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్ కళాశాల ఆవరణలో మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు బట్టు వెంకటేశ్వర్లు, లెనిన్, విజయ్, పెంచాల సతీష్, నెల్లి సత్య, ఉప్పల ఉదయ్, పవన్ క్రాంతి, మహేష్, సుమన్, రవిచంద్ర, పాపారావు, మధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో గత నెల 18న జరిగిన కాల్పుల సంఘటనతో దేశం మొత్తం ఉలికి పడిందన్నారు . పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల ఘటనలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాడ్వి హిడ్మా, అతని భార్య రాజేతో పాటు మరో నలుగురు చనిపోయినట్లు పోలీసులు తెలుపగా,అదే ప్రాంతంలో మరుసటి రోజు జరిగిన ఎదురుకాల్పులలో మరో ఏడుగురు సాయుధ నక్సలైట్లు మరణించినట్లు మీడియా కథనాలను వెలువడ్డాయన్నారు. ఈ రెండు ఘటనలు బూటకపు ఎన్‌కౌంటర్లు అంటూ దేశవ్యాప్తంగా ప్రజాసంఘాలు, పౌరహక్కులు నేతలు ఆరోపిస్తున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నుంచి అధికారికంగా ఏలాంటి ప్రకటన రాకపోవడం అనుమానాలకు దారితీస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంతో ఈ ఘటనపై నిజ నిజాలను దేశ ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు ఈ నిజ నిర్ధారణ కమిటీ ఘటన జరిగిన ప్రదేశాలను పరిశీలించడంతో పాటు కాల్పుల్లో మరణించిన మావోయిస్టు కుటుంబాలను, ఘటనలో పాల్గొన్న ఇంటెలిజెన్స్ ఏడిజి మహేష్ చంద్రా లడ్డాను కలిసి వివరాలు సేకరించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మీడియా ప్రతినిధులను కూడా ఆహ్వానిస్తామన్నారు. .ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు ఆంధ్రప్రదేశ్ డిజిపి హరీష్ కుమార్ గుప్తా కి మావోయిస్టు పార్టీ కీ కూడా బహిరంగ లేఖ రాయడం జరిగిందని వారు వెల్లడించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కేరళ సిఎంకు ఇడి షోకాజ్ నోటీసు

**తిరువనంతపురం:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం షోకాజ్ నోటీసులు ఇచ్చింది. సిఎం వ్యక్తిగత కార్యదర్శితో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్‌కు ఈ నోటీసులు అందాయి. 2019లో మసాలా బాండ్ జారీలో విదేశీ మారకపు నిర్వహణ చట్టాన్ని (ఫెమా) ఉల్లంఘించారనే ఆరోపణలపై ఈ నోటీసులు జారీ అయ్యాయి. 2019లో కేరళ రాష్ట్రం మసాలా బాండ్లను జారీచేసింది. ఆ తరహా బాండ్లను జారీ చేసిన తొలి రాష్ట్రం కేరళనే. భారత సంస్థలు విదేశాల్లో స్థానిక కరెన్సీలో కాకుండా భారత కరెన్సీలో వీటిని జారీ చేశాయి. దేశీయంగా వృద్ధికి దోహదపడేలా విదేశీ ఇన్వెస్టర్ల నుంచి నిధులు సేకరించడం, రూపాయి అంతర్జాతీయీకరణ వీటి ఉద్దేశం. ఈ బాండ్ల ద్వారా కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ బోర్డ్ (కెఐఐఎఫ్‌బి) రూ.2వేల కోట్లమేర సమీకరించింది. తర్వాత అవి లండన్ ఎక్స్ఛేంజీకి ఎంట్రీ ఇవ్వడం ద్వారా ఆ మొత్తం విలువ రూ.2,150 కోట్లకు పెరిగింది. రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.50 వేల కోట్లను సేకరించే ప్రణాళికలో భాగంగా పినరయి విజయన్ ప్రభుత్వం ఈ బాండ్లను తీసుకువచ్చింది. అయితే ఈ నిధులను అక్రమంగా మళ్లించారని, ఫెమా చట్టాన్ని ఉల్లంఘించారని ఇడి ఆరోపిస్తోంది.

### సిద్ధరామయ్యను బ్రేక్‌ఫాస్ట్‌కు
## ఆహ్వానించిన డికె



**బెంగళూరు:** కర్ణాటకలో నాయకత్వ మార్పు వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల తన నివాసంలో బ్రేక్‌ఫాస్ట్‌కు ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను ఆహ్వానించారు. తాజాగా డికె శివకుమార్ మంగళవారంనాడు తన ఇంట్లో ఇచ్చే అల్పాహారం కోసం రావాల్సిందిగా సిద్ధరామయ్యను ఆహ్వానించారు. ఈ విషయాన్ని డికె కార్యాలయం ధ్రువీకరించింది. సిద్ధరామయ్య, డికె మధ్య అధికార పంపణీ విషయంలో విభేదాలు తలెత్తడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఇటీవల ఇద్దరు నేతలకు కొన్ని సూచనలు చేసింది. ముందుగా ఇరువురు నేతలు కలిసి చర్చించుకోవాలని, ఐక్యతా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించింది. పార్లమెంటు సమావేశాలు ఉన్నందున దానిపైనే ప్రధానంగా దృష్టిసారించాల్సి ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ...ఇరువురు నేతలను వేచిచూడాలనే సందేశాన్ని పంపినట్టు సమాచారం. ఈ క్రమంలో తొలుత సిద్ధరామయ్య తన నివాసంలో ఇచ్చిన బ్రేక్‌ఫాస్ట్‌కు డికె హాజరయ్యారు. కాగా, డికె బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చే అవకాశంపై సిద్ధరామ్యయను మీడియా ప్రశ్నించినప్పుడు, తనను కలిసినప్పుడు మంగళవారంనాడు ఇంటికి రావాలని మాత్రమే డికె చెప్పి వెళ్లిపోయారని ఆయన తెలిపారు. అయితే ఇప్పటి వరకూ ఎలాంటి పిలుపు రాలేదని, పిలిస్తే తప్పనిసరిగా వెళ్తానని సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారంనాడు బ్రేక్‌ఫాస్ట్‌కు రావాల్సిందిగా సిద్ధరామయ్యను డికె ఆహ్వానించినట్టు ఆయన కార్యాలయ వర్గాలు సోమవారం వెల్లడించాయి.

### పార్లమెంట్‌లో
## డ్రామాకు చోటు లేదు

నిరాశను వెళ్లగక్కేందుకు సభలను ప్రతిపక్షాలు ఉపయోగించుకుంటున్నాయ్ : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. పార్లమెంటు నాటకీయతకు వేదిక కాదని, ప్రసంగించడానికి ఒక వేదిక అని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత నిరాశను వ్యక్తం చేయడానికి ఒక మార్గంగా సభను మార్చారని ఆరోపించారు. శీతాకాల సమావేశాలకు ముందు పార్లమెంటు వెలుపల విలేకరులతో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సమావేశం రాజకీయ నాటకీయతకు వేదికగా మారకూడదని, నిర్మాణాత్మక, ఫలితాల ఆధారిత చర్చకు వేదికగా మారాలని, రాజకీయాల్లో సానుకూలతను తీసుకురావడానికి ప్రతిపక్షాలకు చిట్కాలు ఇవ్వాలని ఆయన సూచించారు. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఎన్నికల జాబితాపై ప్రతిపక్షాల నిరసనల కారణంగా పార్లమెంటు వర్షాకాలు సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయి. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో కొనసాగుతున్న సర్ ప్రక్రియపై చర్చించకపోతే పార్లమెంటు శీతాకాల సమావేలను కూడా స్తంభింపచేస్తామని ప్రతిపక్షాలు హెచ్చరించాయి. ప్రధాని స్పందిస్తూ కొంతకాలంగా, మన పార్లమెంటును ఎన్నికలకు వేడెక్కించే వేదికగా లేదా ఓటమి తర్వాత నిరాశకు దారితీసే వేదికగా ఉపయోగిస్తున్నారని మోదీ మండిపడ్డారు. బిహార్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల పరాజయాన్ని ప్రస్తావిస్తూ, ప్రతిపక్షాలు ఎన్నికల ఓటమితో కలవరపడ్డాయని, వైఫల్యాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయని ఆయన అన్నారు. బిహార్ ఎన్నికల్లో నమోదైన రికార్డు ఓటింగ్ ప్రజాస్వామ్యానికి అతిపెద్ద బలమని, ప్రతిపక్షాలు కూడా తమ బాధ్యతను నిర్వర్తించాలని, ప్రతిపక్షంతో సంభాషించరని ఎన్నికల్లో ఓటమి తర్వాత నిరాశ నుండి బయటపడాలని సూచించారు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలని, కొన్ని చిట్కాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

### ప్రధాని మోదీ
## ‘అతిపెద్ద డ్రామాబాజ్’

**న్యూఢిల్లీ :** చట్టసభల్లో డ్రామాలొద్దని, టిప్స్ ఇస్తానంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విసిరిన వ్యంగ్యాస్త్రాలపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. మోదీ ‘అతిపెద్ద డ్రామాబాజ్’ అని అభివర్ణించింది. పార్లమెంటులో ప్రతిపక్షాలు నాటకం ఆడుతున్నాయని ఆరోపించిన ఆయన ప్రకటన వంచన తప్ప మరొకటి కాదు అని పేర్కొంది. శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు మోదీ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ స్పందించారు. ప్రజల నిజమైన సమస్యను పరిష్కరించడానికి బదులుగా, ప్రధానమంత్రి మోదీ మరోసారి తన ‘డ్రామేబాజీ డెలివరీ’ని చేశారని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. గత 11 సంవత్సరాలుగా ప్రభుత్వం పార్లమెంటరీ మర్యాద, వ్యవస్థను నిరంతరం తుంగలో తొక్కుతోందని, అలాంటి ఘటనల జాబితా అందరికీ తెలిసిందేనన్నారు. ‘బిజెపి ఇప్పుడు ఈ పరధ్యాన నాటకాన్ని ముగించి, ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలపై పార్లమెంటు చర్చలో పాల్గొనాలి’ అని ఖర్గే అన్నారు. సామాన్యులు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానత, దేశంలోని విలువైన వనరులను దోచుకోవడంతో పోరాడుతున్నారని, అధికారంలో ఉన్నవారు అధికార దురహంకారంతో డ్రామాబాజీ ఆట ఆడుతున్నారని మండిపడ్డారు. గత వర్షాకాల సమావేశాల్లో కనీసం 12 బిల్లులను త్వరితంగా ఆమోదించారని, కొన్ని 15 నిమిషాల కంటే తక్కువ సమయంలో, మరికొన్నింటిని ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదించారన్నారు. ‘రైతు వ్యతిరేక నల్ల చట్టాలు, జిఎస్‌టి, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత వంటి బిల్లులను ఎలా బుల్డోజ్ చేశారో దేశం మొత్తం చూసిందన్నారు. సర్ ప్రక్రియలో పనిభారం కారణంగా బిఎల్‌ఒలు నిరంతరం ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతిపక్షం ‘ఓట్ల దొంగతనం’ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటోందని, తాము వాటిని పార్లమెంటులో నిరంతరం లేవనెత్తుతామని చెప్పారు. ప్రధాని ఎప్పుడూ పార్లమెంటుకు హాజరు కారని, దానిని బలహీనపరుస్తారని, ప్రతిపక్షంతో సంభాషించరని రమేష్ అన్నారు. అయినప్పటికీ ప్రతి సమావేశానికి ముందు ఆయన పార్లమెంటు భవనం వెలుపల నిలబడి, లోక్‌సభ, రాజ్యసభ సజావుగా సాగడానికి ప్రతిపక్షాల నుండి నిర్మాణాత్మక సహకారం కోరుతూ జాతిని ఉద్దేశించి గొప్పగా మాట్లాడతారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ప్రారంభమయ్యే ముందు ప్రధాని చేసిన ప్రకటన కపటత్వం తప్ప మరొకటి కాదు, వాటిలో అతిపెద్ద డ్రామాబాజ్ డ్రామా గురించి మాట్లాడటమని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు కనీసం తమ అభిప్రాయాన్ని చెప్పడానికి అవకాశం ఇవ్వకుండా ఆయన ఎల్లప్పుడూ తన ఇష్టానుసారం ఉండాలని కోరుకుంటాటాడన్నారు.



**తీవ్రమైన అంశాలపై చర్చ కోరితే డ్రామా ఎలా అవు-తుంది..? : ప్రియాంకాగాంధీ**

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), ఢిల్లీ కాలుష్యం వంటి తీవ్రమైన అంశాలను లేవనెత్తడం డ్రామా ఎలా అవుతుందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. ఎన్నికల నిర్వహణలో అవకతవకలు, ఎస్ఐఆర్, కాలుష్యం వంటివి తీవ్రమైన అంశాలని, వాటిని చర్చిద్దామని ప్రియాంకాగాంధీ అన్నారు. సీరియస్ అంశాలపై చర్చ లేకపోతే పార్లమెంట్ దేనికి..? అని ఆమె ప్రశ్నించారు. ఆయా అంశాలపై మాట్లాడటమేమీ డ్రామా కాదని, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అని వ్యాఖ్యానించారు.

### ఎస్ఐఆర్ పని ఒత్తిడి..
## మరో బిఎల్‌ఒ ఆత్మహత్య



**బరేలి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో పని ఒత్తిడి కారణంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒ) ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు కలవరపెడుతున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో బిఎల్‌ఒ బాధ్యతల్లో ఉన్న 46 ఏళ్ల ప్రభుత్వ టీచర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనను మొరాదాబాద్‌లోని భగత్‌పూర్ తాండా విలేజ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో అసిస్టెంట్ టీచర్ సర్వేశ్ సింగ్‌గా గుర్తించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పనులతో తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యాయని, తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమయ్యానని సింగ్ రికార్డు చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆత్మహత్య చేసుకుంటున్నందుకు క్షమించాలని కుటుంబసభ్యులను ఆ వీడియోలో కోరారు. ఆయనకు భార్య బాబ్లి, నలుగురు కుమార్తెలు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం, బహెరి గ్రామంలోని తన నివాసంలో సింగ్ ఉరేసుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆయన ముందుగా ఈ విషయాన్ని గుర్తించారు. తనకిచ్చిన పని పూర్తి చేసేందుకు తగిన సమయం లేకపోయిందని, పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయిందని పేర్కొంటూ సింగ్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపినట్టు రూకూర్ద్వారా సర్కిల్ ఆఫీసర్ ఆశిష్ ప్రతాప్ సింగ్ తెలిపారు.

## రాజ్యసభ చైర్మన్ ఇద్దరికీ ముఖ్యుడే...

మాజీ చైర్మన్ ధన్‌ఖడ్ నిష్క్రమణపై ప్రస్తావన

రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** మాజీ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ మాజీ చైర్మన్ జగదీప్ ధన్‌ఖఢ్ ఆకస్మికంగా, ఊహించని విధంగా విధుల నుంచి నిష్క్రమించడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ప్రస్తావించారు. దీంతో అధికార పారీట సభ్యుల నుంచి కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. ఇది సందర్భంగాక కాదని పేర్కొన్నారు. కాగా, ధన్‌ఖడ్ రాజీనామా తరువాత ఉపరాష్ట్రతిగా సిపి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. ఆయన రాజ్యసభ చైర్మన్‌గా కూడా ఉండడంతో సోమవారం తొలిసారిగా రాజ్యసభకు విచ్చేశారు. దీంతో చైర్మన్ రాకను ప్రతిపక్ష పార్టీల తరపున ఖర్గే స్వాగతించారు. ఈ నేపథ్యంలోనే ధన్‌ఖడ్ అంశాన్ని, సమావేశాల ప్రారంభానికి కంటే ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనను కూడా ప్రస్తావించారు. ‘రాజ్యాంగ విలువలు, అనాదిగా గౌరవించబడిన పార్లమెంటరీ సంప్రదాయాలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుంది’ అని ఆయన అన్నారు. కార్యక్రమాల నిర్వహణలో సహకరిస్తామని హామీనిచ్చారు. అయితే, కార్యక్రమాల న్యాయమైన, నిష్పాక్షికమైన నిర్వహణ, ప్రతి పార్టీ సభ్యులకు న్యాయమైన అవకాశం కల్పించడం, ఈ కార్యాలయం విశ్వసనీయతకు చాలా అవసరం అని ఆయన అన్నారు. పార్లమెంటరీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా చైర్మన్ పదవి నుండి ఊహించని, ఆకస్మికంగా ధన్‌ఖడ్ నిష్క్రమించడాన్ని తాను ప్రస్తావించాల్సి వచ్చిందన్నారు. సభ సంరక్షకుడిగా రాజ్యసభ చైర్మన్ ప్రభుత్వానికి ఎంత ముఖ్యమో, ప్రతిపక్షానికి కూడా అంతే ముఖ్యుడని అని ఖర్గే అన్నారు. దీంతో అధికార పార్టీ బెంచ్‌ల నుండి కాస్త గందరగోళం నెలకొంది. ఈ సభకు ధన్‌ఖడ్‌కు వీడ్కోలు పలికే అవకాశం లభించకపోవడం తనకు నిరాశ కలిగించిందని కూడా ఖర్గే పేర్కొన్నారు. రాధాకృష్ణన్ కాంగ్రెస్ సభ్యుడిగా ఉన్న మూడు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైన మాజీ ఎంపి సికె కుప్పుస్వామికి బంధువు అని ఖర్గే కూడా ప్రస్తావించారు. ‘మీరు రెండు పార్టీల మధ్య సమతుల్యతను పాటిస్తే మంచిది. మీరు విజయవంతంగా పదవీ కాలం గడపాలని కోరుకుంటున్నాను... మీరు వచ్చిన నేపథ్యాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు, కానీ మీరు కాంగ్రెస్ కుటుంబానికి చెందినవారని కూడా మీరు మర్చిపోకూడదు‘ అని ఆయన అన్నారు. అయితే ప్రధానమంత్రి పార్లమెంట్ వెలుపల ఒక ప్రకటన చేశారని, ఆయన పరోక్షంగా తమపై కూడా దాడి చేశారని మండిపడ్డారు. దానికి తాము సభలో సమాధానం ఇస్తామన్నారు. ‘సమస్యలపై చర్చించకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు బిజెపి చేస్తున్న డ్రామాను ఆపేయాలి. సాధారణ పౌరులు నిరోద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలతో ఇబ్బందులు పడుతున్నారు. పార్లమెంట్‌లో మణిపూర్ సమస్య లెవనెత్తినప్పుడు అందరూ మౌనంగా ఉన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టాక దానిపై చర్చించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల పనిఒత్తిడి పెరిగి అనేక మంది బిఎల్‌ఒలు ప్రాణాలను కోల్పోతున్నారు. ప్రతిపక్షాలు ఓట్ చోరీపైనా పోరాడాతున్నాయి. ఈ అంశంపైన పార్లమెంట్‌లో చర్చించేవరకు నిరంతరం పోరాడుతాం’ అని ఖర్గే అన్నారు.

## సరిహద్దుల్లో కాపలా లేకపోవడమే పెద్ద సమస్య

భారతీయుల రాకతో అపార ప్రయోజనం పొందిన అమెరికా:ఎలాన్‌మస్క్

**న్యూయార్క్:** భారతీయ నైపుణ్యంవల్ల, భారతీయులు వలస రావడంవల్ల అమెరికా అపార ప్రయోజనాలు పొందిందని ప్రపంచ కుబేరుడు, ఒకప్పటి ట్రంప్ అనుంగు మిత్రుడు ఎలాన్ మస్క్ అన్నారు. ‘‘పీపుల్స్ బై డబ్ల్యుటిఎఫ్’’ పేరుతో ఆదివారం విడుదలైన పాడ్‌కాస్ట్‌లో ఎలాన్ మస్క్ తన మనస్సులో ఉన్న అనేక అభిప్రాయాలు పంచుకున్నారు. పెట్టుబడిదారుడు, ఔత్సాహిక పారిశ్రామికవేత్త నిఖిల్ కామత్‌కు పాడ్ కాస్ట్ ద్వారా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎలాన్‌మస్క్ మాట్లాడుతూ, హెచ్1బి వీసాలు దుర్వినియోగం కావడంవల్ల వలసలు విపరీతంగా పెరిగాయని, ఈ వలసలవల్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఈ వ్యతిరేకతే కొత్త పరిణామాలకు దారితీసిందని అన్నారు. అదేసమయంలో ఆయన హెచ్1బి వీసా ప్రోగ్రామ్‌కు చాలా బలంగా మద్దతు తెలియజేశారు. వీసాల దుర్వినియోగంవల్ల ఈ విధమైన పరిణామాలు సంభవించడం అమెరికాకు చాలా నష్టం కలిగించిందన్నారు. ఐతే ప్రపంచంలో అపారమైన ప్రతిభగలవారికి అవకాశం ఇచ్చేందుకు తాము ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలాంటివారికి సగటువేతనాలకంటే చాలా ఎక్కువగా చెల్లిస్తామన్నారు. అమెరికాకు రావాలని కోరుకునే యువ భారతీయులను తాము ఎప్పుడూ గౌరవిస్తామన్నారు. ‘‘ఔను, ప్రతిభావంతులైన భారతీయుల నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడంవల్ల అమెరికా బ్రహ్మాండంగా ప్రయోజనాలు పొందింది, వారు అమెరికాకు రావడంవల్ల దేశానికి ప్రయోజనం కలిగింది’’ అన్నారు మస్క్. హెచ్ 1 బి వీసా ప్రోగ్రామ్‌ను కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేశాయని, దీనివల్ల ప్రతిభావంతులకు నష్టం జరిగిందని, ఇదే అమెరికాకు నష్టం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయకుండా ఉండాల్సిందన్నారు. హెచ్1 బి వీసాలను తాను రద్దుచేయాలని కోరుకోవడంలేదన్నారు. దేశంలోకి వలసలు విపరీతంగా జరుగుతున్నాయని, వీరిలో ఎలాంటి అర్హత పత్రాలు లేకుండా సరిహద్దుల నుండి దేశంలోకి చొరబడుతున్నారని, గత ప్రభుత్వం సరిహద్దుల్లో సరైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంవల్ల పొరుగు దేశాల నుండి ఇష్టానుసారంగా దేశంలోకి వలసలు వచ్చారని, వీరంతా ప్రభుత్వం నుండి ప్రయోజనాలు పొందడంతో మరిన్ని వలసలు పెరిగాయన్నారు. ఈ వలసలే అమెరికన్లలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడటానికి కారణమైందని, ఇది నైపుణ్యంగల ఇతర దేశీయులపైన, ప్రతిభావంతుల వలసపైన కూడా తీవ్ర ప్రభావం చూపించిందన్నారు. అమెరికా దేశానికి ప్రతిభావంతుల అవసరం ఎప్పుడూ ఉంటూనే ఉంటుందని, ప్రతిభావంతులకు దేశం తలుపులు ఎప్పుడూ తెరచే ఉంటాయని ఎలాన్‌మస్క్ అన్నారు. చాలా దేశాలకు ఇలాంటి పరిస్థితి ఉందన్నారు. జో బైడెన్ దేశాధ్యక్షుడుగా ఉండగా దేశంలోకి విపరీతంగా వలసలు జరిగాయని విమర్శించారు. ప్రాథమికంగా సరిహద్దుల్లో ఎక్కడా కాపలా లేకుండాపోయిందని, అందువల్ల అక్రమ వలసలను అరికట్టడానికి, అనర్హులను అదుపు చేయడానికి సరిహద్దులను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. డోనాల్డ్ ట్రంప్ కూడా గతంలో దాదాపు ఇవే అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా ఆయన గొప్ప ప్రతిభావంతులను దేశానికి ఆహ్వానిస్తామని చెబుతున్నారు. కాకపోతే చిన్న చిన్న ఉద్యోగాలలో కూడా తక్కువ జీతాలు ఇచ్చేందుకు వలసలను కొన్ని టెక్నాలజీ కంపెనీలు ప్రోత్సహించి వీసాలను దుర్వినియోగం చేశాయని ట్రంప్ ఇంతకుముందు విమర్శించారు. గడచిన సెప్టెంబరునెలలో ట్రంప్ విదేశీ కార్మికులు దేశంలోకి ప్రవేశించడంపై ఆంక్షలు అమలు చేశారు. ఇకమీదట హెచ్1బి వీసా పొందాలనుకున్నవారు ఒకేసారి 1,00,000 డాలర్లు చెల్లించాలని నిబంధన విధించారు. దీంతో టెక్నాలజీ కంపెనీలు గగ్గోలు పెట్టాయి.

### పునర్వినియోగ ఇంధనంపై
## కేంద్రం చెప్పేవన్నీ వట్టి కబుర్లే

ఆదివాసీలను వెళ్ళగొట్టి అడవులను నాశనం చేస్తున్నారు
రాజ్యసభలో మంత్రి బండారం బయటపడిందని

సిపిఐ ఎంపి సునీర్ విమర్శ



**న్యూఢిల్లీ:** దేశంలో రోజు రోజుకూ బొగ్గు ఉత్పత్తి పెరిగిపోతూ ఉండటంతో, పునర్వినియోగ ఇంధనంవైపు దేశం పరివర్తన చెందుతోందని కేంద్ర ప్రభుత్వం పదే పదే చేస్తున్న ప్రకటనలన్నీ వట్టి కబుర్లు మాత్రమేనని కేంద్రమంత్రి ప్రకటన ద్వారా మరో సారి రుజువైంది. పార్లమెంటు సమావేశాల ప్రారంభం సందర్భంగా మొదటిరోజు సోమవారం రాజ్యసభలో సిపిఐ సభ్యుడు పిపి.సునీర్ లేవనెత్తిన ఒక ప్రశ్నకు బొగ్గుశాఖామంత్రి ఇచ్చిన సమాధానం కేంద్ర ప్రభుత్వ బూటకపు మాటలను చాలా స్పష్టంగా బహిర్గతం చేసింది. మంత్రి సమాధానంపై ఎంపి సునీర్ తీవ్రస్థాయిలో ప్రతిస్పందించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వాతావరణాన్ని పాడుజేస్తున్న ప్రభుత్వ విధానాలను విమర్శించారు. సిపిఐ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో 2015 తర్వాత బొగ్గు గనుల కేటాయింపులకు సంబంధించిన అధికారిక కార్యకలాపాలను సర్వస్వతంత్రంగా విశ్లేషించాలని సునీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటవీశాఖద్వారా అడవులను ఎంతమేరకు ఎవరెవరికి కేటాయించారో, పర్యావరణ ప్రయోజనాలకు భిన్నంగా అడవులను ఎటువైపు మళ్ళించారో వివరాలన్నీ పూర్తిగా బహిర్గతం చేయాలని కోరారు. పర్యావరణానికి హాని కలిగించే ఉపశమన విధానాలను అన్నింటినీ తక్షణం రద్దు చేయాలని, బొగ్గు ఉత్పత్తులపై దేశం ఆధారపడకుండా, బొగ్గు వినియోగాన్ని తగ్గించడంతోపాటు, పునర్వినియోగ ఇంధనం వైపు దేశం పరివర్తన చెందడానికి ఒక విశ్వసనీయమైన, కాలపరిమితితో కూడిన బృహత్తర ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బొగ్గు వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేసేందుకు కేంద్రం వాతావరణాన్ని పరిరక్షించేందుకు పునర్వినియోగ ఇంధనంవైపు దేశం పరివర్తన చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదే పదే చేస్తున్న ప్రకటనలన్నీ వట్టి కబుర్లేనని మంత్రి సమాధానం రుజువు చేసిందని సిపిఐ ఎంపి సునీర్ విమర్శించారు.

## పంట వ్యర్థాల దహనాన్ని ... ‘రాజకీయం చేయొద్దు’

వాయుకాలుష్యంపై రైతులను నిందించడం సరికాదని ‘సుప్రీం’ హితవు

డిసెంబరు 10న విచారణ కోసం పిటిషన్ జాబితా

చర్యలపై వారం లోపు నివేదిక ఇవ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్‌కు ఆదేశం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీఎన్‌సిఆర్ పరిధిలో వాయుకాలుష్యంపై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్య సమస్యను శీతాకాలంలో మాత్రమే జాబితా చేయాల్సిన ‘ఆచార’ కేసుగా పరిగణించలేమని సుప్రీంకోర్టు సోమవారం పేర్కొంది. ఈ ముప్పునకు స్వల్ప, దీర్ఘకాలిక పరిష్కారమార్గాలను కనుగొనేందుకు నెలలో రెండుసార్లు తీసుకుంటామని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ‘పంట వ్యర్థాలను తగులబెట్టే అంశాన్ని’ అనవసరంగా రాజకీయ సమస్యగా లేదా అహంకార సమస్యగా పరిగణించకూడదు’ అని ప్రధాన న్యామమూర్తి సూర్యకాంత్, జాయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీఎన్‌సిఆర్‌లో వాయుకాలుష్యానికి ప్రధాన కారణమైన పంట వ్యర్థాల దహనంపై సాధారణ నిందను ప్రశ్నిస్తూ హర్యానాలోని హిస్సార్‌కు చెందిన రైతు కుటుంబం నుండి వచ్చిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందిస్తూ ‘కోవిడ్ సమయంలో పంట వ్యర్థాల దహనం జరిగింది. కానీ ప్రజలు ఇప్పటికీ నీలి ఆకాశాలను ఎందుకు చూడలేకపోతున్నారు? ఇది ఇతర అంశాలు కూడా ఇందులో ఉన్నాయనే విషయాన్ని సూచిస్తుంది’ అని అన్నారు. ఢిల్లీఎన్‌సిఆర్ పరిధిలో పెరుగుతున్న వాయుకాలుష్యానికి ‘కోర్టులో ప్రాతినిథ్యం వహించని రైతులను లక్ష్యంగా చేసుకుని అనవసరంగా నిందించడం సరికాదు... కాబట్టి మేం పంట వ్యర్థాల దహనం గురించి వ్యాఖ్యానించదలచుకోలేదు’ అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. పంట వ్యర్థాల దహనం సమస్య అనవసరంగా రాజకీయ సమస్యగా లేదా అహంకార సమస్యగా మారకూడదని ఆయన సూచించారు. తక్షణ, దీర్ఘకాలిక చర్యలపై స్పష్టత కోరుతూ, వాయు కాలుష్య ముప్పును పరిష్కరించడానికి స్వల్ప, దీర్ఘకాలిక గురించి తెలియజేయడానికి కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఏక్యూఎం), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి), ఇతరులు తీసుకున్న నిర్దిష్ట చర్యలు ఏమిటో వివరించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రాన్ని కోరింది. ఇది డిసెంబరు 10న విచారణ కోసం పిటిషన్‌ను జాబితా చేసింది. దీనికి ముందు ప్రారంభంలో సిజెఐ సూర్యకాంత్ మాట్లాడుతూ ఢిల్లీ కాలుష్య అంశాన్ని అక్టోబరు నెలలో ఆచారంగా జాబితా చేయవచ్చు. దానిని నెలకు కనీసం రెండుసార్లు క్రమం తప్పకుండా జాబితా చేయవచ్చు అని అన్నారు. ‘సోమవారం నాటి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) గురించి ఆయన ప్రస్తావిస్తూ నా సోదరుడు (జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి) ఈ అంశం ఈ రోజు జాబితా చేయబడిందని నాకు చెప్పారు. ఏక్యూఐ స్థాయిలలో మెరుగుదల కూడా ఉందని విన్నాను’ అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారుల తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యాభాటి వాయు కాలుష్యానికి సంబంధించిన కీలక కారణాలను ప్రస్తావించారు. ‘పంట వ్యర్థాల దహనం, వాహనాల కాలుష్యం, నిర్మాణాల దుమ్ము, రోడ్ల దుమ్ము, జీవపదార్థాల దహనం వంటి అంశాలు ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్యానికి దోహదపడే కారకాలు’ అని ధర్మాసనానికి వివరించారు. ‘ఒక్కో డిపార్ట్‌మెంట్ హెడ్స్ వాయు కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమేమిటన్న వివనగరాల అభివృద్ధి జీవన నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. సమస్యకు దోహదపడే అంశం ఏమిటో శాస్త్రీయ విశ్లేషణతో ఉండాలని ధర్మాసనం తెలిపింది.

## బెంగాల్‌లో బిఎల్‌ఒల నిరసన.. ‘సర్’ పని ఒత్తిడిపై ఆందోళన

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విధులు నిర్వహిస్తున్న పోలింగ్ బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒ) భారీ నిరసన చేపట్టారు. పని ఒత్తిడి, పని పరిస్థితులు, మానసిక ఆరోగ్యంపై ఆందోళన చెందారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగామారింది. బిఎల్‌ఒ అధికార్ రక్షా కమిటీ నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వెలుపల భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ‘సర్’ విధుల వల్ల ఒత్తిడి, పని పరిస్థితులు, మానసిక ఆరోగ్య పరిస్థితుల వల్ల కొందరు బిఎల్‌ఒలు ఆత్మహత్యలకు పాల్పడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు వారు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా, సోమవారం ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో శాసనసభ్యుల బృందంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బిజెపికి చెందిన ప్రతిపక్ష నేత సువేందు అధికారి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అక్కడకు చేరుకున్నారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ‘వెనక్కి వెళ్లిపోండి’ అంటూ నిరసన చేస్తున్న బిఎల్‌ఒలు బిజెపి నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు బిజెపి కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. నిరసన చేస్తున్న బిఎల్‌ఒలకు ప్రతిగా నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొన్నది. అయినప్పటికీ బిజెపి నేతలు ఆ కార్యాలయంలోకి వెళ్లారు. బిఎల్‌ఒల పని పరిస్థితులకు టిఎంసి ప్రభుత్వమే కారణమని సువేందు అధికారి ఆరోపించారు.



ప్రజాపక్షం
మంగళవారం, 02 డిసెంబరు

# క్షమాభిక్షకై నెతన్యాహు విన్నపం

ఆధునిక ప్రపంచంలో నరహంతకుడెవరైనా ఉన్నారంటే అతడు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు. మైనారిటీ ప్రభుత్వ అధినేతగా కొనసాగుతున్న అతను గాజాలో పాలస్తీనా మిలిటెంట్‌లతో యుద్ధం పేరుతో మావన హననం సాగిస్తున్నాడు. 2023 అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయెల్‌పై పాలస్తీనా తీవ్రవాద సంస్థ హమస్ కేడర్లు ఆకస్మిక దాడిచేసిన అనంతరం ఇజ్రాయిలీ బందీల విడుదల పేరుతో గాజాపై నెతన్యాహు సాగిస్తున్న క్రూరమైన సైనికదాడిలో ఇప్పటివరకు 70,100మంది అమాయక ప్రజలు హతులైనారు. వారిలో హమస్ క్యాడర్లు కొద్దిమంది మాత్రమే. ఆసుపత్రులపై, ఆహార సరఫరా కేంద్రాలపై కూడా దాడులు చేయించిన పరమ కిరాతకుడతడు. తొలి శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన అనంతరం అతికష్టంమీద కుదిరిన రెండవ శాంతి ఒప్పందం (ట్రంప్ పథకం) తదుపరి కూడా ఏదోక సాకుతో గాజాను ధ్వంసం చేస్తున్న దుర్మార్గుడు నెతన్యాహు. లక్షలాది పాలస్తీనియన్‌లను వారి మాతృగడ్డనుంచి తరిమివేసి, ఇరుగుపొరుగు అరబ్ రాజ్యాలను సైనికంగా దెబ్బతీసి వాటికి పక్కలో బల్లెంలా వ్యవహరిస్తున్న ఈ యూదుమత జాత్యహంకారి పాలస్తీనియన్‌లకు సొంతరాజ్య స్థాపనతో, ఇజ్రాయిల్– పాలస్తీనా రెండు సహజీవనం చేసేలా ప్రతిపాదించబడిన 'రెండు రాజ్యాల' పరిష్కారాన్ని సైనిక గర్వంతో వ్యతిరేకిస్తున్నాడీ యుద్ధ పిపాసి. ఒకప్పుడు ఇజ్రాయెల్‌ను శత్రువుగా చూసిన అరబ్ రాజ్యాలు ఇప్పుడు రెండు రాజ్యాల పరిష్కారాన్ని ఆచరణాత్మక దృష్టితో అంగీకరిస్తున్నాయి. అయితే పశ్చిమాసియా రాజకీయ చదరంగంలో అమెరికా ప్రయోజనాలకు రక్షకుడిగా ఉన్న నెతన్యాహూకు అమెరికా పాలకులు (ఏ పార్టీ అధికారంలో ఉన్నా) సర్వ విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారు. వారు ఇరాన్‌ను బూచిగా చూపి ఇతర అరబ్‌రాజ్యాలను లొంగదీసుకున్నారు. ప్రస్తుత ట్రంప్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తొలిటరంలో వివాదాస్పదమైన జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించి, అక్కడ తమ రాయబార కార్యాలయం నెలకొల్పి పాలస్తీనియన్‌లపై కవ్వింపు చర్యకు ఒడిగట్టారు. ఇప్పుడేమో ఇజ్రాయెల్‌కు సైనిక–ఆయుధ–ఆర్థిక సహాయం అందించటంతోపాటు నెతన్యాహును అవినీతి కేసులనుంచి కూడా తప్పించాలని చూస్తున్నాడు. ''దగా, విశ్వాస ఘాతుకం, లంచాలు స్వీకరించటం'' అనే ఆరోపణలతో నెతన్యాహు కోర్టుల్లో మూడు కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నందున ఆయనకు క్షమాభిక్ష ప్రకటించాల్సిందిగా ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్‌జోగ్‌కు ఇటీవల ట్రంప్ విజ్ఞప్తి చేశారు. దాని కొనసాగింపుగా ఇప్పుడు ప్రధాని నెతన్యాహు తమ అధ్యక్షునికి క్షమాభిక్ష అభ్యర్థన సమర్పించారు. తనకు స్నేహితులైన పచ్చి మితవాద నాయకులను కాపాడేందుకు ప్రయత్నించటం ట్రంప్ ఒక విధానంగా పెట్టుకున్నట్లున్నారు. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సనారో అవినీతిపై ఆ దేశ ప్రభుత్వం విచారణ జరుపుతుండగా దాన్ని రద్దు చేయాలని ట్రంప్ బ్రెజిల్ అధ్యక్షుడు డిసిల్వాకు విజ్ఞప్తి చేశాడు. ఆ తర్వాత ఒక కేసు విచారణలో బోల్సనారోకు 27 సంవత్సరాల జైలుశిక్ష విధించబడింది, అది వేరు విషయం. ఇతర దేశాల సర్వసత్తాక అధికారాల్లో ట్రంప్ జోక్యం అనవసరం, అభ్యంతరకరం. అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధం.

నెతన్యాహు తమ క్షమాభిక్ష అభ్యర్థనలో తనపై ఆరోపణలు తిరస్కరిస్తూ ఈ కేసు ''మీడియా, పోలీసు, జ్యుడీషియరీ'' వేధింపు అని పేర్కొన్నారు. ''రాజకీయమైనది, అన్యాయమైనది'' అన్నారు. తాను దేశరక్షణకై యుద్ధంలో మునిగిఉంటే కేసులు బనాయించి వేధిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. నెతన్యాహు మరో వీడియో ప్రసంగంలో, ''ఈ కేసు విచారణ దేశాన్ని విభజించింది. వారానికి మూడు రోజులు తాను కోర్టుకు హాజరు కావాలన్న ఆదేశం నా విధుల నిర్వహణకు భంగం కలిగిస్తుంది. విచారణ కొనసాగింపు మనల్ని దేశంలోపలనుంచి చీల్చుతుంది, విభజనతెస్తుంది, వైరుధ్యాలు పెంచుతుంది'' అంటూ జాతీయ సామరస్యం పెంపుదలకోసం కేసును ఎత్తివేయాలి'' అని కోరారు. అధ్యక్షుడు ఐజాక్ హెర్‌జోగ్ గతంలో నెతన్యాహుకు రాజకీయ ప్రత్యర్థి. అయితే ప్రస్తుత పదవీ బాధ్యతల్లో వారు సామరస్యంతోనే పనిచేస్తున్నారు. అవినీతి ఆరోపణలపై న్యాయస్థానం విచారణనుంచి నిప్పులాగా బయటపడేబదులు నెతన్యాహు జాతీయవాద విజ్ఞప్తులతో బయటపడాలని చూస్తున్నాడు.

పాలస్తీనా, ఇజ్రాయెల్ 'రెండు రాజ్యాల' పరిష్కారాన్ని పోప్ లియో XIV ఏకైకమార్గంగా ఆదివారం పునరుద్ఘాటించారు. నెతన్యాహుకు క్షమాభిక్ష పెట్టకూడదని వేలాదిమంది టెల్‌అవీవ్‌లో అధ్యక్ష భవనాన్ని ముట్టడించటం తాజా పరిణామాలు.

# అరుదైన భూమి మూలకాల తవ్వకం భారత్‌కు వరం

టి.ఎన్.అశోక్

భవిష్యత్తులో కేరళ, తమిళనాడులోని ప్రశాంత తీరప్రాంతంలో ఉండే ఇసుకలో అపార ఖనిజాలు లభించే అవకాశాలు ఉన్నాయి. నియోడైమియం, డిస్‌ప్రోసియం, ప్రసోడైమియం వంటి సరిగా ఉచ్చరించలేని పేర్లతో కూడిన పదిహేడు రసాయనికంగా సారూప్యమైన లోహాలతో కలిగిన అరుదైన భూమి మూలకాలు ఆధునిక నాగరికతకు బలం.

అవి ఎలక్ట్రిక్ వాహనాలలోని మోటార్లకు శక్తినిస్తాయి, గాలి మరలను స్థిరీకరిస్తాయి, క్షిపణులను నిర్దిష్టంగా నడిపిస్తాయి. స్మార్ట్ ఫోన్‌లను కంపించేలా చేసే అయస్కాంతాలను అందిస్తాయి. ఈ మూలకాలను నియంత్రిస్తే, మీరు హరిత ఇంధన పరివర్తన ధమనులను, సైనిక హార్డ్‌వేర్ నాడీ వ్యవస్థను నియంత్రించగలుగుతారు.

మూడు దశాబ్దాలుగా చైనా దేశం ఉక్కు పట్టుతో ఆ నియంత్రణను కలిగి ఉంది. బీజింగ్ ప్రపంచ అరుదైన మూలకాల మైనింగ్‌లో దాదాపు 60 శాతం, ముడి ఖనిజాలు విలువైన లోహాలు, మిశ్రమా గా మారే శుద్ధి దశలో అద్భుతమైన 90 శాతం వాటా కలిగి ఉంది. చైనా ఈ గుత్తాధిపత్యాన్ని నిర్మించడాన్ని ప్రపంచం చూసింది. మొదట అనుమతిగల పర్యావరణ ప్రమాణాలు, తక్కువ కార్మిక వేతనాల ద్వారా, తరువాత నిర్దాక్షిణ్యంగా వివిధ దశలపై ఆధిపత్యం ద్వారా ఇది సాధించింది.

పాశ్చాత్య దేశాలు ప్రమాదాన్ని గుర్తించే సరికే ఆలస్యం అయిపోయింది. చైనా తన ఉత్పత్తిపై నియంత్రణ సాధించిన ఏకైక దేశంగా మారింది.

పారిశ్రామిక విప్లవాలలో ఆలస్యంగా ప్రవేశించినదిగా శాశ్వతంగా కొట్టిపారేయబడిన భారతదేశం ఇప్పుడు సాహసోపేతమైన పనికి పూనుకుంది. అది ఏమీ లేని స్థితి నుంచి ప్రత్యామ్నాయ అరుదైన మూలకాల సరఫరా గొలుసును నిర్మించడం. ఏటా 6,000 టన్నుల అరుదైన మూలకాలు శాశ్వత అయస్కాంతాలను తయారు చేసేందుకు ఉద్దేశించిన 890 మిలియన్ డాలర్‌ల పథకం అనేది పారిశ్రామిక విధానం కంటే భారీదే . ఇది పారిశ్రామిక విధాన ధిక్కరణ కూడా.

భారతదేశ ఆతృతను అర్థం చేసుకోవడానికి, మొదట అరుదైన మూలకాల ఆర్థిక శాస్త్రాన్ని గ్రహించాలి. విలువ గొలుసులో నాలుగు దశలు ఉన్నాయి. వెలికితీత, శుద్ధి, అయస్కాంత తయారీ, భాగాల ఏకీకరణ. గనుల నుంచి వెలికితీత తుది విలువలో కొంత భాగాన్ని మాత్రమే కలిగి ఉంటుంది. శుద్ధి, అయస్కాంత ఉత్పత్తి అనేది కచ్చితమైన లోహశాస్త్రం, పర్యావరణ నియంత్రణలు, సాంకేతిక నైపుణ్యం అవసరమయ్యే దశలు. మొత్తం విలువలో 50 శాతం నుండి 70 శాతం వరకు ఇవే కలిగి ఉంటాయి.

ఏళ్ళ తరబడి భారతదేశం దాని తీరాల నుండి అరుదైన భూమి ఖనిజాలను తవ్వి, శుద్ధి కోసం చైనాకు వెంటనే రవాణా చేసేది. తరువాత అది ఖర్చులు, లాభాలు జోడించిన ధరతో సిద్ధమైన అయస్కాంతాలను అక్కడి నుంచి దిగుమతి చేసుకుంది. ఇది ద్రాక్షను పండించడం, వాటిని చౌకగా ఎగుమతి చేయడం,విలాస ధరలకు షాంపైన్‌ను తిరిగి కొనుగోలు చేయడం వంటిది. భారతదేశ రక్షణ రంగం, దాని నూతన విద్యుత్ వాహన పరిశ్రమ, దాని పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలు అన్నీ గుయాంగ్‌డాంగ్, జీయాంగ్జీలలో తయారైన అయస్కాంతాలపై ఆధారపడి ఉన్నాయి.

2024 ప్రారంభంలో చైనా జాతీయ భద్రత అంశాలతో అరుదైన భూమి పదార్థాలపై ఎగుమతి పరిమితులను విధించినప్పుడు భారతదేశం ఇబ్బంది పడింది. ధరలు పెరిగాయి. సరఫరా షెడ్యూలు తారుమారైంది. దుర్బలత్వం బయటపడింది. భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి బీజింగ్ సద్భావనపై ఆధారపడి ఉంది.

ఇలా ఆధారపడడాన్ని తిప్పి కొట్టే లక్ష్యంతో ఉత్పత్తి సంబంధిత ప్రోత్సాహకాలలో 780 మిలియన్ డాలర్ల మద్దతుతో ఈ కొత్త పథకం తీసుకువచ్చింది. భారతదేశం దేశీయ శుద్ధి సామర్థ్యాన్ని అభివృద్ధి పరచటం, అధిక పనితీరు గల సింటెర్డ్ మాగ్నెట్లను తయారు చేయడం, తేజస్ ఫైటర్ జెట్‌ల నుండి టాటా ఎలక్ట్రిక్ బస్సుల వరకు ప్రతిదానిలోనూ వాటిని అనుసంధానించాలని యోచిస్తోంది. విజయవంతమైతే, మోనాజైట్ వెలికితీత నుండి క్షిపణి మార్గదర్శక వ్యవస్థల వరకు మొత్తం విలువ గొలుసు భారత సరిహద్దుల్లోనే ఉంటుంది.

పాకిస్తాన్ అప్పుడప్పుడు అరుదైన భూమి మూలకాల చర్చలలోకి వస్తుంది. అది ప్రత్యేకించి బలూచిస్తాన్ లేదా గిల్గిత్ బాల్టిస్తాన్‌లో చైనా భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు నిక్షేపాలను కనుగొన్న సమయాలలో. అయినప్పటికీ పాకిస్తాన్ అరుదైన భూమి మూలకాల కథ విజయం కంటే ఎక్కువ ఆకాంక్షలు కలిగి ఉంది. అవి అస్థిర ప్రావిన్సులలో ఉండడం, పూర్తిగా చైనా మూలధనం, నైపుణ్యంపై ఆధారపడి ఉండడంతో పాకిస్తాన్ నిల్వలు తక్కువగా అన్వేషించబడ్డాయి. ఇస్లామాబాద్‌లో పారిశ్రామిక స్థావరం, రాజకీయ స్థిరత్వం, ముఖ్యంగా పోటీతత్వంతోకూడిన అరుదైన భూమి మూలకాల పరిశ్రమను నిర్మించడానికి అవసరమైన దీర్ఘకాలిక క్షితిజాలు లేవు.

భారతదేశం ప్రయోజనం నిర్మాణాత్మకమైనది. ఇది ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద అరుదైన భూమి మూలకాల నిల్వలను కలిగి ఉంది. అలాగే పనిచేస్తున్న మైనింగ్ బ్యూరోక్రసీని కలిగి ఉంది. 1950ల నుండి మోనాజైట్‌ను వెలికితీస్తున్న ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించింది. అన్నిటికంటే ముఖ్యంగా, భారతదేశం దౌత్యపరమైన పరిధిని, సమగ్ర సరఫరా గొలుసుకు ఆర్థిక సహాయం చేయడానికి మూలధన మార్కెట్లను శాసిస్తుంది. దీనికి విరుద్ధంగా, పాకిస్తాన్ ప్రతి నిర్ణయం బీజింగ్ ద్వారా రావాలి. తన సొంత గుత్తాధిపత్యానికి పెంచుకోవడానికి ఎటువంటి ప్రోత్సాహం లేదు.

పాకిస్తాన్ ఆరంభించడానికి ముందే పోటీ నుండి సమర్థవంతంగా తొలగించడమే భారతదేశం వ్యూహం. ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందాలపై చర్చలు జరుపుతుండగా, న్యూఢిల్లీ కాంక్రీటును కురిపించి, ఒప్పందాలను అమలు చేసే పనిలో ఉంటుంది.

అయితే, ఒక అసౌకర్య వాస్తవికత భారతదేశం ప్రణాళికలను కమ్మేస్తుంది. అమెరికాకు అరుదైనభూమి మూలకాల మధ్యంతరాలను ఎగుమతి చేసే భారతదేశ సామర్థ్యాన్ని పరిమితం చేసే అనధికారిక ఏర్పాట్లను చైనా సాధించింది. ఈ ఒప్పందాలు, ఎప్పుడూ బహిరంగంగా క్రోడీకరించబడలేదు. ప్రత్యామ్నాయ సరఫరాదారుల కోసం అమెరికన్ సైనికపారిశ్రామిక సముదాయాన్ని ఆకలితో అలమటింపజేయాలనే బీజింగ్ దృఢ సంకల్పాన్ని ఇవి ప్రతిబింబిస్తాయి.

అందుకు ప్రతిస్పందనగా భారతదేశం దాని కొనుగోలుదారుల పునాదిని వైవిధ్యపరుచుకోవాలి. 2023లో ఆమోదించబడిన యూరప్ క్రిటికల్ రా మెటీరియల్స్ చట్టం ప్రకారం వ్యూహాత్మక ఖనిజాలు చైనాయేతర సరఫరాదారుల ద్వారానే రావాలని స్పష్టంగా ఉంది. 2010లో చైనా విధించిన ప్రాదేశిక ఎగుమతి నిషేధంతో ఇప్పటికీ బెంబేలెత్తుతున్న జపాన్, ప్రత్యామ్నాయాల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలు ముఖ్యంగా యుఎఇ, సౌదీ అరేబియా పునరుత్పాదక ఇంధన వనరులు, మరింత అధునాతన తయారీలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ప్రతి ఒక్క దేశం భారతీయ అయస్కాంతాలకు సంభావ్య కొనుగోలుదారుగా సూచిస్తుంది.

భారతదేశం కూడా ద్విముఖ వ్యూహాన్ని అవలంభించింది. ఇది స్వదేశంలో శుద్ధి సామర్థ్యాన్ని పెంచుకుంటూ విదేశాలలో అరుదైన భూమి మూలకాల ఆస్తులను పొందుతోంది. భారతదేశం ప్రభుత్వ మద్దతుగల మైనింగ్ కన్సార్షియం–కాబిల్ ద్వారా జాంబియా, టాంజానియా, నమీబియా, అర్జెంటీనా, బొలీవియా, పెరూలో నిక్షేపాలను ఉమ్మడిగా అభివృద్ధి చేస్తోంది. ఈ భాగస్వామ్యాలు రెండు ప్రయోజనాలకు ఉపయోగపడతాయి. అవి దీర్ఘకాలిక ఖనిజ సరఫరాలకు హామీ ఇస్తాయి. అలాగే చైనా చాలా కాలంగా ఆస్వాదిస్తున్నట్లు గా దక్షిణ భూగోళంతో రాజకీయ మూలధనాన్ని సమకూర్చుతుంది.

తరచుగా ప్రత్యేకమైన వెలికితీత హక్కులు, మౌలిక సదుపాయాల వనరుల మార్పిడిని కలిగి ఉన్న బీజింగ్ నమూనా మాదిరిగా కాకుండా భారతదేశం ఉమ్మడి శుద్ధీకరణ, ఆదాయభాగస్వామ్యం, పూర్తయిన అయస్కాంతాలను స్థిరమైన ధరలకు భాగస్వామి దేశాలకు తిరిగి విక్రయించే వాగ్దానాన్ని అందిస్తుంది. ఇది చైనా ఆధిపత్యం పట్ల భయపడే దేశాలను ఆకర్షించడానికి రూపొందించబడిన మృదువైన, మరింత బహుళత్వ విధానం.

యూరప్, తూర్పు ఆసియా, గల్ఫ్, లాటిన్ అమెరికాలకు నమ్మకమైన ప్రత్యామ్నాయ సరఫరాదారుగా భారతదేశం తనను తాను నిలబెట్టుకోగలిగితే, అది గణనీయమైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంది. అరుదైనభూమి అయస్కాంతాల ప్రపంచ మార్కెట్ 2030 నాటికి 30 బిలియన్‌ల డాలర్‌లకు మించి ఉంటుందని అంచనా వేయబడింది. అందులో 10 శాతం సాధించినా అది భారతదేశ తయారీ ఎగుమతులకు గణనీయమైన ప్రోత్సాహాన్ని సూచిస్తుంది.

అయితే, ఆశయం విజయానికి హామీ ఇవ్వదు. భారతదేశం బలీయమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. అరుదైన భూమి ఖనిజాలను శుద్ధి చేయడానికి సంక్లిష్టమైన రసాయన ప్రక్రియలపై పట్టు అవసరం. ఈ పద్ధతులను పరిపూర్ణం చేయడానికి చైనా దశాబ్దాలుగా వెచ్చించింది. సాంకేతిక బదిలీలు, నిపుణులను (వారిలో చాలా మంది చైనా శిక్షణ పొందిన ఇంజనీర్లు కూడా ఉన్నారు) నియమించడం ద్వారా భారతదేశం ఆ అభ్యాస ప్రక్రియను కుదించడానికి ప్రయత్నిస్తోంది .

అరుదైన భూమి మూలకాల శుద్ధి విషపూరిత వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుంది. భారతదేశం అతుకుల బొంతలాంటి పర్యావరణ విధానం అమలు, వివాదాస్పద భూసేకరణ ప్రక్రియలు ప్రాజెక్టులను ఆలస్యం చేయవచ్చు. కేరళ లేదా ఒడిశాలో ప్రజా వ్యతిరేకత మైనింగ్ విస్తరణలను నిలిపివేయవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం కలిగిన అరుదైన భూమి మూలకాల పరిశ్రమను నిర్మించడం ఒక దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు స్థిరమైన పెట్టుబడిని కోరుతుంది. భారతదేశానికి ద్రవ్య లభ్యత పరిమితం. దీర్ఘకాలిక ప్రాజెక్టుల విషయంలో ప్రైవేట్ పెట్టుబడిదారులు జాగ్రత్తగా ఉంటారు.

బీజింగ్ నిశ్శబ్దంగా మార్కెట్ వాటాను వదులుకోదు. ఇది ప్రపంచ మార్కెట్లను సబ్సిడీ అయస్కాంతాలతో ముంచెత్తవచ్చు. అది భారతీయ ఉత్పత్తిదారులను తగ్గించవచ్చు. ఇది కీలకమైన శుద్ధి పరికరాల ఎగుమతులను పరిమితం చేయవచ్చు. ఇది ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ భాగస్వాములను ఏదో ఒక వైపు ఎంచుకోవాలని ఒత్తిడి చేయవచ్చు. చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు భారతదేశ ప్రభుత్వ రంగం కంటే లోతైన జేబులు, ఎక్కువ రాజకీయ పరిధిని కలిగి ఉన్నాయి.

అత్యంత కపటంతో భారతదేశ స్వీయ నియంత్రణ బలహీనతలను చైనా ఉపయోగించుకోగలదు. పర్యావరణ అనుమతులలో జాప్యం, భూ వివాదాలు, అధికార అంతర్గత తగాదాలు గతంలో భారత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చంపేశాయి. చైనా ఈ ఘర్షణ అంశాలను తమ మనుషుల ద్వారా, సైబర్ అంతరాయం లేదా వ్యూహాత్మక తప్పుడు సమాచారం ద్వారా విస్తరించగలిగితే, అది ఎటువంటి ప్రయత్నం చేయకుండానే భారతదేశ ప్రణాళికలను పట్టాలు తప్పిస్తుంది.

భారతదేశం అరుదైన భూమి మూలకాల వృద్ధి అమెరికాకు అవకాశం, సంక్లిష్టత రెండూ కలిగిస్తాయి. చైనాకు వాషింగ్టన్ ప్రత్యామ్నాయాలను కోరుకుంటుంది. కానీ, అది నియంత్రణను కూడా కోరుకుంటుంది. అమెరికాకు కాకుండా యూరప్, ఆసియాకు ఎగుమతి చేసే భారతదేశం పెంటగాన్ సేకరణను క్లిష్టతరం చేస్తుంది. అయినప్పటికీ అమెరికా కపటంగా కనిపించకుండా భారతదేశం ప్రయత్నాలను బహిరంగంగా వ్యతిరేకించదు.

చైనాకు, దాని గుత్తాధిపత్యానికి భారతదేశం మొదటి విశ్వసనీయ ఆసియా సవాలుదారుని సూచిస్తుంది. న్యూఢిల్లీ విజయం సాధిస్తే, అది బీజింగ్ ధర నిర్ణాయక శక్తిని విచ్ఛిన్నం చేస్తుంది. వియత్నాం, కజఖస్తాన్, మంగోలియా వంటి ఇతర దేశాలు సైతం వారి స్వంత అరుదైనభూమి మూలకాల పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవడానికి ధైర్యం చేస్తాయి.

పాకిస్తాన్‌కు సందేశం స్పష్టంగా ఉంది. ఆ దేశ అరుదైనభూమి మూలకాల రేసు ఆరంభానికి ముందే ముగిసింది. ఇస్లామాబాద్‌లో పోటీ పడటానికి స్థాయి, స్థిరత్వం, స్వేచ్ఛ లేదు. చైనాపై ఆధారపడితే, అది ప్రత్యర్థిగా కాకుండా సేవలు వినియోగించుకునే వినియోగదారుడిగానే ఉంటుందని నిర్ధారిస్తుంది.

అయితే, భారతదేశం అరుదైన భూమి మూలక వ్యూహం కేవలం అయస్కాంతాలు లేదా క్షిపణుల గురించి కాదు. సంకల్పం, మూలధనం, ఓపిక కలిగి ఉంటే మధ్యతరహా శక్తులు ప్రపంచ సరఫరా గొలుసులను ఇప్పటికీ రూపొందించగలవని నిరూపించగలదు. 21వ శతాబ్దపు భౌగోళిక రాజకీయాలలో, అరుదైన భూమి మూలకాలను శుద్ధి చేసే దేశాలు ఒకప్పుడు చమురును శుద్ధి చేసే దేశాల స్థాయిలో ప్రభావాన్ని చూపవచ్చు.

భారతదేశం 890 మిలియన్ల డాలర్ల ఎత్తుగడలో విజయవంతమవుతుందా లేదా అనేది అనిశ్చితంగా ఉంది. కానీ ఆ ప్రయత్నం ఇప్పటికే లెక్కలను మార్చింది. ప్రపంచం ఇకపై చైనా అయస్కాంతాలపై మాత్రమే ఆధారపడి లేదు. అది కూడా ఒక రకమైన శక్తి.

(ఐపిఎ సర్వీస్)

# విత్తన బిల్లు–2025 ఎవరికోసం?



పులి రాజు
సామాజిక కార్యకర్త

పదివేల సంవత్సరాల క్రితం భారతదేశంలో వ్యవసాయం ప్రారంభమైందని చరిత్ర చెబుతుంది. గతంలో ఎన్నడూ కూడా మన వ్యవసాయం విత్తనాలు ఉత్పత్తి చేసిందే కానీ విత్తనాలు కొనుగోలు చేయలేదు. కానీ హరిత విప్లవం తర్వాత హైబ్రిడ్ విత్తనాల పేర్లతో విత్తనాల అమ్మకం, దిగుమతి పెరిగింది.

గత 20, 25 సంవత్సరాలు క్రితం ప్రతి రైతు ఇల్లు ఒక 'విత్తన భాండాగారమే'! అప్పుడు రైతులు పండించిన పంటలో కొంత మంచి భాగాన్ని విత్తనాలుగా నిలువ చేసుకొని అదే విత్తనాలను మళ్లీ పెట్టుకుని పెట్టుబడులేని వ్యవసాయం చేసేవారు. కానీ 20, 25 సంవత్సరాల నుండి ప్రభుత్వం మరియు కార్పొరేట్ విత్తన కంపెనీలు క్రమంగా రైతుల దగ్గర నుండి విత్తనాలను దూరం చేసి ఇప్పుడు ఏ చిన్న పంట పెట్టుకోవాలన్న విత్తనాల కంపెనీలపైన ఆధారపడి భారతదేశ వ్యవసాయ రంగం నడుస్తుందని అనడంలో అతిశయోక్తి లేదు.

రైతులకు విత్తనాలు భారం కావడంతో పెట్టుబడులు పెరిగి రైతుల ఆత్మహత్యలకు విత్తనాల కొనుగోలు కూడా ఒక ప్రధాన కారణం.

దేశవ్యాప్తంగా 540 విత్తన కంపెనీలు ఉన్నాయి. అవి సంవత్సరానికి దాదాపు 65 నుండి 70వేల కోట్ల రూపాయల విత్తన వ్యాపారం చేస్తున్నాయని ఒక అంచనా!

వ్యవసాయానికి భూమి ఎంత ముఖ్యమైనదో విత్తనం కూడా అంతే ముఖ్యమైనది. ఇది గమనించిన విత్తన కంపెనీలు ప్రతి సంవత్సరం 5000 కోట్ల రూపాయల నకిలీ విత్తనాలు అమ్ముతున్నాయని ఒక అంచనా!

ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక దగ్గర నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులను చూస్తూనే ఉన్నాం.

తాజాగా మెదక్ జిల్లా, చేగుంట మండలం, రుక్మాపూర్ గ్రామంలో ఒక విత్తన కంపెనీ వరి నకిలీ విత్తనాలతో సుమారు 45 మంది రైతులు 100 ఎకరాలలో వరి పంట వేస్తే ఒక ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఆ నకిలీ విత్తనాలతో ఒక ఎకరాకు 6, 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే రావడంతో ఆ రైతులు ఆత్మహత్యలే శరణ్యమని లబోదిబో మంటున్నారు. ఈ నకిలీ విత్తనాలతో పంట దిగుబడి రాలేదని ఎవరికి ఫిర్యాదు చేయాలో ఎవరికి మొరపెట్టుకోవాలో కూడా సరైన వ్యవస్థ లేక రైతులు నష్టపోతున్నారు.

కేంద్ర వ్యవసాయ శాఖ విత్తన బిల్లు 2025 పై డిసెంబర్ 11వరకు రైతులు, రైతు సంఘాలు సూచనలు చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో పెట్టింది.

ఈ బిల్లు 'సాగుదారుల కోసమా? కార్పొరేట్ల కోసమా?' అని రైతులు, రైతు సంఘాలు అంటున్నాయి.

ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికడుతుందని చెబుతోంది, కానీ విమర్శకులు కార్పొరేట్ పక్షపాతం మరియు జన్యు వైవిధ్యానికి ముప్పు, దేశ విత్తనాల ప్రస్తావనలేదని హెచ్చరిస్తున్నారు.

విత్తన రంగాన్ని నియంత్రించే నిబంధనలను సమూలంగా మార్చడానికి భారత ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తనాల బిల్లు, 2025, 1966 విత్తనాల చట్టం మరియు 1983 విత్తన నియంత్రణ ఉత్తర్వులను భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త చట్టం నాణ్యమైన విత్తనాల సరఫరాను మెరుగుపరుస్తుందని, నకిలీలను అరికట్టగలదని, రైతులకు ఎక్కువ రక్షణ కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు.



కానీ, 2004, 2019లో మునుపటి ప్రయత్నాల మాదిరిగానే, ఈ బిల్లు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటుంది. రైతు సంఘాలు, విత్తన నిపుణులు మరియు పౌర సమాజ సంస్థలు ప్రతిపాదిత చట్టం సాధారణ సాగుదారుల కంటే, ముఖ్యంగా సాంప్రదాయ, రసాయన రహిత వ్యవసాయంపై ఆధారపడే వారి కంటే విత్తన కంపెనీలు, వ్యవసాయ వ్యాపారాలకు బాగా సరిపోతుందని అంటున్నారు.

రైతు విత్తనాలు కొన్నప్పుడు విత్తనాలు అమ్మే కంపెనీ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. జిల్లాలో ఏ డీలర్‌కు ఎంత సీడ్ ఇచ్చారో కంపెనీ జిల్లా వ్యవసాయ అధికారికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి.

జిల్లా వ్యవసాయ అధికారికి కంపెనీ వారు సీడ్ ఎక్కడ ఉత్పత్తి చేసింది ఏ రైతు వద్ద ఉత్పత్తి చేసినది తనిఖీ చేసి రిపోర్ట్ ఇచ్చిన అధికారి, కంపెనీ వివరాలు మ్యానుఫ్యాక్చరింగ్ చేసిన యూనిట్ వివరాలు అన్నీ కూడా ఇవ్వాలి. సర్టిఫై చేసిన ఇన్స్పెక్టర్ ఇచ్చిన వివరాలు కూడా ఇవ్వాలి.

కంపెనీ వేరే రాష్ట్రంలో నమోదు అక్కడ కార్యకలాపాలు చేస్తుంటే కంపెనీ ఆఫీస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ లో వేరే రాష్ట్రాలలో ఉన్నప్పుడు ఆ కంపెనీ సీడ్ అమ్ముతున్న రాష్ట్రంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవా లి.

డీలర్ ఏ రైతుకు ఎన్ని విత్తనాలు అమ్మినది మరియు రైతుకు బిల్లు ఇవ్వాలి బిల్లులో డీలర్ సంతకం మరియు వేలిముద్ర వేయాలి.

డీలర్ ఏ రైతుకు ఎన్ని విత్తనాలు అమ్మినది జిల్లా వ్యవసాయ అధికారికి తెలియజేయాలి.

రైతు తన పొలంలో పండిన పంటను విత్తనం కొరకు వాడిన ఇతర రైతులకు విత్తనం కొరకు అమ్ముకున్న జిల్లా వ్యవసాయ అధికారి కి తెలియజేయాలి విత్తనం కొన్న రైతులు కూడా ఏ రైతు వద్ద నుండి కొన్నది ఆ రైతు వివరాలు జిల్లా వ్యవసాయ అధికారికి తెలియజేయాలి.

జిల్లా వ్యవసాయ అధికారి మరియు ఉద్యానవనాధికారి ఆధ్వర్యంలో జిల్లాకు ఇద్దరు సీడ్ వెరిఫికేషన్ అధికారులను ప్రభుత్వం నియమించాలి.

1. నకిలీ విత్తనాలు ఉత్పత్తి చేసి సరఫరా చేసిన వ్యక్తులకు లేదా కంపెనీలకు కఠినమైన శిక్షలను తక్షణమే అమలు చేయాలి.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం పొందడానికి సులభమైన మార్గం ఉండాలి.

2.స్థానిక మండల వ్యవసాయ అధికారి రిపోర్టు ఆధారంగా నష్టపోయిన రైతుకు నష్ట పరిహారం ఒక నెల లోపు అందించే విధంగా చట్టం ఉండాలి.

3. విత్తనాల పైన ధరల రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ ఉండాలి.

4. విత్తనాలు ఉత్పత్తి పైన ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ, పర్యవేక్షణ కూడా ఉండాలి.

5. విత్తనాల పైన కృత్రిమ కొరత సృష్టిస్తే భవిష్యత్తులో ఆ కంపెనీకి అనుమతులు ఇవ్వకూడదు.

6. దేశీయ లేదా సంప్రదాయ విత్తనాలను కాపాడుకొని భద్రపరిచే విధానం చట్టంలో ఉండాలి.

7. రైతులు పాత పద్ధతులలో విత్తనాలు కాపాడుకునే పద్ధతిని ప్రోత్సహించాలి.

60 శాతం పైగా ఆధారపడ్డ వ్యవసాయ రంగానికి ప్రధానమైన విత్తన చట్టాన్ని సవరణ చేస్తున్న ఇంత పెద్ద చట్ట సవరణకు తూతూ మంత్రంగా కొన్ని రోజులు కాకుండా ఒక సంవత్సరం దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన ఒక పెద్ద చర్చ పెట్టి మట్టి మనుషులైన రైతుల నుండి రైతు సంఘాలు, మేధావుల నుండి అభిప్రాయాలు తీసుకొని చట్ట సవరణ చేయాలి.

# భూమాతను కాపాడుకుంటేనే జీవకోటి మనుగడ

02 డిసెంబర్ 1984 రాత్రి భోపాల్ సమీప యూనియన్ క్యాబ్డ్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమ నుంచి లీక్ అయిన అత్యంత ప్రమాదకర మీథైల్ ఐసోసయనేట్ వాయువు పేల్చడంతో దాదాపు 5.6లక్షల సమీప ప్రాంత అమాయక ప్రజలు తీవ్రంగా ప్రభావితం కావడం. అందులో కనీసం 3,787 మంది ప్రాణాలు కోల్పోవడం కూడా జరిగింది. ప్రపంచంలోనే అతి పెద్ద పారిశ్రామిక విపత్తుగా ఈ దుర్ఘటనను గుర్తించడం జరిగింది. ఈ అత్యంత విషాదకర విపత్తుకు వ్యతిరేకంగా కాలుష్య నియంత్రణ ప్రయత్నాలకు చేయూతనిస్తూ, ప్రతి ఏట 02 డిసెంబర్ రోజున జాతీయ/ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవం (నేషనల్/వరల్డ్ పొల్యూషన్ కంట్రోల్ డే) పాటించుట ఆనవాయితీగా మారింది. నేటికీ మహానగరాలతో పాటు ఇతర పట్టణాల ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాలు కూడా కాలుష్య కోరల్లో చిక్కి ఊపిరాడకుండా బతుకులు ఈడుస్తున్నారు. 2025 జాతీయ/ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవం ఇతివృత్తంగా సుస్థిర జీవనవిధానంతో హరిత భవిష్యత్తు (సస్టేనబుల్ లివింగ్ ఫర్ ఏ గ్రీనర్ ఫ్యూచర్) అను అంశాన్ని తీసుకోవడం జరిగింది.

జీవకోటి ఆరోగ్యం, పర్యావరణ వ్యవస్థలకు హాని కలిగించే ప్రమాదకర పదార్థాలను నేల, నీరు లేదా గాలిలోకి విడుదల కావడాన్ని కాలుష్యం అని పిలుస్తాం. కాలుష్య కట్టడి మన ఇంటిలోంచి మాత్రమే ప్రారంభం కావాలి. కాలుష్య వ్యాప్తికి మనం కారణం కాకుండా జాగ్రత్త పడాలి. నేటి విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు గాలి, నేల, నీటి, శబ్ద కాలుష్యాల పట్ల అవగాహన కల్పించడంతో పాటు వాటిని తగ్గించేలా మార్గాలను కూడా వివరించడం జరుగుతుంది. ప్లాస్టిక్స్ వాడకాన్ని తగ్గించడం, జీవ విచ్ఛిన్న వస్తువులు లేదా పదార్థాలను వాడడం, ట్రాఫిక్ నియంత్రణలు పాటించడం, ప్రజా రవాణను ప్రోత్సహించడం, పునరుత్పాదక ఇంధనాలను వాడుకోవడం, శిలాజ ఇంధనాలను తగ్గించడం లాంటి చర్యలను నిరంతరం తీసుకోవాలి.

**కాలుష్య నియంత్రణ మార్గాలు:**

అడవుల నరికివేత, పారిశ్రామిక వ్యర్థాలు, అసంబద్ధ నీటి నియంత్రణ, అశాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, శక్తి ఉత్పత్తి పరిశ్రమలు, శిలాజ ఇంధన ఆధారిత రవాణా వ్యవస్థలు లాంటి కారణాలతో కాలుష్యం పెరుగుతుంది. కాలుష్యంవల్ల మట్టి మర్యాద మంటగలుస్తుంది. గాలి గరళం అవుతుంది. నీటి నాణ్యత గతి తప్పుతుంది. వీటికి తోడుగా రేడియోధార్మిక, శబ్ద, ప్లాస్టిక్ కాలుష్యాలు మానవ జీవితాలను మరింత జటిలం చేస్తున్నాయి. కాలుష్యం పెరిగితే మానవాళితో పాటు సకల జీవకోటి రోగాలు చుట్టుముడతాయి. కాలుష్యానికి అడ్డుకట్ట వేయకపోతే అదే ఉచ్చులో మనం ప్రాణాలు నిలుపవలసి వస్తుంది. సమర్థవంతమైన నీటి నియంత్రణ మార్గాలు, సుస్థిర రవాణా వ్యవస్థలు, తరగని ఇంధనాల వినియోగాలు, ఆరోగ్యకర సాగు పద్ధతులు, ప్లాస్టిక్ రహిత పౌర జీవనాలు, పర్యావరణహిత అడుగులు, వ్యర్థాల నియంత్రణ, జీవ విచ్ఛిన్న వ్యర్థాలు, పౌర సమాజాన్ని అవగాహన పరచడం, కాలుష్య




నియంత్రణ సాంకేతికత వినియోగం, శక్తి వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ చట్టాల కఠిన అమలు లాంటివి రేపటి ఆరోగ్యకర సమాజ స్థాపనలకు దోహదపడతాయి.

మనకు జీవన ఆధారమైన భూమిని పవిత్రంగా చూసుకుందాం. నేటి పరిశుభ్రత రేపటి ఉజ్వల ఆరోగ్య భవిష్యత్తు. మన జీవనశైలిలో చిన్న చిన్న మార్పులతో రేపటి పౌరుల ఆరోగ్యాల కు పునాది అవుతాయి. కాలుష్య నివారణే రేపటి తరాలకు వర ప్రసాదం అవుతుంది. జీవకోటి ఆరోగ్యకర మనుగడకు నేల, నీరు, గాలి పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాలుష్య కట్టడికి పౌర సమాజం చేయిచేయి కలిపి మానవ హారం పట్టాలి. నేటి హరిత ఆలోచన ఆచరణ మార్గాలే రేపటి తరాలకు ఆరోగ్య గొడుగులు అవుతాయి. కాలుష్య భూతం మనల్ని మింగేయక ముందే మనం దానికి అడ్డుకట్ట వేయాలి.

(02 డిసెంబర్ జాతీయ/ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా)

## వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటి అధ్యక్షతన, ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో ర్యాలీతో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సరస్వతి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న కార్యకలాపాలు, ప్రస్తుత హెచ్ఐవి, ఎయిడ్స్ పరిస్థితిపై వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్ విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఉపయోగకరమని తెలిపారు. పిజి కాలేజీ విద్యార్థులు పాటలు, ఉపన్యాసాల ద్వారా సందేశాలు ఇచ్చారు. డిఎల్ఎస్ఎ నుండి డాక్టర్ రామకృష్ణ చౌదరి హెచ్ఐవి, ఎయిడ్స్‌పై న్యాయ సేవల గురించి వివరించారు. ముఖ్య అతిథి డాక్టర్ వెంకటి కమ్యూనిటీ స్థాయిలో అవగాహన పెంచితేనే కొత్త కేసులను తగ్గించవచ్చని, ఐసిటిసి, ఎఆర్‌టి, డిఎస్ఆర్‌సి సిబ్బంది, ఎన్‌జిఓల సేవలను అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసపత్రాలు, మొమెంటోలు అందజేసి, హెచ్ఐవి ఫ్రీ ఇండియా ప్రతిజ్ఞ చేసి, ఐఈసి స్టాల్స్ పరిశీలించారు.

## నామినీలకు క్లెయిమ్ అందజేత



**ప్రజాపక్షం/పెబ్బేరు:** మండల పరిధిలోని గుమ్మడం గ్రామీణ వికాస్ బ్యాంకులో కేవలం రూ.436 ప్రీమియంతో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల కింద, ఇన్సూరెన్సు చేసిన నలుగురి వ్యక్తుల నామీనిలకు సోమవారం క్లెయిమ్‌లు అందజేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ అతి తక్కువ ప్రీమియంతో కేవలం రూ.20, 436తో ఇన్సూరెన్స్ పథకాలను తమ బ్యాంకు శాఖ అందజేస్తుందని ఖాతాదారులు ప్రతి ఒక్కరు స్కీములను ఉపయోగించుకోవాలని మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రాదారి సందీప్, క్యాషియర్ రమేష్, బ్యాంకు మిత్రులు వరప్రసాద్, సుజాత, మెసెంజర్ జయంత్ పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న బాలల హక్కుల పరిరక్షణ చైర్ పర్సన్



**ప్రజాపక్షం/కృష్ణ:** తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి కృష్ణ మండలం తంగిడి గ్రామంలో వీరాంజనేయ స్వామిని కుటుంబం సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆలయ మర్యాదల ప్రకారం బాలల హక్కుల పరిరక్షణ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం వీరాంజనేయస్వామికి పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీలకు జడ్చర్ల విద్యార్థులు




**ప్రజాపక్షం/జడ్చర్ల:** ఆర్ కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో చీఫ్ ఆర్గనైజర్ ఇలియాస్ బిన్ సిద్దికి 23వ జాతీయ స్థాయి కరాటే పోటీలు ఆదివారం నిర్వహించారు. ఉండి గంగాపూర్ గ్రామానికి చెందిన శ్రీ హరిణికి కటాస్ విభాగంలో బంగారు పతకం, అదేవిధంగా బాలికల కటాస్ విభాగంలో శిల్పకి బంగారు పతకం, అదేవిధంగా కృష్ణకి సీనియర్ బాలుర కటాస్ విభాగంలో బంగారు పతకం సాధించినట్లు అకాడమీ ఫౌండర్ కేశవ్ గౌడ్ తెలిపారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ విద్యార్థులకు సీనియర్ కరాటే జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్ నిర్వాహకులు మాస్టర్ ఇలియాస్ సిద్దికి, మాస్టర్ జాకీర్, మాస్టర్ గౌస్, స్థానిక కరాటే మాస్టర్ శ్రీనివాసచారి, మాస్టర్ సయ్యద్ , అశ్వక్, తదితరులు పతకాలు, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు.

## సక్రమంగా ఎన్నికల విధులు



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఉమాదేవి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల బాధ్యతలు అత్యంత ప్రాముఖ్యమైనవని, వాటిని నిర్వర్తించే సమయంలో పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. చిన్న తరహా నిర్లక్ష్యమూ ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉందని గుర్తు చేశారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఓటర్‌ల గుర్తింపు, బ్యాలెట్ పత్రాల పంపిణీ, నిర్వహణ, మాక్‌పోల్ విధానం, పోలింగ్ ముగిసిన అనంతరం సీలింగ్ ప్రక్రియ వంటి ప్రతి అంశంపై అధికారులు శిక్షణ పొందాలని ఉమాదేవి వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా నిలవాలంటే ప్రతి పోలింగ్ అధికారి తన పాత్రను నిబద్ధతతో నిర్వర్తించాలని ఆమె సూచించారు. శిక్షణ కార్యక్రమంలో తాసిల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్ రావు, మండల విద్యాధికారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా కబడ్డీ జట్టు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నల్గొండ జిల్లాలోని హాలియాలో ఈనెల 2నుండి 4వరకు జరగనున్న 51వరాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డి చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డిజట్టు సోమవారం బయలుదేరివెళ్లారు. రాష్ట్రస్థాయి పోటిల్లో ఉత్తమప్రతిభకనబర్చి జాతీయస్థాయిలో రాణించాలని కబడ్డి ఆసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.యాదయ్యగౌడ్‌లు ఆకాంక్షించారు. గతవారంరోజుల క్రితం నుండి కల్వకుర్తిలోని మహాత్మజ్యోతిరావుపూలే జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈసందర్భంగా లాసప్యూచర్‌సిటి ప్రతినిధి సునిల్ యాదవ్ క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేశారు. రాష్ట్రస్థాయిపోటిలకు తరలివెళ్లిన క్రీడాకారులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యామిని, హైస్కూల్ ప్రిన్సిపాల్ నాగమణి, జిల్లా ఆసోసియేషన్ సభ్యులు రమేష్, మోహన్‌లాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పరమేష్, శ్రీనివాసులు, బాలశ్రీ, లలిత, జ్యోతి పాల్గొన్నారు.

## మానిటరింగ్ కమిటీ కేంద్రం తనిఖీ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెంటర్‌ను (యంసియంసి)జిల్లాకు కేటాయించిన సాధారణ పరిశీలకులు రాజ్యలక్ష్మి, వ్యయ పరిశీలకులు భీమ్లానాయక్‌లు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మీడియాసెంటర్‌ను పరిశీలించి, ఇప్పటివరకు వివిధ దినపత్రికల్లో వచ్చిన వార్తలపై ఆరాతీశారు. అన్నివివరాలు రికార్డులో రాయాలని, స్థానిక మీడియాలో వచ్చే వార్తలపై దృష్టిసారించాలని సూచించారు. అన్నిరికార్డులను ప్రతిరోజు నమోదు చేయాలని ఆమె సూచించారు. మీడియాసెంటర్ నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపిఓ శ్రీరాములు, నోడల్ అధికారులు సీతారాంనాయక్ భాస్కర్, మీడియాసెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాదు నుండి ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల జిల్లా కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, వచ్చిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పడక్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల సిబ్బంది కేటాయింపు,పోస్టల్ బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతల తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, నామినేషన్ల పరిశీలన కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి, ఎన్నికల వ్యయ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు. ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ ఎఫ్.ఎస్.టి,ఎస్.ఎస్.టీ బృందాలు పర్యవేక్షణ చేస్తున్నట్లు, బైండోవర్ కేసులు 61 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికెల సాధారణ పరిశీలకులు కాత్యాయని దేవి, ఎస్పీడి జానకి, రెవెన్యూ, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బందోబస్తును పరిశీలించిన డిఐజి, ఎస్పీ



**ప్రజాపక్షం/మక్తల్:** నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణ కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి విచ్చేసిన సందర్భంగా, పట్టణంలో భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేశారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన జోగులాంబ జోన్ 7 డిఐజి ఎల్.ఎస్. చౌహాన్, జిల్లా ఎస్పీ డా.వినీత్‌లు పోలీసు అధికారులకు అవసరమైన భద్రత పరమైన సూచనలు అందించారు. సీఎం పర్యటన సందర్భంగా ప్రధాన రహదారులు, పబ్లిక్ మీటింగ్ స్థలం, హెలిప్యాడ్ , పడమటి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పార్కింగ్ ప్రాంతాలు మొత్తం పోలీసు బందోబస్తుతో నిఘా ఏర్పాటు చేయబడిందని ట్రాఫిక్ నియంత్రణ, జన సమూహ నిర్వహణ, వ్యూహాత్మక బందోబస్తు వంటి అంశాలను ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించారు. సీఎం బందోబస్తు ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

# పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ




నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలో నామినేషన్ ప్రక్రియలను అత్యంత సజావుగా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. సోమవారం 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలను ఎన్నికల నిబంధనలకు లోబడి నామినేషన్ల నమోదు, తిరస్కరణ, ఉపసంహరణ ప్రక్రియలను సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. హైదరాబాద్ నుండి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లు ఎస్‌పిలతో రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్‌పి డాక్టర్ సంగ్రామ్‌సింగ్ గణపత్‌రావు పాటిల్, ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజ్యలక్ష్మి, వ్యయ పరిశీలకులు భీమ్లానాయక్ హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో నామినేషన్ ప్రక్రియలను అత్యంత సజావుగా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని మొదటి విడతలో సర్పంచుల నామినేషన్ల ఎలాంటి తిరస్కరణకు గురికాలేదని, వార్డుసభ్యులకు సంబంధించి 3357 నామినేషన్లు రాగా అందులో 13 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటి విడతలో జరిగే ఎన్నికల్లో ఆరు గ్రామపంచాయతీలకు ఒకే నామినేషన్ నమోదు జరిగాయని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఓటింగ్‌శాతం పెరిగేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్‌పి డాక్టర్ సంగ్రామ్‌సింగ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసుశాఖ ద్వారా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు సమస్యాత్మక ప్రాంతాలో పటిష్టంగా ఏర్పాటుచేసినట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, వివిధశాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వి.సి. కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి పౌర సరఫరాల శాఖ, మార్కెటింగ్, ఐ.కే.పి, సహకార శాఖ, మిల్లర్‌లతో సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలు కేంద్రంకు వచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం ఉన్న ధాన్యం కాంటా వేయాలని అన్నారు. తుపాన్ ప్రభావం దృష్ట్యా వర్షం పడితే ధాన్యం తడవకుండా టార్పిలిన్ లు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసి మిల్లుకు పంపించాలని అన్నారు. మిల్లర్‌లు వచ్చిన ధాన్యంను వెంటనే దిగుమతి చేసుకొని ఓ.పి.ఎం.ఎస్‌లో అంగీకరిస్తేనే రైతులకు మద్దతు ధర విడుదల చేయడానికి ఉంటుందని, కాబట్టి మిల్లర్లందరు సహకరించాలనరి చెప్పారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. పత్తి కొనుగోళ్లపై సమీక్షించారు. పత్తి 7 క్వింటాళ్లపై దిగుబడి ఉంటే రైతు వ్యవసాయ విస్తరణ అధికారి ధృవీకరించిన సర్టిఫికెట్‌తో కొనుగోళ్లకు తీసుకురావాలని తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్షించి వేగంగా కొనుగోళ్లు చేయాలని అన్నారు. సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలు సందర్శించి సమస్యలు ఉంటే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, పౌరసరఫరాల సంస్థ డి.ఎం.రవి నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, జిల్లా సహకార అధికారి కృష్ణ, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, మార్కెటింగ్ అధికారిని బాలమణి, జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్ పాల్గొన్నారు.

## ధాన్యం కల్లాలుగా మారిన క్రీడా ప్రాంగణం

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ఖర్చుతో అట్టహాసంగా నిర్మించిన క్రీడా ప్రాంగణాలు ఇప్పుడు నిరూపయోగంగా మారి వృథా వనరులుగా కనిపిస్తున్నాయి. కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఈ మైదానాలు క్రీడాకారులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలేమి లేకపోవడంతో స్థానిక యువత కూడా ఉపయోగించలేదని స్థితి ఏర్పడింది. గోపాల్‌దిన్నే గ్రామంలో నిర్మించిన క్రీడా ప్రాంగణం పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సరైన సంరక్షణ, నిర్వహణ లేకపోవడంతో క్రీడల కోసం నిర్మించిన మైదానం ఇప్పుడు రైతులకు వడ్ల కల్లాలుగా మారింది. క్రీడా వసతులు లేని ఈ మైదానంలో రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు. క్రీడల అభివృద్ధి లక్ష్యంగా నిర్మించిన ప్రాంగణం వ్యవసాయ అవసరాలను తీర్చే స్థలంగా మారిపోవడం స్థానిక క్రీడాభిమానులను నిరుత్సాహపరుస్తోంది.

# అధిక వడ్డీ ఆశ చూపి రూ.300 కోట్ల వసూలు

బోర్డు తిప్పేసిన ఫైనాన్స్ సంస్థ

డైరెక్టర్ ఇంటిముందు బాధితుల ఆందోళన




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పరిసర ప్రాంతాలలో అధిక వడ్డీ ఆశ చూపి సుమారు రూ.300 కోట్లు డైరెక్టర్ల ద్వారా వసూలు చేసి బోర్డు తిప్పేసిన 12 క్యాపిటల్ ఫైనాన్స్ డైరెక్టర్ ఇంటిముందు సోమవారం నల్లగొండ పట్టణంలోని హైదరాబాదు రోడ్డులో గల ఆంజనేయ స్వామి టెంపుల్ ఎదురుగా ఉన్న డైరెక్టర్ రాపోలు ప్రకాష్ ఇంటి ముందు బాధితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో పోలీసులు డైరెక్టర్‌ను అదుపులోకి తీసుకొని ఆందోళనకారులను పోలీస్ స్టేషన్ కు పిలిపించి చర్చలు జరిపారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 12 కాపిటల్ ఫైనాన్స్ కంపెనీ ఏర్పాటు చేసి దానికి 12 మంది డైరెక్టర్లు నియమించి రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నామని చెప్పి 100కి నాలుగు రూపాయల వడ్డీ చొప్పున డైరెక్టర్ల ద్వారా 300 కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. బాధితులకు 25 నెలల తర్వాత అసలు వడ్డీ ఇచ్చే విధంగా అగ్రిమెంట్ ఇచ్చారని కానీ ఆరు నెలలకే బోర్డు తిప్పేసారని బాధితులకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వడ్డీ ఆశకు పోయి డబ్బు చెల్లించవద్దని పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా ప్రజలలో మార్పు రావడం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




## ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/మద్దూర్ :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రోజు ఓఎమ్ఐఎఫ్ ( ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్) ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దూర్ మెడికల్ ఆఫిసర్ డా.శ్రీలత మాట్లాడుతూ హెచ్ఐవి 4 రకాలుగా సోకుతుందని అన్నారు. కలుషితమైన సూది/సీరంజిలను వాడరాదని, హెచ్ఐవి సోకిన వ్యక్తి నుండి రక్తం తీసుకోరాదన్నారు. హెచ్ఐవి సోకిన వ్యక్తులతో లైంగిక సంబంధం పెట్టుకోరాదని ,తప్పనిసరి అయితే కండోమ్ వాడాలన్నారు. ఒకవేళ తల్లికి హెచ్ఐవి సోకినట్లయితే కచ్చితంగా ఆసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తద్వారా పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవి రాకుండా నివారించవచ్చని తెలియజేశారు. హెచ్ఐవి ఉన్న వ్యక్తుల పట్ల వివక్షత చూపరాదని ,ఒకవేళ వివక్షత చూపితే పిఎల్‌హెచ్ఐవి 2018 ప్రకారం జైలు శిక్ష కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పి విజయ్‌కుమార్ రెడ్డి, నరేష్, మౌనిక, సుమన, రోహిణి, ఎమ్‌పిహెచ్ఇఓ హన్మంతు గౌడ్, ఎఎన్‌ఎమ్స్ రాజేశ్వరి, ఆశవర్కర్స్, ఓఎమ్ఐఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణ, ఓఎమ్ఐఎఫ్ హెల్త్ వర్కర్స్ నాగమణి, పద్మ, శారదా ,సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపాలన ఆఫీసర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినయ్ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా గ్రామపాలన అధికారుల ఆవిర్భావసభ తెలంగాణగ్రామపాలన ఆఫీసర్స్ ఆసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రెవెన్యూ సర్వీస్ ఆసోసియేషన్, తెలంగాణ తహసీల్దారుల ఆసోసియేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా నేతృత్వంలో జరిగిన ఇట్టి ఆవిర్భావసభలో ఊర్కొండ మండలం రెడ్యాతండాకు చెందిన వినయ్ వెల్దండ మండలకేంద్రంలోని కొట్రక్లస్టర్ గ్రామపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన నాగర్‌కర్నూల్ జిల్లా గ్రామపాలన ఆఫీసర్స్ ఆసోసియేషన్ జిల్లాప్రధాన కార్యదర్శిగా వినయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వినయ్ 2019లో టిఎస్‌పిఎస్సి నిర్వహించిన విఆర్‌ఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఉద్యోగ సంఘం ప్రధానకార్యదర్శిగా ఎన్నుకోబడి ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తారని బలమైన విశ్వాసంతో వినయ్‌ను జిల్లాప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బిఆర్‌ఎస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ మండల పరిధిలోని చిక్కేపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ముంత పార్వతీ , సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీను, నరసింహ, కురువయ్య, మేకల రాములు, రాఘవేందర్ తో పాటు 60 మంది వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి బిఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసి కట్టుగా పని చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సుధాకర్ యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకట రాములు యాదవ్, మాజీ సర్పంచ్ బాలస్వామి, నాయకులు ధనుంజయ్ రెడ్డి, ధర్మారెడ్డి, ప్రతాప్ రెడ్డి, రాజా రెడ్డి, ఖాదర్, భాస్కర్ చారి, ముంత రాము యాదవ్, బాల చంద్రుడు, జంపయ్య యాదవ్, స్వామి, అర్జున్ పాల్గొన్నారు.



## పరిశ్రమల భూములతో రియల్ వ్యాపారం

హిల్ట్‌పాలసీలో భారీ కుంభకోణం

హిల్ట్ పాలసీపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బిజెపి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పరిశ్రమలకు కేటాయించిన భూములను హిల్ట్ పేరుతో రియల్ ఎస్టేట్‌గా మారుస్తూ, కోట్ల రూపాయాల అవకతవకలకు తెర లేపుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బిజెపి నేతలు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలసి వినతిపత్రం అందచేశారు. ఓఆర్ఆర్ పరిధిలోని 22 ఇండస్ట్రియల్ ఎస్టేట్స్‌లోని 9,292 ఎకరాలను మల్టీపర్పస్ యూజికి మార్చేందుకు తీసుకొచ్చిన హిల్ట్ పాలసీ వల్ల భారీ అవినీతి జరిగే అవకాశం ఉందని రాంచందర్ రావు గవర్నర్‌కు వివరించారు. మార్కెట్ విలువలతో పోలిస్తే చాలా తక్కువ ఎస్ఆర్ఓ రేట్లలో 30 శాతం మాత్రమే చెల్లించి, భూములు కన్వర్ట్ చేసుకోవడం వేల కోట్ల ప్రజాసంపదను కోల్పోయేలా చేస్తుందన్నారు. అనంతరం రాంచందర్ రావు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ భూములను రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం తక్కువ రేట్లకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. 9,292 ఎకరాల రూ.6 లక్షల 30 వేల కోట్ల విలువైన భూములను కేవలం రూ.5,000 కోట్లకు కట్టబెడుతుండటం భారీ అవినీతికి నిదర్శనమని విమర్శించారు. పరిశ్రమల భూములు మారిపోతే కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భూములు ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉండగా ఇండస్ట్రియల్ భూములకే తక్షణ అనుమతులు ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పరిపాలన చేస్తుందా, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. హిల్ట్ పాలసీకి వ్యతిరేకంగా ఈనెల 7న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా చేపట్టనున్నట్టు ప్రకటించారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



**ప్రజాపక్షం/ హాలియా:** ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవర్ అన్నారు. సోమవారం మండలంలోని పులిమామిడి గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో గ్రామపంచాయతీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరగాలని ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైనదని చెప్పారు. ఎన్నికల సమయంలో బెదిరింపులకు దౌర్జన్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. డబ్బు, మద్యం ప్రలోభాలు చూపడం వంటి చర్యలు చేపడితే నేరం చేసినట్లేనని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిఎస్పి రాజశేఖర్ రాజు, హాలియా సీఐ దేశిడి సతీష్ రెడ్డి, ఎస్సై బండి సాయి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవనంలో ధ్యాన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక బౌద్ధ కేంద్రం బుద్ధ వనములో ప్రతి ఆదివారం ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధవనం మహాస్థూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో దమ్మ నాగర్జున విపష్యన కేంద్రం వలంటీర్ల చే ఈ ధ్యాన శిక్షణా తరగతుల కార్యక్రమం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 11:30 నిమిషముల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 3.30 నిమిషముల వరకు ధ్యాన తరగతులు నిర్వహిస్తామన్నారు.ధ్యానం చేసుకునేవారు కేటాయించిన సమయంలోపు ధ్యాన మందిరంలోకి చేరుకొని, ధ్యానం ముగిసేవరకు ఉండాలని, ఈ అవకాశాన్ని బుద్ధవనం సందర్శకులు వినియోగించుకోవాలని వారు కోరారు.

## పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చ జరగకూడదన్నదే బిజెపి ఎజెండా

భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** దేశంలో నెలకొన్న కీలక సమస్యలపై చర్చ జరగకూడదన్నదే బీజేపీ ఎజెండాగా కనిపిస్తోందని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేవలం 15 రోజులు మాత్రమే పార్లమెంట్ శీతాకాల సమావేశాలను నిర్వహించాలని ఎన్డీయే, బీజేపీ ప్రభుత్వం నిర్ణయించడమే ఎందుకు నిదర్శనం అని పేర్కొన్నారు. సోమవారం పార్లమెంటు సమావేశాలకు హాజరు కావడానికి ముందు మీడియాతో ఆయన ఢిల్లీలో మాట్లాడారు. దేశంలో ఉన్న అనేక సమస్యలపై పార్లమెంటులో చర్చలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నందున సమావేశాలను పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ భద్రతపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సమగ్రంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సెక్యూరిటీ ఆఫ్ పీపుల్, సెక్యూరిటీ ఆఫ్ డెమోక్రసీపై పార్లమెంట్‌లో చర్చ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర బాంబు దాడి జరిగితే కేంద్ర హోంశాఖ ఏమి చేస్తోందని ప్రశ్నించారు. ఎస్.ఐ.ఆర్ (సర్) పేరిట ప్రజల ఓటు హక్కును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాసే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. అధికారంలో పర్మినెంట్‌గా ఉండాలని మోదీ, అమిత్ షా భావిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై విపక్ష పార్టీల ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని ఈ అంశంపైన నిలదీస్తామన్నారు. హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, అస్సాం, ఏపీ, తెలంగాణ లాంటి రాష్ట్రాలకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు కేంద్రం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. 18వ లోక్ సభలో తమ పట్టు కోల్పోకుండా ఉండేందుకు అలయన్స్ పార్టీలకు మాత్రమే మోడీ సర్కార్ నిధులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## క్లస్టర్ నామినేషన్ కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడత ఎన్నికలు నిర్వహించనున్న దామరచర్ల మండల కేంద్రంలోని దామరచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె క్లస్టర్‌లో ఇప్పటివరకు వచ్చిన నామినేషన్ల వివరాలను, నామినేషన్ పత్రాలు, నామినేషన్ వేసేందుకు వచ్చేవారికి హెల్ప్ డెస్క్ ద్వారా అందిస్తున్న సమాచారం, నామినేషన్ వేసేటప్పుడు సమర్పించాల్సిన ధృవపత్రాలు, ఇతర అంశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్ తదితర అంశాలన్నింటిని పరిశీలించారు. వచ్చిన నామినేషన్లన్నింటిని ఎప్పటికప్పుడు స్కాన్ చేయడం, రిజిస్టర్‌లో నమోదు చేయడం, నామినేషన వివరాలను సకాలంలో డీపీవో కార్యాలయానికి పంపించడం, టీపోల్‌లో అప్‌లోచేయడం లాంటివి జాప్యం లేకుండా చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. నామినేషన్ స్వీకరించే గదిలో డిజిటల్ క్లాక్, వంద మీటర్ల పరిధిలో బందోబస్తు, ఓటరు జాబితా ప్రచురణ తదిర అంశాలను కూడా ఆమె పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎంపీడీవో, ఎంపీవో, ఆర్‌వో తదితరులు ఉన్నారు.

## కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని మిస్సింగ్


పాఠశాల ఎస్ఓ పుష్పలతను సస్పెండ్ చేసిన కలెక్టర్

డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్ జారీ

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కస్తూర్బా పాఠశాల నుండి విద్యార్థిని మిస్సయిన సంఘటన చోటుచేసుకుంది. ఆ పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ సిఇసి చదువుతున్న ఓ విద్యార్థిని గత నెల ఏడున ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లి గత నెల 30 తేదీన ఆదివారం ఉదయం ఏడు గంటలకు తమ సమీప బంధువు వచ్చి తొలివెళ్లగా ఆరోజు సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చుంటూ తోటి విద్యార్థులతో కలవకుండా ఏకాంతంగా గడిపింది. సుమారు సాయంత్రం ఏడు గంటల సమయంలో విద్యార్థినిలకు భోజనం పెట్టే సమయానికి ఆ విద్యార్థిని కనిపించకపోవడంతో పాఠశాలలో ఇన్చార్జి ఉపాధ్యాయురాలు చుట్టుపక్కల వెతికిన కనిపించకపోవడంతో ఆ పాఠశాల ఎస్ఓ పుష్పలత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సోమవారం జిసిడిఓ అరుంధతి,చండూరు సిఐ ఆదిరెడ్డి మునుగోడు ఎస్సై ఇరుగు రవి పాఠశాలను సందర్శించి ఆ విద్యార్థి యొక్క వివరాలను అడిగి తెలుసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ పాఠశాల ఎస్ఓ పుష్పలతను సస్పెండ్ , డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయులని , డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయురాలు రాధకు షోకాజ్ నోటీస్ జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.

## వాహనాల తనిఖీలో మద్యం పట్టివేత

రూ. 1 లక్ష విలువైన 528 క్వార్టర్ బాటిల్స్ సీజ్



**ప్రజాపక్షం/చివ్వెంల :** వాహనాల తనిఖీలు చేస్తుండగా రూ. ఒక లక్ష విలువైన 528 క్వార్టర్ మద్యం బాటిల్స్ సీజ్ చేసిన సంఘటన చివ్వెంల మండలంలో చోటుచేసుకుంది. చివ్వెంల ఎస్ఐ వి మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దురాజుపల్లి ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా టిజి 29 టి 0002 నంబరు గల ఏర్టిగా కారులో అనుమతి లేకుండా (11) ఇంపీరియల్ బ్లూ క్వార్టర్ బాటి ల్స్ కాటన్‌లు సూర్యాపేట నుండి మున్యానాయక్ తండకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కారు డ్రైవర్ ధరావత్ సైదా, అట్టి సరుకును కొను గోలు చేసిన ధరావత్ నాగులను విచారించి పంచనామా జరిపి మద్యాన్ని, కారును సీజ్ చేసి చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. సీజ్ చేసిన మొత్తం మద్యం 528 క్వార్టర్ బాటిల్స్ విలువ లక్ష రూపాయలు ఉంటుందన్నారు. గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా గ్రామాలలో ఎవరైనా బెల్ట్‌షాపులు నడపడం నిషేధం ఉంద న్నారు. ఎవరైనా మద్యాన్ని ఇండ్ల వద్ద గాని, షాపుల యందు గాని నిల్వ ఉం చినా, రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


# మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి రూల్స్

ఊరి బయటే మద్యం షాపులను ప్రారంభించిన వ్యాపారులు

ఒంటి గంట తరువాతే షాపులు ఓపెన్, సాయంత్రం 6 గంటల నుంచి పర్మిట్ రూంలోకి అనుమతి

పంతం నెగ్గించుకున్న మునుగోడు ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** రాష్ట్రంలో మద్యం పాలసీకి భిన్నంగా మునుగోడులో రాజన్న రూల్స్‌ను మద్యం వ్యాపారులు అమలు చేయడం విశేషం. వచ్చే రెండు సంవత్సరాలకు గాను మద్యం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి నూతన వైన్ షాపులకు టెండర్లు నిర్వహిస్తున్న క్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన నియోజకవర్గంలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు ఊరి బయటే వైన్ షాపులను ఓపెన్ చేయాలని, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే విక్రయాలు మొదలు పెట్టాలని, సాయంత్రం 6 గంటల నుంచి పర్మిట్ రూంలోకి అనుమతివ్వాలని సూచన చేశారు. ఆ తర్వాత ఇదే విషయమై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ని కలిసి వినతి పత్రం కూడా ఇచ్చారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం రూల్స్‌కు భిన్నంగా వ్యవహరిస్తున్నాడన్న వివాదం చెలరేగింది. ప్రభుత్వ పెద్దలు పార్టీ పెద్దలనుంచి ఒత్తిడి వచ్చినప్పటికీ తీసుకున్న నిర్ణయానికి వెనకడుగు వేయకుండా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి టెండర్లను వైన్ షాపులను దక్కించుకున్న యజమానులతో చర్చలు చేసి తన పంతాన్ని నెగ్గించుకున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడం పట్ల నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునుగోడు నియోజకవర్గంలో దాదాపు 30కి పైగా మద్యం షాపులు ఉంటాయి ఇందులో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 7 మినహాయించగా మిగతావన్నీ మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నాయి. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు 2 సంవత్సరాల గడువుతో ఇటీవల టెండర్లు నిర్వహించిన విషయం విదితమే. కాగా మద్యం షాపులకు కొత్తగా టెండర్లు వేసే సందర్భంలోనే మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం షాపులు దక్కించుకునే యజమానులకు బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ అవ్వకూడదని, ఊరి బయటే మద్యం విక్రయాలు జరపాలని, సాయంత్రం 6 గంటల నుంచి మాత్రమే పర్మిట్ రూంలకు అనుమతించాలని పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఆప్కారి శాఖ పాలసీకి భిన్నంగా రాజన్న చేసిన సూచనలు ఉండటంతో ఈ అంశాలను రాజన్నకు గిట్టని వారు కొంతమంది కావాలని వివాదానికి తెర లేపారు. అయినప్పటికీ ఆయన ఎక్కడ వెనకడుగు వేయకుండా తన పంతాన్ని నెగ్గించుకునే ప్రయత్నం చేసి సఫలీకృతం అయ్యారు.

మునుగోడు నియోజకవర్గంలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులతో హైదరాబాదులోని తన నివాసంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాను సూచించిన అంశాలకు లోబడి మద్యం షాపులు నిర్వహించాలని వారితో చేసిన చర్చలు ఫలించడం వల్ల మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు నియోజకవర్గ వ్యాప్తంగా నూతన మద్యం దుకాణాలను సోమవారం ఊరి బయటనే ప్రారంభించి, మధ్యాహ్నం 1:00 గంటల నుండి విక్రయాలు మొదలు పెట్టారు. అధిక తాగుడు వద్దు ఆరోగ్యమే ముద్దు అనే రాజగోపాల్ రెడ్డి సంకల్పానికి మద్యం షాప్ యజమానులు మద్దతుగా నిలవడం పట్ల నియోజకవర్గ ప్రజల సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**బెల్ట్ షాపుల నిర్మూలనతో తగ్గిన క్రైమ్ రేట్**

ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా దొరికే మద్యం వల్ల ఎంతోమంది యువకులు తాగుడుకు బానిసై తమ జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్న తీరును చూసి, విచ్చలవిడిగా మద్యం సేవించి గ్రామాలలో అకారణంగా ఘర్షణలకు తావిస్తున్న తీరును చూసి, మద్యానికి బానిసై అనారోగ్యాలకు గురై ప్రజలు చనిపోతున్న సంఘటనలు చూసి చలించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే బెల్ట్ షాపులను నిర్మూలించారు. బెల్ట్ షాపులకు నిర్మూలించిన గ్రామాలకు అభివృద్ధి నిధులు కేటాయించారు. దీంతో గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడి మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా క్రైమ్ రేటు తగ్గిందని పోలీసులు విశ్లేషిస్తున్నారు. కొత్తగా మద్యం టెండర్ల ప్రక్రియ మొదలవగానే టెండర్ల ప్రక్రియలోనే మునుగోడులో మద్యం షాపుల నిర్వహణ, మద్యం నియంత్రణపై సూచనలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. మునుగోడులో మద్యం షాపులు నిర్వహించాలనుకునే వాళ్ళు తాము సూచించిన పద్ధతిలోనే నిర్వహించాలని బహిరంగంగా చెప్పారు. ప్రజలను ఆరోగ్యంగా, ఆర్థికంగా చిన్నాభిన్నం చేస్తున్న మద్యం అధిక తాగుడుకు కళ్లెం వేయడానికి మద్యాన్ని నియంత్రించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజగోపాల్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి మద్యం షాపుల యజమానులు తోడ్పాటును అందిస్తూ మద్యం షాపులను నిర్వహించడానికి ముందుకొచ్చారు. మద్యం షాపుల నిర్వహణ నియంత్రణ విషయంలో రాజగోపాల్ రెడ్డి సంకల్పానికి మద్యం షాపుల యజమానులు అందిస్తున్న తోడ్పాటు ఆదర్శప్రాయంగా మారనున్నది.

## కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీకి అధికసంఖ్యలో ఆసక్తి



రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి గ్రామాలలో ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పోటీకి వస్తున్నారని తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయితీ ఎన్నికలను నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందేనన్నారు. సూర్యాపేట నియోజక వర్గానికి సంబంధించి 2 మండలాలు మొదటి విడతలో, మిగిలిన 2 మండలాలు రెండో విడతలో పూర్తి చేసే కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ప్రకటించిందని వివరించారు. గ్రామాల్లో విశేష స్పందన కనిపిస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ పార్టీలకు అతీతంగా ప్రతి నిరుపేద కుటుంబానికి ఫలాలను అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులలో ఎక్కువగా మహిళలకు, బిసిలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కాని ప్రతిపక్షాలు కావాలనే బురద జల్లుతున్నాయని ఒకవేళ ఎన్నికలు ఆలస్యమైతే గ్రామాలకు అందవల్సిన నిధులు తిరిగి వెళ్ళే పరిస్థితి ఉన్నందున ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్వీర్యం చేసిందని కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు, మహిళా సంఘాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చి వారిని కోటీశ్వర్లుగా చేసే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. గ్రామాలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్, దేవేందర్, బైరబోయిన శ్రీనివాస్, యాట వెంకన్న, నేరెళ్ళ మధు పాల్గొన్నారు.

## బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫేస్2 రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. నోటిఫికేషన్ వెలువడిన నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు రిటర్నింగ్ అధికారికి పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. అభ్యర్థి రోజు వారి ఎన్నికల ఖర్చు వివరాలను తనిఖీ చేయడం, వివరాలు ఇవ్వడంలో విఫలమైతే వారికి నోటీసులు జారీ చేసే అధికారం ఉందన్నారు. సూర్యాపేట జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడం మీ అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిఎఫ్ఓ సతీష్, ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

**నామినేషన్ సరళిపై కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/మోతె :** మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మండల ఎన్నికల అధికారి టి ఆంజనేయులు, తహశీల్దారం యం వెంకన్నలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో సుమారు అర గంట పాటు సమీక్ష నిర్వహించారు. అనంతరం మామిళ్ళగూడెం నామినేషన్ కేంద్రం పరిశీలన చేశారు. మండలంలోని పలు క్లస్టర్‌లలో నామినేషన్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పూర్తి వివరాలు తప్పులు లేకుండా సక్రమంగా నామినేషన్ పత్రాలు నింపే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విషయంలో అధికారులు సమయస్ఫూర్తితో ఉండాలన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత చర్యలు చేపట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు.

**నామినేషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని చందుపట్ల గ్రామ పంచాయితీ నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ప్రక్రియను పరిశీలించి, రిటర్నింగ్ అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎంపిఓ దయాకర్, పంచాయితీ కార్యదర్శులు, జిపిఓలు ఉన్నారు.

## ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలి : ఎస్‌పి



**ప్రజాపక్షం/చివ్వెంల :** రెండో విడుత గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా జిల్లా ఎస్‌పి కె నరసింహ చివ్వెంల మండల కేంద్రం, చందుపట్ల గ్రామాలలో ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను, పోలీస్ బందోబస్తును పరిశీలించి గ్రామ ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకోవల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, చివ్వెంల ఎస్ఐ వి మహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

**ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే పిడియాక్ట్**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఆమలులోకి వచ్చిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గ్రామ పంచాయితీ ఎన్నికలు 2025 దృష్ట్యా పోలీసు శాఖ ప్రణాళికతో పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలుకు నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్కరు ఎన్నికల కోడ్ నియమావళిని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు చాలా కీలకమన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే, అలవాటుగా నేరాలకు పాల్పడితే వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## బాధ్యతాయుతంగా జోనల్ అధికారులు విధులు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బాగంగా జోనల్ అధికారులు తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల జోనల్ అధికారులతో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సమీక్షించి తగు సూచనలు, సలహాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జోనల్ అధికారులు ఎన్నికల నిర్వహణలో కీలక సమన్వయకర్తగా పోలింగ్ సాఫీగా జరిగేలా, శాంతి భద్రత కాపాడబడేలా, సామగ్రి మరియు సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండేలా చూసే బాధ్యత జోనల్ అధికారుల పై ఉందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జోనల్ అధికారులు చాలా కీలకమైన బాధ్యతలు నిర్వహించాలని, ఎన్నికల నిర్వహణపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. తమ జోన్లో వచ్చే అన్ని పోలింగ్ స్టేషన్లపై పర్యవేక్షణ, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం చర్యలు సరిగా జరుగుతున్నాయో లేదో పరిశీలించాల్సిన బాధ్యత జోనల్ అధికారులు పై ఉందన్నారు. పోలింగ్ స్టేషన్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూడాలన్నారు. పోలింగ్ అధికారుల నియామకం, శిక్షణ, హాజరు వంటి విషయాలను తరచూ పర్యవేక్షించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లడుతూ ఎన్నికల సామగ్రి సరఫరా, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీ వంటి అవసరమైన సామగ్రి పోలింగ్ సిబ్బందికి అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, యంపిడిఓలు, జోనల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిఎం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/దేవరకొండ:** ఈనెల 6న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి నల్గొండ జిల్లా దేవరకొండ మునిసిపాలిటిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనే నిమిత్తం దేవరకొండకు వస్తున్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పి శరత్ చంద్రపవార్‌లు సోమవారం పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఆర్డివో కార్యాలయంలో అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న పనులు, హెలిప్యాడ్, బహిరంగ సభ, తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిక లోబడి విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని అధికారులకు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పి శరత్ చంద్రపవార్‌తో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంకేఆర్ పరిసరాలు, అలాగే ముదిగొండ రోడ్‌లో హెలిప్యాడ్, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పబ్లిక్ మీటింగ్ స్థలాలను పరిశీలించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు, ఆర్డివో రమణారెడ్డి, డిఎస్పి శ్రీనివాస్‌రావు, మునిసిపల్ కమిషనర్, ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీధర్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తదితర శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# క్రీడ




## సేఫ్టీ క్లియరెన్స్ వస్తేనే చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు!

చిన్నస్వామి స్టేడియంలో ఐపిఎల్ 2026 మ్యాచ్‌లు జరగడం కష్టంగానే కనిపిస్తోంది. ఈ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటే ముందుగా సేఫ్టీ క్లియరెన్స్ నివేదికను అందజేయాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌కి అధికారిక నోటీసును జారీ చేసింది. స్టేడియంకు సంబంధించి వివరణాత్మక నిర్మాణ భద్రత నివేదికను సమర్పించాలని ఆదేశించింది. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ ధ్రువీకరించిన నిపుణులతో నివేదికను రూపొందించాల్సి ఉంటుంది. ఈ నివేదిక ఆధారంగానే చిన్నస్వామి మైదానంలో మ్యాచ్‌లకు అనుమతి ఇవ్వాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకుంటుంది. ఐపిఎల్ 2025లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవగా.. జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అప్పుడు స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. తొక్కిసలాట ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది. ఈ కమిషన్ చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని తేల్చింది. ఇందులో పెద్ద కార్యక్రమాలు నిర్వహిస్తే జనాలను అదుపు చేయలేక మళ్లీ తొక్కిసలాట లాంటి పరిస్థితులు ఏర్పడతాయని, నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించింది. తొక్కిసలాట జరిగినప్పటి నుంచి ఈ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించడం లేదు. ఇప్పుడు తిరిగి మ్యాచ్‌లు నిర్వహించాలంటే స్టేడియంలో ప్రేక్షకుల గ్యాలరీలు, మొత్తం నిర్మాణం పెద్ద ఈవెంట్లు నిర్వహించడానికి సురక్షితంగా ఉందని నిరూపించాలి. స్టేడియంకు సేఫ్టీ క్లియరెన్స్ ఉంటేనే ఐపిఎల్ 2026లో మ్యాచ్‌లకు అనుమతిస్తామని కర్ణాటక ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆర్సీబీ ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించింది. పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) స్టేడియంలో 2026 ఐపిఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై సమాలోచనలు చేస్తోంది.



## రెండో వన్డేకు ముందు

## గంభీర్, అగార్కర్‌తో బిసిసిఐ సమావేశం!

రాంచి వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి వన్డేలో టీమ్ఇండియా 17 పరుగులతో విజయం సాధించింది. రెండో వన్డే రాయ్‌పుర్‌లో డిసెంబర్ 3న జరగనుంది. ఈ నేపథ్యంలో బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. రెండో వన్డేకు ముందు ఆకస్మికంగా.. టీమ్ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, మరికొందరు ఉన్నతాధికారులతో బిసిసిఐ సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా, జాయింట్ సెక్రటరీ ప్రభ్‌తేజ్ సింగ్ బాటియా ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. బిసిసిఐకి ఇటీవలే అధ్యక్షుడిగా నియమితుడైన మిథున్ మన్హాస్ సమావేశానికి హాజరవుతారా? లేరా? అనే విషయం తెలియరాలేదు. ప్రస్తుతం టీమ్ఇండియా ప్రదర్శన, ఆటగాళ్ల ఎంపిక తదితర అంశాల మీద వీరంతా చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో టెస్ట్ సిరీస్ 20 తేడాతో ఓడిపోవడంపై సమీక్ష జరిపే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వీరు కసరత్తు చేయనున్నట్లు సమాచారం. 'ప్రస్తుతం టీమ్ఇండియా వ్యూహాలు మైదానంలో, వెలుపల కొన్నిసార్లు గందరగోళానికి గురి చేస్తున్నాయి. తదుపరి టెస్ట్ సిరీస్‌కు దాదాపు ఎనిమిది నెలల సమయం ఉంది. ఈ నేపథ్యంలో మేం మరింత స్పష్టత, ముందస్తు ప్రణాళికను కోరుకుంటున్నాం' అని ఓ బిసిసిఐ అధికారి 'స్పోర్ట్స్ స్టార్'కు తెలిపారు. 'వచ్చే సంవత్సరం టీ20 వరల్ కప్ జరగనుంది. భారత్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. ఆ తర్వాత సంవత్సరం వన్డే వరల్ కప్ జరగనుంది. ఈ నేపథ్యంలోనే జట్టులోని సమస్యలను త్వరగా పరిష్కరించాలనుకుంటున్నాం' అని ఆ అధికారి పేర్కొన్నారు. అలాగే డిసెంబర్ 9 నుంచి టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జట్టును కూడా ప్రకటించే అవకాశమున్నట్లు సమాచారం.

## ఫిట్‌నెస్ పరీక్షకు సిద్ధమవుతున్న గిల్..

స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో గాయపడిన శుభ్‌మన్ గిల్ గురించి కీలక అప్డేట్ వచ్చింది. మెడకు గాయంతో వన్డే సిరీస్‌కూ సైతం దూరమైన గిల్ పునరాగమనానికి సిద్ధమవుతున్నాడు. వరుసగా సఫారీలతో రెండు సిరీస్‌లలో ఆడని భారత కెప్టెన్ తదుపరి టీ20 సిరీస్ లోపు ఫిట్‌నెస్ సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు. అందుకని.. భారత కెప్టెన్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరనున్నాడు. డిసెంబర్ 9 నుంచి మొదలయ్యే పొట్టి సిరీస్‌కు అందుబాటులో ఉండే అవకాశముంది. ఇటీవలే టెస్టు, వన్డే పగ్గాలు స్వీకరించిన శుభ్‌మన్ అనుకోకుండా గాయంతో జట్టుకు దూరమైన విషయం తెలిసిందే. కోల్‌కతా టెస్టులో హార్మర్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడబోయి మెడకు బంతి తగిలించుకున్న గిల్ ఆ తర్వాత నుంచి మైదానంలోకి దిగలేదు. మెరుగైన చికిత్స కోసం ముంబై వెళ్లిపోయిన గిల్.. ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నాడు. రాంచీలో తొలి వన్డేకు ముందు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మాట్లాడుతూ గిల్ ఆరోగ్యంపై కీలక అప్డేట్ ఇచ్చాడు. భారత సారథి ఆరోగ్యం మెరుగైందని.. అతడు త్వరలోనే మైదానంలోకి దిగుతాడని మోర్కెల్ చెప్పాడు. అతడు అన్నట్టే.. గిల్ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరనున్నాడు.



సోమవారం సాయంత్రం లోపు గిల్ సీఓఈలో అడుగుపెడుతాడని బిసిసిఐ వర్గాలు తెలిపాయి. అక్కడ నిపుణుల సమక్షంలో ఫిట్‌నెస్ పరీక్షలో పాల్గొనాలనకుంటున్నాడు టీమిండియా కెప్టెన్. అయితే.. ప్రస్తుతానికైతే గిల్‌కు అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు 50 శాతమే అవకాశముందని సమాచారం. కాబట్టి.. గిల్ రిస్క్ తీసుకుంటాడా? లేదంటే మరి కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటాడా? అనేది తెలియాల్సి ఉంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య డిసెంబర్ 9న టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. వన్డేలకు దూరమైన ప్రధాన పేసర్ బుమ్రా సైతం టీ20ల్లో ఆడే అవకాశముందని టాక్.

# ఫోకస్ యువతరంగం


ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్న మానసిక రుగ్మతగా భావోద్వేగ అస్థిరతను పేర్కొనాలి. ఈ సమస్యవల్ల ఉద్యోగ, వ్యాపార నైపుణ్యాలు దారుణంగా దెబ్బతింటాయి. అక్కౌంటెంట్‌కు లెక్కల నైపుణ్యం వంటి హార్డ్ స్కిల్స్ ఉద్యోగానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు. కానీ, సాఫ్ట్ స్కిల్స్ అనేవి కెరీర్‌ను నిర్మించగలవు లేదా ధ్వంసం చేయగలవు.



## నైపుణ్యాలను దెబ్బతీసే భావోద్వేగ అస్థిరత!

సాఫ్ట్ స్కిల్స్ ఇతరులతో సఖ్యతగా ఉండడం, సమర్థవంతంగా కమ్యూనికేట్ చేయడం, సహకరించడం, కార్యాలయంలో భావోద్వేగాలను నియంత్రించడం వంటి నైపుణ్యాలను కలిగి ఉంటాయి. అందుకే, సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి కేంద్రీకరించాలి. ఇవి లోపించినప్పుడు భావోద్వేగ అస్థిరత ఏర్పడుతుంది. ఎవరైనా ఫీడ్‌బ్యాక్ ఇచ్చినప్పుడు, వాటిని గమనించకపోవడం, విమర్శ ఎదుర్కోవాలనే భయంతో సహచరులు, మేనేజర్లతో సంభాషణలను తప్పించుకోవడం వంటి లక్షణాలను భావోద్వేగ అస్థిరతగా పేర్కోవచ్చు. అదే విధంగా ఈ సమస్యను ఎదుర్కొంటున్న వారిలో సమయపాలన కొరవడుతుంది. స్వీయనింద లేదా తమను తాము నిందించుకోవడం పెరుగుతుంది. జట్టు సభ్యులతో సఖ్యతగా ఉండలేకపోతారు. తమను అప్పుగా అర్థం చేసుకుంటారేమోనన్న అనుమానంతో, వారికి సహకరించకుండా దూరంగా ఉండిపోతారు. అతిగా ఆలోచించడం లేదా నిర్ణయాలు తప్పుగా నిరూపితమవుతాయన్న భయంతో అసలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం వంటి పరస్పర విరుద్ధ భావనలతో సతమతమవుతారు. సమావేశాల్లో ఆసక్తి చూపరు. చర్చల్లో చురుగ్గా పాల్గొనరు. గందరగోళపడుతూ, తప్పుగా మాట్లాడడం లేదా అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా జరుగుతుంది. ఇమెయిల్స్‌కి త్వరగా స్పందించడం, సందేశం ఎలా అర్థం అవుతుందో ఆలోచించకపోవడం వంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఈ సమస్యను ఎంత త్వరగా అధిగమిస్తే, అంత మంచిది. సామాజిక పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనటానికి, వృత్తిపరమైన సంబంధాలను మెరుగుపరచటానికి, సరైన నిర్ణయాలు తీసుకోవటానికి, ఒత్తిడిని తట్టుకోవటానికి భావోద్వేగ నియంత్రణ సహాయపడుతుంది. ఇందుకుగాను, ముందుగా మిమ్మల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న విషయాలను గుర్తించాలి. వాటిని రాసుకొని, ఏ విధంగా ప్రభావం చూపుతున్నాయో అర్థం చేసుకోవాలి. తద్వారా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యూహాలను రూపొందించవచ్చు. ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకాన్ని కల్పించుకోవాలి లేదా యోగ వంటి భావోద్రేక నియంత్రణ విధానాలను అనుసరించాలి. ఇతరుల దృష్టికోణాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రతిస్పందించే ముందు ఇతరు మాటలను శ్రద్ధగా వినండి. మాట్లాడే ముందు చిన్న విరామం తీసుకోవాలి. మీ భావోద్వేగాలను గుర్తించాలి. ఎదుటివారి స్థానంలో మీరు ఉన్నట్లుగా ఊహించుకుంటే, సహానుభూతిని పెంచుతుంది. అదనంగా, థెరపిస్టు లేదా కోచ్ సహాయంతో మీ భావోద్వేగ నియంత్రణ నైపుణ్యాలను మెరుగుపరచవచ్చు.

## ప్రతిభే గుర్తింపు..



వేసుకున్న బట్టలు.. చేసుకున్న షోకులు కాదు.. ప్రతిభతోనే మనిషికి గుర్తింపు వస్తుంది. గౌరవం లభిస్తుంది. ఈ విషయాన్ని గ్రిగోరి పెరెల్మాన్ నిరూపించాడు. అత్యంత సాదాసీదా జీవితం గడిపిన అతను చూడడానికి ఇల్లూవాకిలి లేని నిర్భాగ్యుడిగానో, మతి స్థిమితం కోల్పోయి ఒంటరిగా తిరుగుతున్న వ్యక్తిగానో కనిపిస్తాడు. కానీ, అసాధారణ గణితవేత్తగా ప్రపంచం ఈ రష్యన్ తాత్వికుడిని కీరిస్తున్నది 1966, జూన్ 13న జన్మించిన పెరెల్మాన్ జీవితం ఒక అద్భుత కావ్యం. గణితశాస్త్రంలో అతని విప్లవాత్మక కృషి, నిత్య జీవితంలో అనుసరిస్తున్న అత్యంత వినయమైన జీవనశైలి ప్రపంచానికి ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. చిన్నతనం నుండే అతనిలో గణిత ప్రతిభ కనిపించేది. 1982లో ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాన్ని సాధించినప్పుడు గణిత ప్రపంచం యావత్తు అతనివైపు సంభ్రమాశ్చర్యాలతో చూసింది. అతని పరిశోధనలు.. ప్రధానంగా రీమానియన్ జ్యామితి, జ్యామితిక విశ్లేషణ, టాపాలజీ రంగాల్లో సాగాయి. సుమారు శతాబ్దకాలంగా ప్రపంచ గణిత శాసానికి చిక్కుప్రశ్నగా మారిన 'పాయంకరే కాన్జెక్చర్'ను అతను 2002–2003 మధ్యలో అతి తక్కువ పేజీల పరిశోధనా పత్రాలతో పరిష్కరించాడు. ఈ సమస్యను పరిష్కరించడంలో అతను రిచ్చీ ఫ్లో అనే కొత్త తాత్విక పద్ధతిని ఉపయోగించాడు. ఈ ఘనతకు గాను ఇతడికి 2006లో 'ఫీల్డ్స్ మెడల్' (గణిత శాస్త్రంలో నోబల్ బహుమతి సమాన ప్రతిష్ట)తోపాటు క్లే మాథమెటిక్స్ సంస్థ నుండి 'మిలియన్ డాలర్ మిల్లెనియం పురస్కారం' సంపాదించిపెట్టింది. కానీ, ఇతడు ఆ అవార్డులను, డబ్బును నిరాకరించాడు. 'నా పరిశోధనా ఫలితాలు వాస్తవంగా ఉండటం చాలు, ధనఖ్యాతులు నాకు అవసరం లేదు. నేనొక ప్రదర్శన జంతువులా చేదుగా ప్రజల్లో ఉండాలి అనిపించడం లేదు' అనడమేకాదు.. ఆచరణలో చూపెడుతున్నాడు. పెరెల్మాన్ తన పరిశోధన విజయాన్ని ఇతర శాస్త్రవేత్తలతో సమానంగా పంచుకోవాలని భావించాడు. తనకు వచ్చిన బహుమతిని కూడా తిరస్కరించాడు. తక్కువగా మాటాడుతూ, నిరాడంబర జీవితం గడపడం తనకు ఎంతో ఇష్టమని అంటాడు పెరెల్మాన్. అతనికి స్నేహితులు లేరు.. శత్రువులు అసలే లేరు. అత్యంత సాధారణమైన జీవితాన్ని గడుపుతున్నాడు. కోరుకుంటే విలాసవంతమైన జీవితం అందుబాటులో ఉంటుంది కానీ, అతను ఎప్పుడు దానిని కోరుకోలేదు. కోణిజెక్చర్ పజిల్‌ను పరిష్కరించడం ద్వారా ప్రపంచ గణితశాస్త్ర చరిత్రలో అసాధారణమైన వ్యక్తిగా పేరు సంపాదించినప్పటికీ, ఒదిగిన విద్యా జీవితం, వినయం, నిజాయితీ, విజ్ఞానం వంటి లక్షణాలతో సామాన్యుడిలా కనిపించే అసమాన్యుడు పెరెల్మాన్.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# భూషయ్య సేవలు చిరస్మరణీయం

సిపిఐ రాష్ట కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని





**ప్రజాపక్షం/ఏన్కూరు :** మేడా భూషయ్య పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండల భారత కమ్యూనిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు, అమరజీవి మేడా భూషయ్య సంస్మరణ సభ సోమవారం ఏన్కూర్‌లో ఆయన స్వగృహంలో జరిగింది. సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సంతాప సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంత్‌రావు మాట్లాడుతూ మేడా భూషయ్య ఏన్కూర్ గ్రామంలో సిపిఐని బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. సర్పంచ్, ఎంపిటిసిలను గెలిపించడంలో ఆయన పాత్ర కీలకం అన్నారు. పార్టీకి గడ్డ పరిస్థితులు వచ్చిన పెద్ద దిక్కుగా ఉండి కార్యకర్తలకు ధైర్యం నింపుతూ్రీఈ్ట అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆరోగ్యం బాగా లేనప్పటికీ పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సీనియర్ నాయకులుగా పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేనివన్నారు. వారికి వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. సంతాప సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపటి రమేశ్, జిల్లా నాయకులు తెప్పాల సత్యం, అమరణేని వీరభద్రమ్, చంద్ర నరేంద్ర కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, దొంతిబోయిన నాగేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు విజయబాయి, టిడిపి నాయకులు తాళ్లూరి అప్పారావు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు రూ.26వేల వేతనం

ఎఐటియుసి ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ టౌన్ :** ఐహెచ్ఎఫ్ఎంఎస్ కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆసిఫాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ డిప్యూటీ సూపరింటెండెంట్ కృష్ణకు మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఐహెచ్ఎఫ్ఎంఎస్ టెండర్ల కాలపరిమితి ముగిసిందని, వెంటనే నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని, అపాయింట్మెంట్ లెటర్స్, ఐడి కార్డులు ఇవ్వడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం డిసెంబర్ 2 నుంచి 4 వరకు ఆసుపత్రి ఆవరణలో నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 5న కోటిలోని మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్ కార్యాలయం ముందు ధర్నా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు చిరంజీవి, కోశాధికారి నగేష్, కార్మికులు కృష్ణ, నీల, రాజయ్య, గంగన్న, కమల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువతకు రాజకీయ సైద్ధాంతిక శిక్షణ



సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యువతకు రాజకీయ సైద్ధాందిక శిక్షణ అవసరమని సిపిఐ ఖమ్మం జిల్లాకార్యదర్శి దండి సురేష్ పేర్కొన్నారు. యువతలో శారీరక ధృడత్వంతో పాటు మానసిక పరివర్తన, సమాజం పట్ల అవగాహన అవసరమని ఆయన తెలిపారు. సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ పొందాలని ఆయన సూచించారు. ఖమ్మం నగర స్థాయి జన సేవా దళ్ శిక్షణా శిబిరం సోమవారం ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెంలో ప్రారంభమైంది. శిక్షణను సిపిఐ జిల్లా కార్యదర్శి సురేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా కలిగిన యువత పాలక వర్గాల తీరుతో నైరాశ్యానికి గురవుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో పాలకులు విఫలం కావడంతో యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో యువత చైతన్యవంతమైన ఆలోచనలతో రాజకీయాల్లోకి రావాలని వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులకు మద్దతుగా నిలవాల్సి ఉందన్నారు. నిరుద్యోగం పెరిగిన నేపథ్యంలో పాలకులు కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తూ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. సుదీర్ఘ కాలం పోరాటాలతో అనేక హక్కులను, సంక్షేమ పథకాలను సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జనవరి 18న ఖమ్మంలో జరుపుకుంటుందని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఐదువేల మంది యువకులకు జన సేవాదళ్ శిక్షణ ఇస్తుమన్నారు. శారీరకంగా ధృడత్వం కలిగి ఉన్నప్పుడే మానసిక పరిపక్వత లభిస్తుందని శారీరక ధృడత్వం కలిగి సమాజ ఉన్నతికి కృషి చేయాలని ఆయన యువతను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ సమస్యలపై జరిగే పోరాటాలకు సంబంధించి కార్యోన్ముఖులను చేయడమే లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, నగర నాయకులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, సైదా, మాలకొండయ్య, రావుల హన్మంతరావు, మాడుగుల నాగేశ్వరరావు, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడికి గుర్తింపుకార్డు తప్పనిసరి

తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రతీ కార్మికుడికి గుర్తింపు తప్పనిసరి అని ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు తాండ్ర సదానందం పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శ్రీ రాజరాజేశ్వర మార్బుల్ అండ్ టైల్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు తాండ్ర సదానందం, జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి భవన యజమానులకు, కార్మికులతో మాట్లాడారు. యూనియన్‌లో పనిచేసే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా యూనియన్ గుర్తింపు కార్డు తీసుకోవాలని, ప్రతి నెలా సమావేశం నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని సదానందం స్పష్టం చేశారు. ప్రధానంగా, యూనియన్ నిర్ణయించిన ధరలకు మాత్రమే పనులు చేయాలని, ఆ ధరలను తగ్గించి పని చేయడంతో నాణ్యత లోపిస్తుందని ఆయన హెచ్చరించారు. ఇంటి యజమానులు తక్కువ రేటుకు పనిచేసేవారిని ఆశ్రయిస్తే భవిష్యత్తులో రిపేర్లకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. యూనియన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, తక్కువ ధరలకు పని చేయించుకుంటే తలెత్తే సమస్యలకు యూనియన్ బాధ్యత వహించదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి మాట్లాడుతూ రాష్ట్రేతర మరియు ఇతర జిల్లాల నుంచి వస్తున్న కార్మికుల వల్ల నాణ్యత లోపాలు ఎదురవుతున్నందున, రాజరాజేశ్వర అసోసియేషన్ యొక్క యూనియన్ కార్డు ఉన్నవారికి మాత్రమే ఇంటి పనులు అప్పగించాలని భవన యజమానులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా కల్లెపెల్లి మోహన్, సంయుక్త కార్యదర్శి దొమ్మటి రాజేష్, ఉపాధ్యక్షులు గడ్డం మధు, కోశాధికారి గడ్డం తిరుమల్, సహాయ కోశాధికారి లోకేష్ మీనా, ప్రచార కార్యదర్శి మిరియాల రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వేములపల్లి సర్పంచ్ అభ్యర్థిగా యాదగిరి నామినేషన్



**ప్రజాపక్షం/వేములపల్లి:** వేములపల్లి సర్పంచ్ అభ్యర్థిగా సోమవారం సిపిఐ నాయకుడు జిల్లా యాదగిరి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ వేములపల్లి సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న తనను ఆదరిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పలువురు పాల్గొన్నారు. కాగా మండలంలోని రెండవ దశ స్థానిక సంస్థల ఎన్నికలలో నామినేషన్‌లు రెండవ రోజు ప్రశాంతంగా ముగిశాయి. అన్నపురెడ్డిగూడెం బుగ్గ బాయ్ గూడెం వేములపల్లిలో సర్పంచ్ అభ్యర్థులు వార్డు మెంబర్లు పోటాపోటీగా నామినేషన్లను సమర్పించారు, ప్రధాన పార్టీల నాయకులకు టికెట్లు రాకపోవడంతో పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు.

## నిరుపేదల పక్షాన పోరాడుతున్నది భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే

సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిరంతరం నిరుపేదల పక్షాన పోరాడుతున్నది భారత కమ్యూనిస్టు పారీ ఒక్కటేనని సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి, రాష్ట్ర సీనియర్ నాయకుడు పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. రాజేంద్రనగర్ మండలంలోని ఎఆర్ దేవరాజ్ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో సిపిఐ రాజేంద్రనగర్ మండలంలోని పార్టీ శాఖను పునర్ నిర్మించడం జరిగింది. సమావేశం సయ్యద్ ఖాజా అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పుస్తకాల నర్సింగ్‌రావు హాజరై మాట్లాడుతూ రాజేంద్ర నగర్ మండలంలోని అర్హులైన నిరుపేదల అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను, కొత్తరేషన్ కార్డులను, కొత్త పెన్షన్లు ఇవ్వాలని ఆయన అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జరిగే సిపిఐ శతజయంతి ముగింపు మహాసభకు పెద్ద ఎత్తున రాజేంద్రనగర్ మండలం నుంచి బయలుదేరి వెళ్లి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ మండల పరిధిలోని గాంధీనగర్‌లో స్థానికంగా 35 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ప్రజలకు కనీస సౌకర్యాలు లేవన్నారు. కరెంట్ మీటర్లు ఇవ్వడం లేదని, సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేదని, అన్ని సౌకర్యాలు కల్పించాలని వారికి పట్టాలు ఇవ్వాలని, పక్షంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కన్యగారి లక్ష్మి, మండల సహాయ కార్యదర్శి ఎండి షఫీ, మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం, మండల కౌన్సిల్ సభ్యులు సాబీర్, రామచందర్, కృష్ణ, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక...** అనంతరం సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్‌డి సర్దార్, సహాయ కార్యదర్శిగా పర్వీన్ బేగం, శాఖ కౌన్సిల్ సభ్యులుగా మునీర్ ఉన్నిసా, మహ్మద్ అఖిల్, షకీల్ అమిత్, అలీషా బేగంను ఎన్నుకున్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించిన స్పీకర్



ప్రజాపక్షం/వికారాబాద్: వికారాబాద్ మున్సిపల్ ని అనంతగిరి పల్లికి చెందిన సందీప్ మెడికల్ ఏజెన్స్ అండ్ క్లినికల్ నిర్వాహకులు సందీప్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోట్‌పల్లి సందీప్ కు చెందిన ఉచిత అబులెన్స్‌ను తెలంగాణ అంసెబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ఈ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా అందించడం గొప్పవిషయం అన్నారు. ట్రస్ట్ చైర్మన్ సందీప్ మాట్లాడుతూ ఇంధనం పోసుకొని ఉచితంగా వినియోగించుకోవచ్చు అని తెలిపారు. పేద ప్రజలకు సరైన సమయంలో వైద్యం అందించడం తన ముఖ్యలక్ష్యం అని అన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అగ్రస్థానంలో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్

### దేశంలో ఏడో స్థానం.. తెలంగాణలో మొదటి స్థానంలో

ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రజలకు ఉత్తమ సేవలందించిన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికైంది. దేశ వ్యాప్తంగా మినిస్ట్రి ఆఫ్ హోమ్ అఫైర్స్(ఎంహెచ్‌ఎ) ఎంపిక చేసిన ఉత్తమ పోలీస్‌స్టేషన్‌లలో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ దేశంలో ఏడో స్థానంలో, తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఎంపికైందని మినిస్ట్రి ఆఫ్ హోమ్ అఫైర్స్ బృందం సభ్యులు తెలిపారు. సోమవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన కేంద్ర బృందం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న పలు అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. పోలీస్‌స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ప్రజల ఫిర్యాదులను సమయానుకూలంగా పరిష్కరించడం, పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం, లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చి కేసులు పరిష్కారం అయ్యే విధంగా కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించడం, పోలీస్ స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టడం, పోలీస్‌స్టేషన్‌లో పచ్చని వాతావరణం కనిపించేలా చెట్లు నాటి సంరక్షించడం లాంటి అంశాలను ఎంహెచ్‌ఎ పరిగణనలోకి తీసుకుంది. అలాగే ఉత్తమ సిసిటిఎన్‌ఎస్ పనితీరు. సిబ్బంది నైపుణ్యం వంటి అంశాలు పరిశీలనలో ఉన్నాయి. ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా 10 ఉత్తమ పోలీస్‌స్టేషన్‌లను ఎంపిక చేసే క్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన శామీర్ పేట పోలీస్‌స్టేషన్ రాష్ట్రంలో అగ్రస్థానం, దేశంలో ఏడవ స్థానంలో ర్యాంకును సాధంచడం జరిగిందని సిఐ శ్రీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, ఏడిసిపి పురుషోత్తం, ఎసిపి మేడ్చల్ బాలగంగిరెడ్డి, శామీర్ పేట సిఐ శ్రీనాద్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు




ప్రజాపక్షం/నవాబుపేట్ : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందువలన సోషల్ మీడియాలో ఎవరైనా రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేసిన, పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నవాబ్ పేట్ ఎస్సై జి. పుండ్లిక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఎన్నిక ల కోడ్ ఉన్నందున సామాజిక మాధ్యమాల ద్వారా ఎవరైనా ప్రజా శాంతికి భంగం కలిగే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పోస్టులు పెట్టిన రాజకీయ దూషణలో జరిపిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండలం లోని ప్రజలు ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని శాంతియుత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగేలా చూడాలి, అలాగే పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




## బివిఆర్ ఐటి, క్వాల్ కామ్ భాగస్వామ్యంతో విద్యార్థులకు మరిన్ని అవకాశాలు

ప్రజాపక్షం/నిజాంపేట్ : బివిఆర్ ఐటి, క్వాల్ కామ్ భాగస్వామ్యంతో విద్యార్థులకు మరిన్ని అవకాశాలు, ఆవిష్కరణలు అందుతాయమని క్వాల్ కామ్ ప్రతినిధులు సుధీర్ కుమార్, నితిన్ శర్మలు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లోని బివిఆర్ ఐటి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో క్వాల్ కామ్ మెంటర్ షిప్ కార్యక్రమ దశాబ్ది వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు కళాశాల చైర్మన్ కెవి విష్ణు రాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ప్రిన్సిపల్ కెవిఎన్ సునీత, ప్లేస్ మెంట్ డైరెక్టర్ సతీశ్ చంద్రలతో పాటు క్వాల్ కామ్ ప్రతినిధులు సుధీర్ కుమార్, నితిన్ శర్మలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకుంటూ క్వాల్ కామ్ సంస్థతో కళాశాల సాగించిన విజయం, సాధనల గురించి సమగ్ర నివేదికను సమర్పించారు. క్వాల్ కామ్ ప్రతినిధులు మాట్లాడుతూ కళాశాల విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ప్రతిభ, ఇన్స్టిట్యూట్ అందిస్తున్న సృజనాత్మక వాతావరణాన్ని ప్రశంసించారు. క్వాల్ కామ్ మెంటర్ షిప్ కార్యక్రమంతో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ తమ వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. సాంకేతిక నైపుణ్యాల్లో నైపుణ్యం, విశ్వాసం, పోటీ ల్లో పాల్గొనే అవకాశం, కెరీర్ పురోగతికి అందించిన మార్గదర్శకత ఎంతగానో ముఖ్యమని ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో బివిఆర్ ఐటి, క్వాల్ కామ్ భాగస్వామ్యం మరింత బలపడుతూ విద్యార్థులకు మరిన్ని అవకాశాలు, ఆవిష్కరణలు, శిక్షణా వేదికలను అందిస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడెమిక్ డీన్ జె.నాగ విష్ణువర్ధన్, ఇంజనీర్లు, మేనేజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రామాంజనేయులుకు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' అవార్డు

ప్రజాపక్షం/చర్లపల్లి: ఇసిఐఎల్ చౌరస్తాలోని పోలీస్ ఐ హస్పిటల్ చైర్మన్ నందనంపాటి రామాంజనేయలుకు టైమ్స్ ఆఫ్ ఇండియా అవార్డును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ, తెలంగాణ రాష్ట్ర మాజీ ఆరోగ్యమంత్రి హరీష్‌రావుల చేతులమీదుగా అందించారు. గత 9 సంవత్సరాల క్రితం ఇసిఐఎల్ ఈ ఆసుపత్రిని ప్రారంభించి మంచిపేరు సంపాదించదంతో భారతదేశంలో 4వ స్థానం, ఏపి, తెలంగాణ రాష్ట్రాలలో రెండవ స్థానంలో ఉండడం వల్ల అవార్డును పొందారు. ఈ అవార్డు రావడం పట్ల పద్మశ్రీ గరికపాటి నరసింహరావు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఆసుపత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ శివరామకృష్ణ, విజయేందర్‌రెడ్డి,మహేష్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# రెండు పడవలపై ప్రయాణం ప్రమాదమే..

* రెండు జైళ్ల బాధ్యతలు నిర్వహిస్తున్న శివకుమార్‌గౌడ్
* చర్లపల్లి జైలు నుంచి ఖైదీ పరారీ.. చంచల్‌గూడ జైల్లో రౌడీల యుద్ధం






ప్రజాపక్షం/హైదరాబాద్: రెండు పడవల మీద ప్రయాణం చేయడం మొదటికే చేటు.. అనే సామెతను చర్లపల్లి, చంచల్‌గూడ కేంద్ర జైలు సూపరింటెండెంట్ శివకుమార్ నిజమని నిరూపించారు. శివకుమార్ ఈ రెండు జైళ్లకు ఏడాది కాలంగా సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ రెండు జైళ్ల మధ్య దూరం 21 కిలోమీటర్లు. ప్రయాణించడానికి గంటకుపైగా సమయం పడుతుంది. ఈ రెండు జైళ్లు కూడా తెలంగాణ జైళ్ల శాఖలో కీలకమైన సెంట్రల్ జైళ్లు. ఒక్కో జైలులో 1800 నుంచి 2000 మంది వరకు ఖైదీలు ఉంటారు. వీరందరిని కంటికిరెప్పలా కాపాడాల్సిన బాధ్యత సూపరింటిండెంట్‌పై ఉంది. జైలు సూపరింటెండెంట్ ఇంతటి సున్నితమైన, కఠినమైన బాధ్యతలు నెరవేర్చాలంటే ఒక్కో జైలుకు ఒక్కో సూపరింటెండెంట్ ఉండాలి. అయితే ఏడాదికాలంగా ఒకే సూపరింటెండెంట్ రెండు జైళ్లను చూసుకోవాల్సి వస్తుంది. దీంతో సూపరింటెండెంట్ డ్యూటీలో సరైన న్యాయం చేయకపోవడంతో ఇటీవలే చర్లపల్లి జైలునుంచి ఒక ఖైదీ పారిపోయాడు. విషయం గమనించిన పోలీసులు అతికష్టంపై ఉప్పల్‌లో అతన్ని పట్టుకుని తిరిగి జైలుకు తరలించారు. ఇదిలావుండగా మరోపక్క చంచల్‌గూడ జైలులో టప్పాచబుత్ర పోలీసు స్టేషన్ పరిధికి చెందిన రైడీషీటర్, దస్తగిర్, మరో రౌడీషీటర్ బాబ్రీ లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రధానమైన ఈ రెండు జైళ్లలో మావోయిస్టులు, కరుడుకట్టిన ఉగ్రవాదులు, కిరాతక హంతకులు, రౌడీషీటర్లు, డ్రగ్స్ సరఫరా డాన్‌లతో పాటు కీలక నిందితులు ఉంటారు. అంత పతిష్ఠ కలిగిన ఈ జైలులో ఒక్క జైలుకు ఒక్క సూపరింటెండెంట్ విధులు నిర్వహించడమే కష్టసాధ్యం..అలాంటిది రెండు జైళ్లను ఒకే సూపరింటెండ్ చూసుకోవడం కష్టసాధ్యమైన పనేనని పలువురు భావిస్తున్నారు. చంచల్‌గూడ జైలు సూపరింటెండ్‌గా పనిచేసిన శ్రీనివాస్ డిఐజి పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లడంతో శివకుమార్‌గౌడ్‌ను నియమించారు. ఇక చర్లపల్లి జైలు సూపరింటెండ్‌గా గతంలో పని చేసిన సంతోష్‌రాయ్ బదిలీపై వెళ్లడంతో ఇక్కడ సూపరింటెండెంట్‌గా కొత్త వాళ్లను ఎవరిని నియమించలేదు. చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ గా ఉన్న శివకుమార్‌గౌడ్‌కే అదనంగా చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించారు. ఇలా రెండు జైళ్లకు శివకుమార్‌గౌడ్ సుపరింటెండెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జైలు ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి చర్లపల్లి జైలుకు నూతన సూపరింటెండెంట్‌ను నియమిస్తే శివకుమార్‌గౌడ్‌కు పని భారం తగ్గడంతో పాటు చంచల్‌గూడ జైలుపై పూర్తి దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి. తద్వారా జైలులో ఖైదీల మధ్య గొడవలు జరిగే ఆస్కారం ఉండదు. ఇక చరపల్లి ఒపెన్ ఎయిర్ జైలు కూడా కీలకమైన జైలే. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందిన సమయంలో శివకుమార్‌గౌడ్‌కు కొంత కాలం ఇక్కడి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఈ జైలుకు సూపరింటెండెంట్‌గా కళాసాగర్‌కు బాధ్యతలు అప్పగించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఇక పోరుబాటే

### టియుడబ్ల్యుజె



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్నా నేటికీ ఎలాంటి స్పందన కనపరచక పోవటాన్ని నిరసిస్తూ ఈ నెల 3న రాష్ట్ర సమాచార శాఖ, ఐజెయు కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా టియుడబ్ల్యుజె పిలుపిచ్చింది. ధర్నాకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టరేట్ కార్యా లయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా టియుడబ్ల్యుజె అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీద బాలరాజ్, దొంతుల వెంకట్రాంరెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో జర్నలిస్టులు అత్యంత నిరాదరణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఉమ్మడి రాష్ట్రంలో జర్నలిస్టులకు అమలైన పథకాలు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పదేళ్లపాటు పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించగా రెండేళ్ల క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే ధోరణి కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఉమ్మడి రాష్ట్రంలో అమలైన హెల్త్ స్కీమ్ ప్రత్యేక తెలంగాణాలో కనపడకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు.

జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు, అక్రిడిటేషన్ పాలసీ తీసుకొని రావటం, ఇళ్ల స్థలాలివ్వటం, ఆరోగ్య బీమా పథకం, చిన్న మధ్య తరగతి పత్రికలను ఆదుకోవటంలాంటి అనేక విషయాల గురించి రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి పలుసార్లు తీసుకొని వెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతె వెంకటరెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు జిల్లా కమిటి నాయకులు వెంకటరెడ్డి, నర్సింగ్‌రావు, గిరి బాబు, రవి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

### రేపు హైదరాబాద్‌లో మహా ధర్నా

నిజాంపేట్‌లో : తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో డిసెంబర్ 3వ తేదీన హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ వద్ద ఉన్న సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు భారీ ధర్నా జరగనుంది. ఈ ధర్నాకు సంబంధించిన పోస్టర్ ను సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్‌లో యూనియన్ అధ్యక్షులు గోలిపల్లి దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, ప్రధాన కార్యదర్శి రెడ్డెబోయిన మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు.

## నామినేషన్ స్వీకరణ కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజాపక్షం/వికారాబాద్‌రూరల్ /మోమిన్‌పేట్ : నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తనిఖీ చేశారు. వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది గ్రామ పంచాయతీ ,మోమిన్‌పేట్ మండల పరిధిలోని వెల్చాల్ గ్రామ పంచాయతీ లో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సర్పంచు వార్డు స్థానలకు .జారీ చేసిన నోటిపికేషన్ వివరలను క్షణ్ణంగా పరిశీలించి ఎలాంటి పోరపాట్లకు తవు లేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ తప్పనిసారిగా అందుబాటులో ఉంచాలని ,అవసరమైన వారికి సహయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట ఎన్నికల సంఘం నియమ నబంధలకు అనుగుణంగా విదులు నిర్వహించలని తెలిపారు. విదుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల ఖర్చు చేయు వివరలను తెలుపు వ్యయపరిమితి పక్కాగా లెక్కించాలని అన్నారు. కలెక్టర్ తో పాటు ట్రైనింగ్ కలెక్టర్ హర్స్,చౌదరి,ఎంపిడిఓలు సృజన, వినయ్‌కుమార్, తహసీల్దార్లు లక్ష్మి నారాయణ,రవీందర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి కోసం అవకాశం ఇవ్వండి : ఈదులపల్లి సువర్ణ

ప్రజాపక్షం/నవాబుపేట్ : నవాబ్ పేట్ మండల పరిధిలోని అక్నాపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ సతీమణి ఈదులపల్లి సువర్ణ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ రెండవ రోజు ఆమె అక్నాపూర్ సర్పంచ్ అభ్యర్థిగా చించల్ పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తన నామినేషన్‌ను పత్రాన్ని గ్రామస్థులతో పాటు అధికారుల సమక్షంలో నామినేషన్ పత్రం అందజేశారు. అనంతరం ఆమె గ్రామ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజలు ఇచ్చే విశ్వాసం, మద్దతుతో గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ మరింత అభివృద్ధిచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో సమస్యలు మిషన్ భగీరథ కోసం తవ్విన సీసి రోడ్డు ప్యాచ్ వర్క్, అలాగే వీధిలైట్లు, గ్రామంలో అవసరం వున్నచోట సిసి కెమెరాలు ఇలా గ్రామంలో ఉన్నటు వంటి అన్ని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని అందుకు గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తూ గెలిపించాలని కోరారు.

# పూర్ణిమ హై స్కూల్‌లో చిన్నారిపై ఆయా పైశాచిక దాడి

* యాజమాన్యం నిర్లక్ష్యమే దాడికి కారణం
* తాత్కాలికంగా పాఠశాలను సీజ్ చేసిన ఎంఇఒ
* కరస్పాండెంట్, ఆయాల అరెస్టు




ప్రజాపక్షం/నిజాంపేట్ : పూర్ణిమ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో చిన్నారి పై ఓ ఆయా పైశాచికంగా దాడిచేసిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లోని పూర్ణిమ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో నర్సరీ చదువుతున్న ఐదేళ్ల చిన్నారి పాఠశాలకు వచ్చింది. స్కూల్‌లో పనిచేసే ఆయా చిన్నారి పై నవంబర్ 29వ తేదీన పైశాచికంగా, పాశవికంగా దాడికి దిగింది. అతి కిరాతకంగా దాడిచేసిన ఘటనను ప్రక్కనే ఉన్న ఓ భవనంపై నుండి ఓ యువకుడు ఆయా చేసిన దాడిని రికార్డ్ చేయడంతో విషయం బయటికి పొక్కింది. చిన్న విషయాన్ని ఎందుకు పెద్దగా చేస్తున్నారని స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా చెప్పడం అందరిని విస్మయానికి గురిచేస్తుంది. ఈ మేరకు చిన్నారి తల్లిదండ్రులు విషయం తెలుసుకుని జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకున్న పోలీసులు వెంటనే ఆయాను అదుపులోకి తీసుకుని విచారించారు.

చిన్నారిపై పాశవికంగా దాడి చేసిన అనంతరం పాఠశాల యాజమాన్యం కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం. తల్లిదండ్రులు వెంటనే స్థానికంగా గల ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చిన్నారిని తరలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల కరస్పాండెంట్ జానకిరామయ్య, ఆయాను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.



**పాఠశాలను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు**

పూర్ణిమ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటన పై స్పందించిన విద్యాశాఖ అధికారులు సోమవారం పాఠశాలకు చేరుకున్నారు. కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమిలి కుమారి సిబ్బందితో కలిసి షాపూర్ నగర్‌లోని పూర్ణిమ హై స్కూల్ పాఠశాలలో చిన్నారి పై దాడి ఘటనపై పూర్తి సమాచారాన్ని సేకరించారు. పాఠశాలలో సిబ్బంది, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులను సైతం జరిగిన ఘటన గురించి తెలుసుకునేందుకు యత్నించారు. కానీ ఉపాధ్యాయులంతా సెల్ ఫోన్‌లను సైతం స్విచ్ ఆఫ్ చేసుకున్నట్లు జెమిలితెలిపారు. పాఠశాలలో ఓ ఆయాకు మాటలు రావని, మిగిలిన ఉపాధ్యాయులు ఎవ రూ అందుబాటులో లేరని చెప్పా రు. పాఠశాల యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహించిన ట్లు తెలిసిందని, తాత్కాలికంగా పూర్ణిమ పాఠశాలను సీజ్ చేస్తున్నామని తెలిపారు. చిన్నారి పాప ఆరోగ్యం కాస్త నిలకడగానే ఉన్నప్పటికీ 24 గంటలు గడిస్తే తప్ప పరిస్థితి చెప్పలేమని వైద్యులు తెలిపినట్లు ఆమెవివరించా రు. 3వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రులందరితో సమావేశం ఏర్పాటు చేశామని, పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని అన్నారు.

**విద్యార్థి సంఘాల ఆందోళనలు..** షాపూర్ నగర్ పూర్ణిమ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో చిన్నారి పై ఆయా చేసిన దాడిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ సంఘం నేతలు ఆందోళనకు దిగారు. ఓ ఆయా చిన్నారి పాప అనే విషయాన్ని మరిచి పాశవికంగా దాడికి పాల్పడడం విచారకరమని, దీనికి పూర్తి బాధ్యత పాఠశాల యాజమాన్యానిదేనని మండిపడ్డారు. మరోసారి పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు.

## డబుల్ బెడ్‌రూమ్ భూమిని కాపాడాలని సిపిఐ నేతల వినతి



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: దేవేందర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ భూమిని కాపాడాలని సోమవారం సిపిఐ నేతల ఆర్ కలీమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజుల రామారం సర్కిల్‌లోని దేవేందర్ నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్‌కి ఆనుకోని ఉన్న భూమి ప్రభుత్వానిదేనని గతంలో కబ్జాచేస్తే అప్పటి ఎమ్మార్వో గౌతమ్ కూల్చివేశారని కానీ నేడు మళ్లీ దాన్ని కోర్ట్ ఆర్డర్ పేరుతో కబ్జా చేసేసారని సిపిఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలాన్ని సర్వేచేసి కాపాడి, ప్రజా అవసరాల కొరకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండలం కార్యదర్శి స్వామి, కోశాధికారి సదానంద్, జంబూ తదితరులు పాల్గొన్నారు.

## భారీ భూ కబ్జా మోసం బట్టబయలు...నిందితులు అరెస్టు

ప్రజాపక్షం/నాగారం: డబుల్ రిజిస్ట్రేషన్ పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లికి చెందిన రమేశ్‌రావుకి మహాలక్ష్మి నగర్, రాంపల్లిలో గల తమ ప్రాంతాలలో గల ప్లాట్లను కొంతమంది వ్యక్తులు డబుల్ రిజిస్ట్రేషన్ చేసినట్లు కీసర పిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు నేపథ్యంలో కీసర పోలీసులు దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడు మోహమ్మద్ ఖాజాపాషా(మౌలాలీ),రామచంద్రయ్యలను అరెస్టు చేసి విచారించగా 1990 సంవత్సరానికి ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లను గుర్తించి అ తర్వాత లావాదేవిలు లేని ప్లాట్‌లను గుర్తించి నకిలీ పత్రాలు సృష్టించి అసలు యజమానుల పేర్లతో నకిలీ వ్యక్తులను ఏర్పాటు చేసి వారినే అసలు యజమానులుగా చూపించి కీసర రిజిస్ట్రేషన్ ఆఫీసులో డాక్యుమెంట్ రైటర్, అప్పటి ఎస్ఆర్ఒతో కుమ్మకై అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. నకిలీ డాక్యుమెంట్లు ఉపయోగించి బ్యాంకుల్లో లోన్‌లు తీసుకుని పెద్ద ఎత్తున మోసాలు చేసి భారీ మొత్తంలో డబ్బులు సంపాదించారు. ఈ కేసుతో పాటు మరికొన్ని ప్లాట్లు మోసాలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను కోర్టులో హాజరు పర్చి మిగిలిన నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నామని సిఐ ఆంజనేయులు తెలిపారు.

## స్టీల్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

### అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద




ప్రజాపక్షం/నిజాంపేట్ : స్టీల్ బ్రిడ్జి నిర్మాణపు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డులో నూతనంగా ప్రారంభించిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణపు పనులను స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా వివేక్ మాట్లాడుతూ కెపి హెచ్‌బి కాలనీ, జగద్గిరి గుట్ట, షాపూర్ నగర్ నుండి సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డు మీదుగా మేడ్చల్ నేషనల్ హైవేకి కనెక్టివిటీ రోడ్డుని, మధ్యలో పురాతన బ్రిడ్జి శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో రూ.56 కోట్ల రూపాయలతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణపు పనులను ప్రారంభించామని వివరించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఈ స్టీల్ బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ ఎసిపి వెంకట్ రాంరెడ్డి, కార్పొరేటర్ హేమలత, మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్, జిహెచ్ఎంసి ప్రాజెక్టు ఈఈ శ్రీనాథ్ రెడ్డి, డిఇఇ వెంకట రమణ, ఎఇఇ శోభన్, జీహెచ్ఎంసి ఇఇ, డిఇ పాల్గొన్నారు.

# పార్టీ పటిష్టతకు పాల్పడుతా

### కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : జిల్లాలో కింది స్థాయి నుండి ప్రతి ఒక్కరితో సమన్వయం పాటి స్తూ పార్టీ పటిష్టతకు పాల్పడుతానని కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. అదే విధంగా కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతనిధులు ప్రణాళికాయుక్తంగా, సంఘటితంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే మ పథకాలను ప్రజలకు చేరవేయటం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయా లని పిలుపిచ్చారు.



సోమవా రం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింలు యాదవ్, వైస్ చైర్మన్ జి.విఠల్ నాయక్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ నేతలు, తదితరులు నూతనంగా డిసిసి పదవి చేపట్టిన అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌ను కల్సి శుభాకాంక్షలు తెలిపారు.

**నాగారంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం**




పేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు పరు స్తోందని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు శ్రీనివాస్ నగర్ కాలనీలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారం భించారు. గూడులేని నిరు పేదల ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందిస్తోందని, లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ పేద కుటుంబాలకు మరిన్ని ఇళ్లను అందేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సి పాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యా దవ్, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొ న్నారు.

**వజ్రేష్‌యాదవ్‌కు శుభాకాంక్షలు : నర్సింహ్మా యాదవ్**

**శామీర్‌పేట:** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్, వైస్ చైర్మన్ విఠల్‌నాయక్‌లు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింహాయాదవ్, వైస్ చైర్మన్ విఠల్ నాయక్‌లు తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కౌలు రైతుల పత్తిపంట కాల్చిన దుండగులను శిక్షించాలి : జంగయ్య



**ప్రజాపక్షం/కొందుర్గు:** కౌలు రైతుల పత్తి పంటను కాల్చిన దుండగులను శిక్షించాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణపూర్ గ్రామానికి చెందిన కౌలు రైతులు గోవర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిలు తమ ఇంట్లో నిల్వ ఉంచిన పత్తిని ఓర్వలేకనే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారని పేర్కొన్నారు. కక్షలు ఉంటే మాట్లాడుకోవాలని, పంటను దగ్ధం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేందుకు పోలీసులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

## ఆరోగ్య సమస్యలకు యోగా

దేప సురేఖ భాస్కర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రజలు ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సమస్యలకు యోగా పరిష్కారం చూపుతుందని జిహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఆర్‌కెపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌కెపురం డివిజన్ అల్కాపురి కాలనీ పతాంజలి యోగా కేంద్ర రజతోత్సవ వేడుకలను యోగ గురువు శ్రీ ధర్మవీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు ధర్మవీర్ మాట్లాడుతూ పతాంజలి యోగా కేంద్రం గత 25 సంవత్సరాలుగా వేలాది మంది ప్రజల ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు కేంద్రంగా నిలిచిందన్నారు. ప్రతి ఇంటికి యోగాను తీసుకువెళ్లడమే మా లక్ష్యం అన్నారు. నేటి ఆధునిక జీవితశైలిలో యోగా అనేది కేవలం వ్యాయామం కాదు, అదొక సంపూర్ణ జీవన విధానం అని అయన వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ చెన్నప్ప, ఆర్షకవి ప్రణవ్‌కుమార్, పద్మక్క, మంకాళ విజయ్, భాణాల ప్రభాకర్, దామోదర్‌రెడ్డి, అనిత, అనంతలక్ష్మి, పిట్ట సుమతి, మీనాకుమారి, మాధవి లత, మంజుల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుండి షాద్‌నగర్ ముఖ్యకూడలి వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండటంతోపాటు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ కలుషితమైన రక్తం, సూదుల వల్ల ఎయిడ్స్ వ్యాధి వచ్చే అవకాశాలు ఉంటాయని, ఎయిడ్స్ వ్యాధితో కూడిన గర్భం ధరించినట్లు అయితే జన్మించే బిడ్డకు సైతం ఎయిడ్స్ వ్యాధి వచ్చే అవకాశాలు ఉంటాయని సూచించారు. వ్యాధి వచ్చిన వారితో మాట్లాడటం, కలిసి తిరగడం, కలిసి భోజనం ద్వారా ఎయిడ్స్ రాదని పేర్కొన్నారు. ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించే బాధ్యత ప్రజలందరిపై ఉందని, పూర్తి స్థాయిలో ప్రచారం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎహెచ్‌పి వైద్యాధికారులు డాక్టర్ జగదీష్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ ఉష, డాక్టర్ బిందు, డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రవీణ, హెల్త్ సూపర్ వైజర్లు శ్రీరామ, చంద్రకళ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బాధితుల పట్ల వివక్ష తగదు

సార్క్ డైరెక్టర్ డా.అనురాధ




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష తగదని రాష్ట్ర సైంటిఫిక్ అండ్ అప్లైడ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. దాని నివారణకు తగిన అవగాహన ఉంటే నియంత్రించడం సాధ్యమవుతుందని ఆమె తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన నడక కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీకృష్ణ రాఘవేంద్ర మాట్లాడుతూ దేశంలో 24లక్షల మందికి హెచ్‌ఐవి ఉంది. తెలంగాణలో 1.4లక్షల మందిలో పురుషులు, మహిళలు ఉన్నారని తెలిపారు. చాలా మంది పరీక్షలు చేయించుకోవడంతో పిల్లల్లో కూడా పాజిటివ్ కనపడుతోందని తెలిపారు. ఇలాంటి కేసులు తల్లిదండ్రుల నుంచి సంక్రమిస్తాయని వెల్లడించారు. హెచ్‌ఐవీ సోకినంత మాత్రాన భయపడాల్సిన అవసరం లేదని, వాటిని గుర్తించి కేసులను ముందుగా ఐసీటీసీ సెంటర్‌లో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. వనస్థలిపురంలో ఒక ఐసీటీసీ సెంటర్, పీపీపీ పద్ధతిలో ఏఆర్టీ సెంటర్ కామినేనిలో ఉందని, ఇప్పటికి వరకు 1200 మందికి ఉన్నారని వారికి ప్రభుత్వం నుంచి ఇస్తున్న మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎం.స్వామి, అంజయ్య, శ్యాంసుందర్, సుధీర్‌బాబు, హరికృష్ణ, ప్రదీప్‌కుమార్, పెద్ది రామకృష్ణ, పి.రత్నాచారి, సురేష్, దాక్షాయని తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ జంట ఆత్మహత్య



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కొత్తూరు సిఐ నరసయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన నవనీత్ దత్త అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కొనేళ్ళ క్రితం కొత్తూరు మండల కేంద్రానికి వచ్చి ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. నవనీత్ దత్త కుమార్తె అనామిక (21) స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పనిచేస్తుంది. అక్కడే పనిచేస్తున్న ధనుంజయ్(25)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కాగా అనామిక పరిశ్రమకు మూడు రోజుల నుండి పనికి రావడం లేదని తెలుసుకున్న ధనుంజయ్ సోమవారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వెళ్ళగా అప్పటికే అనామిక ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించిందని, ఇది చూసిన ధనుంజయ్ సైతం ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న శంషాబాద్ ఎసిపి శ్రీకాంత్‌గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి తండ్రి నవనీత్‌దత్త ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరసయ్య వివరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# అలవాటుగా రైళ్ల భద్రత



దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైళ్ల భద్రతా పద్ధతులను ఒక అలవాటుగా మలుచుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అధికారులకు సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో రైలు కార్యకలాపాల నిర్వహణ, భద్రతపై అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌గా, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ..రైలు కార్యకలాపాలనిర్వహణలో భద్రత అత్యంత ముఖ్యమైనదన్నారు. భద్రతా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో నిరంతర కౌన్సెలింగ్‌తో పాటు అవగాహన పెంపొందించాలన్నారు. యార్డులు, లెవల్ క్రాసింగ్‌ల వద్ద మరియు షంటింగ్ కదలికల సమయంలో భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. శీతాకాల సంసిద్ధత, పొగమంచు భద్రతా పరికరాలపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం మరియు జోన్ వ్యాప్తంగా తగినంత భద్రతకు సంబంధించిన నిల్వల లభ్యతను నిర్ధారించాలన్నారు. భద్రతకు హాని కలగకుండా సమయపాలన పాటించడానికి విభాగాల వేగాన్ని పర్యవేక్షించాలన్నారు. సిబ్బంది సంక్షేమం, ఆపరేటింగ్ సిబ్బందికి సరైన విశ్రాంతి మరియు నియంత్రిత పని గంటలను హామీ ఇచ్చే ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయడానికి సూచనలు జారీ చేశారు. జనరల్ మేనేజర్ ముఖ్యంగా శీతాకాల పరిస్థితుల్లో సజావుగా సురక్షితంగా రైలు కార్యకలాపాలు జరిగేలా చూసుకోవడానికి నిరంతర అప్రమత్తత మరియు చురుకైన చర్యలు అవసరమని నొక్కి చెప్పారు. భద్రత మరియు సమయపాలన యొక్క అత్యున్నత ప్రమాణాలను పాటించాలని ఆయన అధికారులందరిని కోరారు.

# ఊపందుకోనున్న జిహెచ్‌ఎంసి ప్రాజెక్టు పనులు

- హెచ్ సిటీ పనులకు రూ. 663.50 కోట్లు విడుదల
- పాతబస్తీ మెట్రోరైల్ విస్తరణకు రూ. 125 కోట్లు విడుదల
- నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగరంలో ప్రాజెక్టు పనులు ఊపందుకోనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, గ్రేడ్ సపరేటర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రాష్ట్రప్రభుత్వం జిహెచ్‌ఎంసికి హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్ సిటీ) ప్రాజెక్టు పనుల కోసం రూ. 663.50 కోట్లు విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్ పనుల కోసం ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) బడ్జెట్‌లో రూ. 2654 కోట్లు కేటాయించింది. ఇందులో ఇప్పటికే రూ.1327 కోట్లు విడుదల కాగా, తాజాగా వీటిని విడుదల చేసింది. వీటితో పాటు వృత్తిపన్ను పరిహారం కింద రూ. 10 కోట్లు, జిహెచ్‌ఎంసికి పరిహారం కింద రూ. 10 లక్షలు విడుదల చేసింది. ఈ మేరకు మునిసిపల్ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాత బస్తీ మెట్రోరైల్ విస్తరణకు సైతం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం పాతబస్తీలో మెట్రోరైల్ నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. అందుకోసం మెట్రోరైల్‌కు రూ.125 కోట్లు విడుదల చేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్ ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంకు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు డిప్యూటీ మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు సి.ఎన్.రఘుప్రసాద్, కె.సత్యనారాయణ, వేణుగోపాల్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, వెంకన్న, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే ఎయిడ్స్ నుంచి రక్షణ

సికింద్రాబాద్‌లో విద్యార్థులతో ర్యాలీ, సెమినార్..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరల్డ్ ఎయిడ్స్ డే – 2025 సందర్భాన్ని పురస్కరించుకొని ఉస్మానియా పిజి కళాశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి కార్యాలయం, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు డా. రామకృష్ణ చౌదరి కొడూరి మాట్లాడారు. ఎయిడ్స్ గురించి ఇప్పటికీ సమాజంలో అనేక అపోహలు ఉన్నాయని, ఈ అపోహలను తొలగించడం ప్రతి పౌరుడి బాధ్యతన్నారు. ఎవరైనా రోగ నిర్ధారణ పరీక్ష చేయించుకోవడం అంటే భయం కాదు, అది జాగ్రత్త. మన ఆరోగ్యాన్ని కాపాడుకునే తొలి అడుగన్నారు. ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారిని దూరంగా పెట్టడమంటే సమాజానికి మచ్చతేవడమేనని, వారికి అండగా నిలబడి ప్రోత్సహించడం మన మానవత్వం నిరూపించుకోవడం అన్నారు. రోగం ఉన్న వ్యక్తిని కాదు, రోగాన్ని ఎదుర్కోవాలని, దీని కోసం కుటుంబ సభ్యులు, విద్యార్థులు, యువత సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్న ఔషధాలు, చికిత్సలు చాలా మందికి తెలియడం లేదన్నారు. ఈ సేవలను ప్రతి బాధితుడికి చేరవేయడం కోసం గ్రామస్థాయి అవగాహన కార్యక్రమాలు మరింత బలోపేతం చేయాలని ప్రత్యేకంగా పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ.. అవగాహన పెరిగితేనే వ్యాధి వ్యాప్తి తగ్గుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, రోగ నిర్ధారణ పరీక్ష శిబిరాలు, ఆరోగ్య శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువతలో ఈ వ్యాధి పట్ల చైతన్యం పెంపొందించడం అత్యంత ప్రధాన అంశమని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం నుండి ప్రారంభించిన ఎయిడ్స్ అవగాహన ర్యాలీని లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు రామకృష్ణ చౌదరి కోడూరి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన–మన అందరి బాధ్యత.., సురక్షిత జీవనం–సమాజ ఆరోగ్యం.. అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు సందేశం చేరవేశారు.



# బాధ్యతతో గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అధికారులు తమ విధులను బాధ్యతతో నిర్వహించి గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9వ తేదీలలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌పై సోమవారం రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు, అడిషనల్ డిజి డి.ఎస్.చౌహాన్‌లతో కలిసి అన్ని విభాగాల హెచ్‌ఒడిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ గ్లోబల్ సమ్మిట్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అతిథులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నిరకాల సదుపాయాలను కల్పించాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా తమకు కేటాయించిన పనులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, ఇంటర్నెట్ సౌకర్యంలో అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. రవాణా సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, హెలిప్యాడ్లు, పార్కింగ్ స్థలాల ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. మెడికల్ సిబ్బందితో అవసరమైన వద్ద శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ కు వివిధ ప్రాంతాల నుండి దేశాల నుండి డెలిగేట్స్ వస్తున్న సందర్భంగా విమానాశ్రయం నుండి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతం వరకు రోడ్లు పరిశుభ్రంగా ఉండాలని, గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతంలో పారిశుద్ధం చేపట్టాలని చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, రోడ్లపై ఎక్కడ ఎలాంటి చెత్త లేకుండా చూడాలని సూచించారు. మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అగ్నిపక శాఖ అధికారులు ఎలాంటి సంఘటనలు జరగకుండ చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ప్రోటోకాల్ సెక్రటరీ నర్సింహా రెడ్డి, అధికారులు ప్రేమ్‌రాజ్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా బోర్డు ఎండి కె.అశోక్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్అండ్ బి, ఫైర్ సేఫ్టీ, ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, టిజి ఎస్పీడిసిఎల్, టూరిజం, ఆరోగ్య శాఖ అధికారులు,పాల్గొన్నారు.

## మెట్రోరైల్‌లో ట్రాన్స్‌జెండర్ సిబ్బంది నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిరోజూ 5 లక్షల ప్రయాణికులకు సేవలందిస్తున్న హైదరాబాద్ మెట్రోలో మహిళల భద్రత, సౌకర్యం దృష్ట్యా 20 మంది ట్రాన్స్‌జెండర్ సిబ్బందిని భద్రతా విభాగంలో నియమించారు. ప్రత్యేక శిక్షణ పూర్తి చేసిన వీరు డిసెంబర్ 1 నుండి ఎంపిక చేసిన స్టేషన్‌లలో విధులు ప్రారంభించారు. మెట్రో స్టేషన్‌లలో కోచ్‌ల భద్రత, ప్రయాణికులకు మార్గదర్శనం, స్కానర్ పర్యవేక్షణ, కాన్‌కోర్స్ భద్రత వంటి బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ నిర్ణయం మహిళా భద్రతను బలోపేతం చేయడమే కాక సామాజిక సాధికారతకు ప్రతీకగా నిలుస్తుందని మెట్రో అధికారులు తెలిపారు.



# జర్నలిస్టుల సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం



టియుడబ్ల్యుజె రాష్ట్రకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జర్నలిస్టుల సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీకాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో ఈ నెల 3న హైదరాబాద్‌లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం ధర్నా పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రెడేషన్ పాలసీని వెంటనే ప్రకటించి, కొత్త కార్డులు జారీ చేయాలన్నారు. ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. అరులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని కోరారు. వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేసి, సంక్షోభంలో ఉన్న చిన్న మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో టియుడబ్ల్యుజె జిల్లా కార్యదర్శి మేకల సత్య నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ మొగిలి, హెల్త్ క్యాంపు కన్వీనర్ శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్యామ్ ప్రసాద్, దశరథ. శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, గణేష్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, మహేష్, ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని టియుడబ్లుజె (ఐజెయు) జిల్లా కార్యదర్శి ధన్నారం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం షాద్‌నగర్‌లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై డిసెంబర్3న మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బూర్గుల ఫణీంద్ర, టియుడబ్లుజె షాద్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నీరటి శివకుమార్, డివిజన్ ఉపాధ్యక్షుడు మల్లిఖార్జున్, సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్, ఈసి మెంబర్ ఇలియాస్, గౌరవఅధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్, జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్, శ్రావణ్‌గౌడ్, సమీ, సాబేర్, జగన్, సవాళ్ల రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# బలహీనవర్గాల అభ్యున్నతికి అంకితం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి బిసిసేన అంకితం కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని బిసిసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సంఘం విషయాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిసిసేన పట్టణ ప్రాంతాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో విస్తరింప చేసేందుకు కృషి చేయాలన్నారు. బడుగు బలహీనవర్గాల శ్రేయస్సుకు బీసీసేన కృషి చేయాలన్నారు. జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్పా మాట్లాడుతూ బీసిల ఆత్మగౌరవం కోసం, అభ్యున్నతి కోసం బీసిజనసేన నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో బిసి జనసేన నేతలు జక్కుల జలజ, భాగ్యలక్ష్మి గౌడ్, స్రవంతిరాజ్, మేకల వెంకటేష్, చందులాల్ జమాల్పూర్, గడ్డమీది రమేష్, పుష్పమ్మ, అరుణ, రాములు గౌడ్, భావన శివ తదితరులు పాల్గొన్నారు.

**డ్రైఫ్రూట్ హౌజ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే...**

పట్టణంలోని పరిగిరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రైఫూట్ హౌజ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రాంతంలో పెద్ద డ్రైఫ్రూట్ షాపు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, నేతలు రఘునాయక్, బస్వం, మహ్మద్ ఇబ్రహీం, రాజునాయక్, ముబారక్ అలీఖాన్, ఖధీర్, మాధవులు పాల్గొన్నారు.






# మోహన్‌బాబు 50 వసంతాల వేడుక

### అతిథిగా హాజరైన రజనీకాంత్



ప్రముఖ నటుడు, నిర్మాత డాక్టర్ ఎం.మోహన్ బాబు తన 50 ఏళ్ల సినీ ప్రయాణానికి సంబంధించిన కార్యక్రమంలో భారతీయ సినిమా, రాజకీయ ప్రముఖుల్ని ఒకే వేదికపైకి తీసుకు వచ్చారు. హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో జరిగిన ఈ వేడుకలో తారలంతా సందడి చేశారు. ఈ కార్యక్రమానికి రజనీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ఎందరో రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. సినీ పరిశ్రమ నుంచి బ్రహ్మానందం, హరీష్ శంకర్, టీజీ విశ్వ ప్రసాద్, అల్లు అరవింద్, దిల్ రాజు, మైత్రి శశి, జయ సుధ,నాని, నాజర్, ఆది సాయి కుమార్, సందీప్ కిషన్, వీకే నరేష్, గోపీచంద్, శ్రీకాంత్, శ్రీను వైట్ల, శ్రీకాంత్ ఓదెల వంటి వారు ఈ వేడుకలో పాల్గొన్నారు.




తెలుగు సినిమా హీరోయిన్ సమంత మరో పెళ్లి చేసుకుంది. తన స్నేహితుడు రాజ్ నిడిమోరుతో సోమవారం వివాహం జరిగింది. కోయంబత్తూరులోని ఇషా ఫౌండేషన్ వేదికగా వీరిద్దరూ ఒకటయ్యారు. ఈ వివాహం జరిగిన ఫోటోలను సమంతకు సంబంధించిన పీఆర్ వంశీకాక మీడియాకు విడుదల చేశారు. సమంతకు ఇది రెండో వివాహం. హీరో నాగార్జున కుమారుడు అక్కినేని నాగ చైతన్యను సమంత మొదట వివాహం చేసుకున్నారు. కొంతకాలం తరువాత నాగ చైతన్య, సమంత విడాకులు తీసుకున్నారు. ఏడాది క్రితం నాగ చైతన్య కూడా రెండో వివాహం చేసుకున్నారు. ఇప్పుడు సమంత కూడా రెండో వివాహం చేసుకుంది. ఈ కొత్త దంపతులు జీవితాంతం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సోషల్ మీడియాలో అందరూ ఆశీర్వదిస్తున్నారు.



## పిల్లా ఇట్టసూడవే.. తొంగి నన్ను చూడవే.. పాట ఆవిష్కరణ

ఓ అబ్బాయి అమ్మాయిని ప్రేమించటం కష్టం కాకపోవచ్చు.. కానీ ఆ అమ్మాయి నుంచి ప్రేమ సిగ్నల్ అందుకోవాలంటే మాత్రం నానా తిప్పలు పడాల్సిందే. ఐ లవ్ యు చెప్పిన తర్వాత ప్రేయసి ఏమంటుందోనని పడే టెన్షన్ మామూలుగా ఉండదు. ఇలాంటి సమయంలో ప్రేమికుడికి ప్రేయసి ఓకే చెప్పేస్తే.. ఎలా ఉంటుంది.. అతని మనసు ఎలా ఊయల ఊగుతుంది. ఇద్దరు కలిసి ఎవరికీ తెలియకుండా కళ్లతో మాట్లాడుకునే మాటలు, సైగలు చూడచక్కగా ఉంటాయి. ఇదే పాటను ఇప్పుడు ఆవిష్కరించారు. 'దండోరా కొట్టుకుందురో.. గుండెల్లో కొత్తగుందిరో నింగి నేల ఇలా.. దారి కుదిరిందెలా కళ్లారా చూడబోతినో.. కల్లోలం లాగ ఉంటదే దాగి దాగి అలా దగ్గరైపోయావే ఇలా పిల్లా ఇట్టసూడవే.. తొంగి నన్ను చూడవే..' అంటూ సాగే ఈ పాట మనసుల్ని హత్తుకుంటోంది. మార్క్ కె రాబిన్ సంగీత సారథ్యం వహిస్తోన్న సినిమాలోని ఈ పాటను అదితి భావరాజు, అనురాగ్ కులకర్ణి పాడిన ఈ పాటను పూర్ణాచారి రాశారు. దండోరా సినిమాలో ప్రేమికుల మనసుల్లో దాగిన భావాలను అందంగా ఆవిష్కరించిన పాట ఇది.



# ఆయన చాలా కేరింగ్ పర్సన్

### - హర్షాలి మల్హోత్రా

భజరంగి భాయిజాన్ హిందీలో వచ్చిన ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అయింది. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన ఈ సినిమాలో ఒక చిన్న పిల్ల మూగా అమ్మాయిగా నటించింది. ఆ అమ్మాయి పేరు హర్షాలీ మల్హోత్రా. ఇప్పుడు ఈమె తెలుగు తెరపై కనిపిస్తోంది. నందమూరి బాలకృష్ణ హీరోగా వస్తున్న 'అఖండ –2' సినిమాలో హర్షాలీ జనని అనే కీలమైన పాత్రలో నటించింది. 'అఖండ –2' డిసెంబర్ 5న విడుదల అవుతున్న సందర్భంగా హర్షాలీ మల్హోత్రా మీడియాతో చిట్ చాట్ నిర్వహించింది. బజరంగీ భాయిజాన్ తర్వాత చాలా పాత్రలు వచ్చాయి. అయితే నేను ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూశాను. అలాంటి సమయంలో అఖండ2 అవకాశం వచ్చింది. లెజెండరీ నందమూరి బాలకృష్ణతో నటించడం ఒక గొప్ప అవకాశం. నేను ఇలాంటి అవకాశం కోసమే ఎదురు చూశాను. దాదాపు పదేళ్ళ తర్వాత మళ్లీ నేను థియేటర్స్‌కి వస్తున్నాను. ఈ చిత్రంలో జనని అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. తను చాలా స్వీట్, కేరింగ్. తనకి అఖండ బ్లెస్సింగ్స్ ఉంటాయి. జనని లైఫ్ ఎప్పుడు డేంజర్‌లో ఉన్న అఖండ తనకోసం వస్తారు. బాలకృష్ణ సినిమాలో సెలక్ట్ అయ్యాక నేను ఆయన సినిమాలు కొన్ని చూశాను. భగవత్ కేసరి, వీరసింహారెడ్డి, డాకు మహారాజ్, అఖండ సినిమాలు చూశాను. బాలకృష్ణ వెరీ కూల్. ఒక లెజెండరీ యాక్టర్‌తో కలిసి నటించడం అంటే మొదట చాలా నెర్వస్ ఫీల్ అయ్యాను. అయితే ఆయన చాలా కేరింగ్ పర్సన్. నన్ను ఎంతో ప్రోత్సహించారు. ఒక ఫ్యామిలీ మెంబర్ లాగానే చూసుకున్నారు. అఖండ షూటింగ్ మైనస్ డిగ్రీస్ ఉన్న కొన్ని లొకేషన్స్ లో చేశాం. అంత చలి ప్రదేశాలలో షూటింగ్ వెరీ చాలెంజింగ్. అలాగే ఈ సినిమాలో యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను. బజరంగీ భాయిజాన్ తర్వాత వచ్చిన గ్యాప్‌లో స్టడీస్‌పై ఫోకస్ చేశాను. అలాగే కథక్ నేర్చుకున్నాను. ఒక మంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నప్పుడు ఈ సినిమా వచ్చింది. 'అఖండ –2' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి రావడం చాలా ఆనందంగా ఉంది. నా రెండో సినిమానే తెలుగు సినిమా కావడం, ఒక లెజెండరీ యాక్టర్‌తో నటించడం అద్భుతమైన అనుభూతి. బోయపాటి ఎంతో కేర్ తీసుకున్నారు. షూటింగ్ చేస్తున్నప్పుడు నెర్వస్‌గా ఫీల్ అయితే నువ్వు తప్పకుండా చేయగలవని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత అద్భుతంగా చేసావని అభినందించేవారు. ఆయన ప్రోత్సాహం నాలో మరింత ఎనర్జీని నింపింది. జననీ పాత్ర కోసం బోయపాటి నన్ను ఎంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. సల్మాన్ ఖాన్‌తో చాలా అందమైన జ్ఞాపకాలు ఉన్నాయి. మేం టేం టెన్నిస్ ఆడేవాళ్ళం. చాలా సరదాగా ఉండేది. అలాగే బాలయ్య తో కూడా చాలా మంచి ఫన్ మూమెంట్స్ ఉన్నాయి .ఆయన షూటింగ్ ఎనర్జీ కోసం కషాయం తాగమని చెప్పేవారు. కానీ నాకు అల్లం అంటే ఇష్టం ఉండదు. ఆయన ఒక ఫ్యామిలీ మెంబర్ లానే చూసుకున్నారు.తెలుగులో మీకు ఇష్టమైన స్టార్స్ బాలయ్య, అల్లు అర్జున్, ప్రభాస్. నాకు సంజయ్ లీలా బన్సాలీ సినిమాలో చేయాలని ఉంది. ఆయన హీరోయిన్స్‌ని చూపించే విధానం చాలా అద్భుతంగా ఉంటుంది. అలాగే నాకు అన్ని రకాల జానర్స్ చేయాలనీ వుంది. మంచి కాంబినేషన్స్‌లో మెయిన్ లీడ్‌గా చేయాలని ఉంది. అలాగే ఛాలెంజింగ్ క్యారెక్టర్స్ చేయాలని ఉంది.



# తెలుగు టెలివిజన్ రచయితల సంఘం

### అధ్యక్షుడిగా కొమ్మనాపల్లి గణపతి రావు

రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కొమ్మనాపల్లి గణపతి రావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జి శశాంక, కోశాధికారిగా వై.నరేంద్ర కుమార్, ఎగ్జి క్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా బివి రామరావు, జాయింట్ సెక్రెటరీగా ఎం.ఫణి కుమార్ ఎన్నికైయ్యారు. ఫిలిం ఛాంబర్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల స్వర్గస్తులైన రచయిత అందెశ్రీకు రెండు నిముషాలు మౌనం పాటించి ఘనంగా నివాళ్లర్పించారు. దర్శకులు శివ నాగేశ్వర్ రావు, నటుడు కాదంబరి కిరణ్ కూడా ఈ ఎన్నికలకు హాజరైయ్యారు.




# 5 నుంచి 'అవతార్' అడ్వాన్స్ బుకింగ్ షురూ

ప్రపంచ సినిమా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న విజువల్ వండర్ హాలీవుడ్ సినిమా 'అవతార్'. ఈ సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో ఈనెల 5వ తేదీ నుంచి అడ్వాన్స్ బుకింగ్ షురూ చేస్తున్నారు. ఐమాక్స్ ఫార్మాట్ లో వస్తున్న ఈ సినిమా కోసం దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ఐమ్యాక్స్ థియేటర్లలో అవతార్ థీమ్‌తో డిజైన్ చేసిన బాక్స్ ఆఫీస్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. బుకింగ్ ప్రారంభమైన క్షణం నుంచే ఫ్యాన్స్ కు ఫోటో సెటప్లు, థీమ్లతో ప్రాంగణంతో అద్భుతంగా మారబోతోంది. మొదటిసారిగా ఈ ఫ్రాంచైజీ డాల్బీ విజన్ సినీ అనుభవంలో కూడా అందుబాటులోకి రాబోతుంది. జేమ్స్ కామెరన్ సృష్టించిన ఈ మహత్తర 'అవతార్: ఫైర్ అండ్ ఆష్'ను 20th సెంచరీ స్టూడియోస్ డిసెంబర్ 19న ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేయనుంది.

# యుఫోరియా టీజర్ రిలీజ్

తమిళ నటుడు, దర్శకుడు గౌతమ్ మీనన్, నటి భూమిక చావ్లా ప్రధాన పాత్రలో దర్శకుడు గుణ శేఖర్ తెరకెక్కిస్తున్న సినిమా యుఫోరియా. గుణ టీమ్ వరక్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. డ్రగ్స్, మాఫియా, యూత్ ఎంటర్టైన్మెంట్స్ ప్రధాన అంశంగా రూపొందిస్తున్న సినిమా ఇది. రాజశేఖర్, సారా అర్జున్, ఆదర్శ్ బాలకృష్ణ, నాజర్, కేశవ్ దీపక్, కల్పలత, నారా రోహిత్, లిఖిత నాయుడు, సాయి శ్రీనిక రెడ్డి, నవీన రెడ్డి తదితరులు నటిస్తున్నారు. నీలిమ గుణ, యుక్త గుణ నిర్మాతలుగా తెరకెక్కుతున్న ఈ సినిమాను ఫిబ్రవరి 6వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.






# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

### సంబంధిత అధికారులతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఈ నెల 8 నుంచి నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్ఠ ఏర్పాట్లను చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి సోమవారం సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ ఈ సమ్మిట్‌లో పలువురు ప్రముఖులతో పాటు దేశ, విదేశీ అతిథులు పాల్గొననున్నారని వారికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేయాలన్నారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి ప్రత్యేకంగా ప్రజా భవన్‌లో వార్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో నిర్వహించే ఈ అతిపెద్ద సమ్మిట్‌లో రాష్ట్రానికి సంబంధించి అన్నిశాఖలు తమ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ప్రధానంగా ప్లీనరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వన్ టు వన్ సమావేశాలు, వివిధ సంస్థలతో ఎంఓయూలే ప్రధాన అంశాలుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 13 వరకు కొనసాగనున్న ఈ సమ్మిట్ ఉప్పల్ స్టేడియంలో ఫుట్ బాల్ మ్యాచ్‌తో ముగుస్తుందని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, సబ్యసాచి ఘోష్, సంజయ్ కుమార్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయాలపై బిజెపి గుడ్డి జపం

### మంత్రి శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించడమే బిజెపి పనిగా పెట్టుకుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 2022లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం లీజ్ ల్యాండ్‌ను ఫ్రీ హోల్డ్ చేస్తే బిజెపి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఇది బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి ఆడుతున్న నాటకం అని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కాలుష్యం పెరిగి పాఠశాలలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దనేదే ప్రజా ప్రభుత్వ ప్రయత్నం అని అన్నారు. ఢిల్లీ కాలుష్య పరిస్థితి హైదరాబాద్‌లో రావాలని బిజెపి, బిఆర్‌ఎస్ కోరుకుంటున్నాయన్నారు. హిల్ట్ పాలసీ జీవో సొంత భూములపై కన్జర్వేషన్ ఫీజు విధించాం, ప్రభుత్వ భూములను దారాదత్తం చేసిందే బిఆర్‌ఎస్..యెదేచ్ఛగా టైటిల్ మార్చారన్నారు. నిరూపయోగంగా ఉన్న పరిశ్రమల భూములను ఉపయోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సిరీస్ అనే ఫార్మా కంపెనీకి సంబంధించిన వంద ఎకరాల ల్యాండ్‌ను బిఆర్‌ఎస్ ప్రభుత్వం కన్జర్వేషన్ చేసింది. అప్పుడు బిఆర్‌ఎస్‌కు నిబంధనలు గుర్తుకురాలేదా అని అన్నారు. బిఆర్‌ఎస్ తెచ్చిన గ్రిడ్ పాలసీలో 30శాతం ఎస్‌ఆర్‌ఒ పెడితే పరిశ్రమలు ముందుకు రాలేదు.. అందుకే మేము ఒక అడుగు ముందుకు వేసి ప్రయత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ అలసత్వం వల్లే హైదరాబాద్ పరిసరాల్లో కాలుష్యకారక పరిశ్రమలు పెరిగాయన్నారు. లీజ్ ల్యాండ్‌లను ఫ్రీ హోల్డ్ చేసేందుకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో తెచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వ భూముల విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు... ఇండస్ట్రీల వద్ద ఉన్న భూముల గురించే పాలసీ రూపొందించామన్నారు. మా ప్రభుత్వం తెచ్చిన పాలసీపై నాచారం ఇండస్ట్రీయల్ అసోసియేషన్ మద్దతు తెలిపిందని తెలిపారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే అడ్డుకుంటరు. కాలుష్యకారక పరిశ్రమలు తరలిస్తామంటే అడ్డుకుంటరు ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇండస్ట్రీ భూముల కన్వర్షన్‌పై విచారణ జరుపుతామన్నారు. పాలసీ లేకుండా కన్వర్షన్ చేశారు. ఇది కొందరికి లాభం జరిగిందన్నారు. కెటిఆర్ రాహుల్ గాంధీకే కాదు ఎవరికైనా లేఖ రాయవచ్చు, నాలుక ఉందని అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. దమ్ముంటే ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు రుజువులు చూపించాలని సవాల్ విసిరారు. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే ఎకరం భూమి ఇండస్ట్రీలకు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్నాయి, పట్టణాల్లో కాదన్నారు.



# కర్ణాటకలో సిపిఐ రాష్ట్ర జాతా

### ప్రారంభించిన ప్రధాన కార్యదర్శి డి.రాజా




**కోలార్ గోల్డ్‌ఫీల్డ్:** భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) శతవార్షికోత్సవాలలో భాగంగా కర్ణాటకలో కోలార్ గోల్డ్ ఫీల్డ్ నుండి రాష్ట్రవ్యాప్త జాతాను పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం ప్రారంభించారు. కమ్యూనిస్టుపార్టీ ప్రఖ్యాత నాయకుడు పి.జీవానందం (జీవా) 70 సంవత్సరాలక్రితం ఎక్కడైతే పార్టీ జెండా ఎగురవేసి ప్రసంగం చేశారో అదే ప్రదేశంలో డి.రాజా మొదట సిపిఐ పతాకాన్ని ఎగురవేసి ఆ తర్వాత పార్టీ రాష్ట్రస్థాయీ జాతాను ప్రారంభించారు. కోలార్ జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి జ్యోతి బసు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కర్ణాటక రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి సాథి సుందరేశ్, సిపిఐ(ఎం) కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్, సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శాసనసభ్యుడు టి.రామచంద్రన్, తమిళనాడు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు సంతోష్, రఘు, ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి హరీశ్ బాల, డి.ఎం.కె, కాంగ్రెస్, విసికె, ఎండిఎంకె పార్టీలకు చెందిన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రాజకీయపార్టీలు, సంస్థలు ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు అభినందనలు తెలియజేశారు. సాథి సుందరేశ్ నాయకత్వంలో జరిగే ఈ రాష్ట్ర జాతా కర్ణాటకలోని అన్ని జిల్లాలమీదుగా ప్రయాణించి డిసెంబరు 23వ తేదీన బెంగళూరులో ముగుస్తుంది.

# గవర్నర్ ఆమోదం..

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించేందుకు రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లన్నింటినీ జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్‌ఆర్)కి లోపల, బయట, దానిని ఆనుకొని ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలనే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం జిహెచ్‌ఎంసి చట్టం, తెలంగాణ మున్సిపాలిటీల చట్టాలకు అవసరమైన సవరణలు చేయాలని తీర్మానించింది.

**జిహెచ్‌ఎంసిలో విలీనం కానున్న పురపాలికలివే...**

మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా: బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగర్, నిజాంపేట్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, తూముకుంట, కొంపల్లి, దుండిగల్ రంగారెడ్డి జిల్లాలోని బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్పేట్, పెద్ద అంబర్పేట్, జల్పల్లి, శంషాబాద్, తుర్కయాంజాల్, నార్సింగి, మణికొండ, ఆదిభట్ల, తుక్కుగూడ.

**సంగారెడ్డి జిల్లా:** బొల్లారం, తెల్లాపూర్, అమీన్పూర్.

# 1000 మంది మృతులు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. మరోవైపు భారత ప్రభుత్వం శ్రీలంకలో నిలిచిపోయిన భారతీయులను వెనక్కు తీసుకువచ్చే ప్రక్రియ సోమవారం ముగించింది. చివరి బ్యాచ్‌లో 104 మంది భారతీయులను "ఆపరేషన్ సాగర్ బంధు" లోభాగంగా కొలంబో నుండి తిరువనంతపురానికి తీసుకువచ్చింది. ఉదయం 6.30 గంటలకు ఐఎఫ్ విమానంలో వీరంతా తిరువనంతపురం చేరుకున్నారు. శ్రీలంకలో దిత్వా తుఫాను, వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘోర సంఘటనల్లో మృతులసంఖ్య 355కు పెరిగింది. ఇంకా మరో 366 మంది జాడ తెలియడంలేదు. వారి మృత దేహాలకోసం సహాయ బృందాలు తీవ్ర గాలింపు చేస్తున్నాయి. కొండచరియలు విరిగిపడిన రాళ్ళు, మట్టి, బురదను తొలగించే పని కొనసాగుతున్నది. ఇక ఇండోనేసియాలో కూడా వరదలు, భారీ వర్షాల వల్ల మరణించినవారి సంఖ్య 604కు పెరిగింది. థాయ్‌లాండ్‌లో వరదలవల్ల మరణించినవారి సంఖ్య176కు చేరింది. వరదల కారణంగా శ్రీలంక,ఇండోనేసియా దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ రెండు దేశాలూ తమ తమ సైన్యాలను సహాయ కార్యక్రమాల నిమిత్తం రంగంలోకి దించాయి. థాయ్‌లాండ్‌లో 12 రాష్ట్రాలు వరదలవద్ద దెబ్బతిన్నట్లు ప్రధాన మంత్రి అనుతిన్ ఛర్న్‌విరకుల్ చెప్పారు. 14 లక్షల కుటుంబాలు వదలవల్ల నష్టపోయాయని చెప్పారు. శ్రీలంకలో 1.48 లక్షలమంది నివాసితులు తాత్కాలిక కేంద్రాలలో తలదాచుకుంటున్నారు. ఉత్తర సుమత్రాలో 2,90,700 మంది వరదలవల్ల నష్టపోయారు.

# క్షమాభిక్ష వద్దు

(మొదటి పేజీ తరువాయి)

తరహాలు ప్రజలు దుస్తులు ధరించి వ్యంగ్య ధోరణిలో నినాదాలు చేశారు. దీర్ఘకాలంగా నెతన్యాహూపై అవినీతి కేసులు నలుగుతున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన సందర్భంగా ౦౦తకుముందు కూడా నెతన్యాహూకు క్షమాభిక్ష ప్రసాదించాలని అధ్యక్షుడు హెర్జోగ్‌ను కోరారు. ఈ నేపథ్యంలో నెతన్యాహూ దేశాధ్యక్షుడికి ఒక పేజీలో క్షమాపణ లేఖ సమర్పించారు. ఐతే తాను ఏ తప్పు చేయలేదని మరోసారి ఆ లేఖలో ఆయన వాదించారు. ఆయన నేరాన్ని అంగీకరించలేదు. కానీ క్షమాపణలు చెప్పడం తన నైతిక బాధ్యత అన్నారు. ఐతే హెర్జోగ్ తొలుత ట్రంప్ విజ్ఞప్తికి స్పందిస్తూ, మొదట నెతన్యాహూ పద్ధతి ప్రకారం తనకు ఒక క్షమాపణ లేఖ ఇవ్వాలని కోరారు. ఈ లేఖపై స్పందిస్తూ, ఈ లేఖను ఆమోదించే విషయంలో చట్టపరమైన విషయాలను తాను క్షుణ్ణంగా పరిశీలిస్తానని హెర్జోగ్ చెప్పారు.

# ఎఐ ఎందుకు వాడట్లే?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు సూచించింది. దీంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. హర్యానాలో వృద్ధ దంపతులు డిజిటల్ అరెస్ట్ బారిన పడిన ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీం, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు దీని బారిన అధికంగా పడుతున్నారని అభిప్రాయపడింది. మరో వైపు సైబర్ మోసాలకు ఉపయోగించిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడంలో ఎఐ, మెషీన్ లర్నింగ్ లాంటి సాంకేతికతను ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించింది. ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ జోక్యం చేసుకుని వివరాలు అందించాలని, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో సిబిఐ దర్యాప్తునకు సహకారం అందించాలని ఆదేశించింది. పౌరులను మోసం చేయడంలో సహకారం అందించిన బ్యాంక్ అధికారులను గుర్తించాలని సిబిఐకి చెప్పింది. ఆఫ్‌శోర్ ట్యాక్సులు ఉన్న దేశాల్లో ఉంటూ మోసాలకు పాల్పడున్న నేరస్థులను పట్టుకునేందుకు ఇంటర్‌పోల్ సాయం తీసుకోవాలని సిబిఐకి సూచించింది.

**సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు**

సైబర్ మోసాలకు వాడే అవకాశం ఉన్నందున ఒక వ్యక్తికి అనేక సిమ్‌లు కేటాయించకుండా టెలికాం ఆపరేటర్లు ఆదేశాలు ఇవ్వాలని టెలికాం మంత్రిత్వ శాఖను అదేశించింది. ఆన్‌లైన్ మోసాలను అడ్డుకునేందుకు సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెప్పింది. దీనిపై కేంద్ర హోం, టెలికాం, ఆర్థిక సహా పలు శాఖల స్పందన తెలియజేయాలంటూ సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది. ప్రజలను మోసం చేసే ఖాతాలను ఫ్రీజ్ చేసేలా సీబీఐ సహా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు దర్యాప్తు సంస్థలకు స్వేచ్ఛ ఇవ్వాలని అభిప్రాయపడింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com